/manamnews
www.manamnews.com

# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

తిరుపతి | మంగళవారం • 21-3-2023 • సంపుటి:7 • సంచిక:76 • పేజీలు:8 • వెల:రూ.5

AMARAVATHI | ANANTHAPURAM | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | KADAPA | HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHBUBNAGAR | WARANGAL | KHAMMAM

ఫాల్గుణమాసం, మంగళవారం, తిథి: అమావాస్య, ఉ.1.47 నుంచి రా. 10.53 వరకు, నక్షత్రం: పూర్వాభాద్ర, సా.5.25 వరకు, వర్జ్యం: ఉ.2.16-3.44 వరకు, దుర్ముహూర్తం: ఉ.11.59-మ.12.47 వరకు, రాహుకాలం: మ.3.23-4.53 వరకు

## భారీగా పెరిగిన బంగారం ధర..



న్యూఢిల్లీ, మార్చి 20: బంగారం ధర మరోసారి భారీగా పెరిగింది. అంతర్జాతీయంగా ధర పెరగడంతో దేశీయంగానూ పసిడి ధరకు రెక్కలొచ్చాయి. సోమవారం ఢిల్లీ స్పాట్ మార్కెట్లో 10 గ్రాముల మేలిమి బంగారం ధర ఒకే రోజు రూ.1400 పెరిగి రూ.61,100కు చేరింది. వెండి ధర సైతం రూ.1860 పెరిగి రూ.69,340కి చేరింది. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్సు బంగారం ధర 2005 డాలర్లు పలుకుతుండగా.. వెండి 22.55 డాలర్లుగా ఉందని హెచ్డీఎఫ్సీ సెక్యూరిటీస్ సీనియర్ అనలిస్ట్ సౌమిల్ గాంధీ ..మిగతా 2లో

## ఐసీసీ ద్వంద్వ వైఖరి విడనాడాలి

### పుతిన్ అరెస్టు వారెంట్‌పై స్పందించిన డ్రాగన్



బీజింగ్, మార్చి 20: రష్యా అధ్యక్షుడు పుతిన్‌కు అంతర్జాతీయ న్యాయ స్థానం జారీ చేసిన అరెస్టు వారెంట్‌పై చైనా స్పందించింది. ఐసీసీ తన ద్వంద్వ వైఖరిని విడనాడాలని ..మిగతా 2లో

# అసెంబ్లీలో రగడ..

### టీడీపీ, వైసీపీ సభ్యుల మధ్య ఘర్షణ..




జీఓం నెం.1పై సభలో ఉద్రిక్తత

జీఓను రద్దు చేయాలంటూ టీడీపీ డిమాండ్

పరస్పరం సవాళ్లు విసురుకున్న ఎమ్మెల్యేలు

టీడీపీ ఎమ్మెల్యే బాలవీరాంజనేయ, వైసీపీఎమ్మెల్యే సుధాకర్ బాబు మధ్య వాగ్వాదం

తమపై దాడి చేశారంటూ ప్రభుత్వ, ప్రతిపక్ష ఎమ్మెల్యేల పరస్పర ఆరోపణలు

తీవ్ర ఉద్రిక్తతల మధ్య సభ వాయిదా

అమరావతి, మార్చి 20 (మనం న్యూస్): జీవో నెం.1 రద్దుకు సంబంధించి ఏపీ అసెంబ్లీలో నేడు ప్రభుత్వ, ప్రతిపక్షాల మధ్య ఉద్రిక్తతలు చోటుచేసుకున్నాయి. దీంతో.. స్పీకర్ సభను వాయిదా వేయాల్సి వచ్చింది. సభ ప్రారంభమైన వెంటనే టీడీపీ సభ్యులు జీవో నెం.1 రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ వాయిదా తీర్మానాన్ని ప్రతిపాదించారు. క్వశ్చన్ అవర్ ప్రారంభమైన వెంటనే జీఓ నెం.1పై చర్చకు పట్టుబట్టారు. దీనిపై స్పీకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. చైర్‌కు ఏం చేయాలో నిర్దేశిస్తున్నారంటూ టీడీపీ సభ్యుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ హక్కులను హరించవద్దంటూ టీడీపీ సభ్యులు పేర్కొన్నారు. ఈ క్రమంలో టీడీపీ సభ్యులు తమ హక్కులను సక్రమంగా వినియోగించుకోవాలని స్పీకర్ సూచించారు. దీంతో.. టీడీపీ సభ్యులు స్పీకర్ పోడియం వద్ద నిరసనకు దిగారు. ఈ క్రమంలో వైసీపీ సభ్యులు టీడీపీ ఎమ్మెల్యేల తీరుపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. మంత్రులు అంబటి రాంబాబు, చెల్లుబోయిన వేణుగోపాల కృష్ణ, డిప్యూటీ సీఎం అంజన్ బాషా, ..మిగతా 2లో



# విద్యార్థుల పేరుతో అతిపెద్ద స్కాం..

ఈ స్కాంను మించిన అవినీతి ఎక్కడా ఉండదు

డబ్బు దోచేయడం బాబుకు మాత్రమే తెలిసిన గొప్ప కళ

అసెంబ్లీలో సీఎం జగన్ ప్రసంగం

అమరావతి, మార్చి 20 (మనం న్యూస్): సీఎం జగన్ అసెంబ్లీలో ప్రసంగిస్తూ స్కిల్ డెవలప్ మెంట్ స్కాంను ప్రస్తావిస్తూ చంద్రబాబుపైనా, గత టీడీపీ ప్రభుత్వంపైనా తీవ్ర విమర్శలు చేశారు. విద్యార్థుల పేరుతో జరిగిన అతిపెద్ద స్కాం స్కిల్ డెవలప్ మెంట్ స్కాం అని తెలిపారు. నైపుణ్యాభివృద్ధి పేరుతో ఏకంగా డబ్బులు దోచేయడం చంద్రబాబుకు మాత్రమే తెలిసిన గొప్ప కళ అని ఎద్దేవా చేశారు. రూ.100 పనికి రూ.10 అడ్వాన్స్ గా తీసుకుని, ఆ రూ.10ని కూడా దోచుకున్న తీరుగా ఈ స్కాం ఉందని సీఎం జగన్ వివరించారు. దేశ చరిత్రలోనే ఇదొక పెద్ద స్కాం అని పేర్కొన్నారు. 'ఈ స్కాంను నడిపింది సాక్షాత్తు చంద్రబాబు. అందుకు ఆధారాలు ..మిగతా 2లో



## ఏటీఎంలలో రూ.2 వేల నోటు ఉంచాలా? వద్దా..?

అది బ్యాంకుల స్వతంత్ర నిర్ణయం

2023 మార్చి నాటికి కేంద్రం అప్పు 155.8 లక్షల కోట్లు

కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్

న్యూఢిల్లీ, మార్చి 20: ఒకప్పటితో పోలిస్తే ఏటీఎం కేంద్రాల్లో రూ.2వేల నోట్లు మునుపటిలా కనిపించడం లేదు. దీంతో ఉద్దేశపూర్వకంగానే ఆ నోట్లను తగ్గిస్తున్నారంటూ ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఏటీఎం కేంద్రాల్లో రూ.2వేల నోటు లభ్యతపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ..మిగతా 2లో



## యాంటిబయాటిక్స్‌పై కేంద్రం కొత్త మార్గదర్శకాలు

న్యూఢిల్లీ, మార్చి 20: ఇన్‌ఫ్లుయెంజా భయాల వేళ దేశవ్యాప్తంగా కొవిడ్ కేసులు మళ్లీ పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. ఈ క్రమంలోనే కొవిడ్ బాధితుల చికిత్సకు కేంద్రం మార్గదర్శకాలను సవరించింది. కొవిడ్ బాధితుల్లో బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్‌ను గుర్తిస్తేనే యాంటీబయాటిక్స్ చికిత్సలో ఉపయోగించాలని వైద్యులకు సూచించింది. అంతేగాక, అజిత్రోమైసిన్, ఐవర్మెక్టిన్ వంటి ఔషధాలను కూడా ఉపయోగించవద్దని స్పష్టం చేసింది. ''ఇతర అంటువ్యాధుల ..మిగతా 2లో

## అర్థవంతమైన చర్చల్లేకుండా ఈ దాడులేంటి?

టీడీపీ ఎమ్మెల్యేలపై జరిగిన దాడిని ఖండిస్తున్నా

జనసేన అధినేత పవన్ కల్యాణ్




అమరావతి, మార్చి 20 (మనం న్యూస్): అసెంబ్లీలో టీడీపీ ఎమ్మెల్యేలపై జరిగిన దాడి ఘటనపై జనసేన అధినేత పవన్‌కల్యాణ్ స్పందించారు. అర్థవంతమైన చర్చలు లేకుండా ఈ దాడులేంటని వైసీపీని ఉద్దేశించి ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ ఎమ్మెల్యేపై జరిగిన దాడిని ఖండిస్తున్నట్లు చెప్పారు. ఈ మేరకు పవన్ ఓ ప్రకటన ..మిగతా 2లో

## శాసనసభ కాదు.. కౌరవ సభ..



చరిత్రలో ఇది చీకటి రోజు

ఎమ్మెల్సీ ఎన్నికలు ఆరంభమే..

వచ్చే సునామీలో వైసీపీ కొట్టుకుపోవడం ఖాయం

బెదిరిస్తే పారిపోతామనుకుంటున్నారా?

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎన్ని సవాళ్లు వచ్చినా సమర్థంగా ఎదుర్కొన్నాం

టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు

అమరావతి, మార్చి 20 (మనం న్యూస్): రాష్ట్ర అసెంబ్లీ చరిత్రలో ఇవాళ చీకటి రోజు అని టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు అన్నారు. శాసనసభలో ఎమ్మెల్యేలకు రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్ని అవమానాలకు గురిచేసినా వెనక్కి తగ్గబోమని.. రాష్ట్ర ప్రజల కోసం భరిస్తామని చెప్పారు. పట్టభద్రుల ఎన్నికల్లో వచ్చిన ఫలితాలు ఆరంభం మాత్రమేనని.. వచ్చేది సునామీ అన్నారు. ఆ సునామీలో వైసీపీ కొట్టుకుపోవడం ఖాయమని వ్యాఖ్యానించారు. ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ తరపున గెలుపొందిన వేపాడ చిరంజీవి, కంచర్ల శ్రీకాంత్, భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి చంద్రబాబును కలిశారు. ఈ సందర్భంగా ..మిగతా 2లో



## భారత పర్యటనలో జపాన్ ప్రధాని కిషిదా..

ప్రధాని మోదీతో భేటీ..!

న్యూఢిల్లీ, మార్చి 20: భారత పర్యటనలో భాగంగా జపాన్ ప్రధానమంత్రి ఫ్యుమియో కిషిదా సోమవారం ఉదయం ఢిల్లీ చేరుకున్నారు. అనంతరం ప్రధాని మోదీతో భేటీ అయ్యారు. భారత్-జపాన్‌ల వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత విస్తరించడంలో భాగంగా ఇరువురు నేతలు విస్తృత అంశాలపై చర్చలు జరిపినట్లు పీఎం కార్యాలయం వెల్లడించింది. సుమారు 27గంటల పాటు కిషిదా పర్యటన భారత్‌లో కొనసాగనుంది. ఉక్రెయిన్ సంక్షోభంతోపాటు ఇండో పసిఫిక్ ప్రాంతంలో చైనా దూకుడు ప్రదర్శిస్తోన్న సమయంలో తాజా భేటీకి ప్రాధాన్యం సంతరించుకుంది. 'భారత్-జపాన్‌ల ..మిగతా 2లో

## టీడీపీ సభ్యుల తీరు గర్హనీయం

రాష్ట్రంలో అలజడి సృష్టించేందుకు కుట్రలు

స్పీకర్‌ను గౌరవించాల్సిన బాధ్యత సభ్యులపై వుంది

అసెంబ్లీ ఘటనపై మంత్రుల ఆగ్రహం



అమరావతి, మార్చి 20 (మనం న్యూస్): అసెంబ్లీలో సోమవారం జరిగిన పరిణామాలపై మంత్రులు మండిపడ్డారు. రాష్ట్రంలో అలజడి సృష్టించాలని, కులాల మధ్య చిచ్చుపెట్టాలని చంద్రబాబు కుట్ర చేస్తున్నాడని, ఒకరి భుజం మీద తుపాకీ పెట్టి మరొకరిని కాల్చడం చంద్రబాబు నైజమని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున అన్నారు. రాజ్యాంగం మీద ..మిగతా 2లో



2

## దమ్ముంటే వీడియోలను బయటపెట్టాలి



## సహజీవనానికి రిజిస్ట్రేషనా..?

పిల్‌పై సుప్రీం చీఫ్ జస్టిస్ మండిపాటు

న్యూఢిల్లీ, మార్చి 20: దేశంలో సహజీవనం చేసే జంట.. తప్పనిసరిగా రిజిస్టర్ చేసుకుని గుర్తింపు పొందాలని, ఈ మేరకు నిబంధనల రూపకల్పన జరగాలంటూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీం కోర్టు సోమవారం కొట్టేసింది. దీన్నొక మూర్ఖపు ఆలోచనగా అభివర్ణిస్తూ ..మిగతా 2లో

## క్విడ్ ప్రోకో, షెల్ కంపెనీలకు పర్యాయపదం వైసీపీ

బీఏసీ చైర్మన్, టీడీపీ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్



అమరావతి, మార్చి 20 (మనం న్యూస్): ఏపీలో జగన్ ప్రభుత్వం తీరుపై తీవ్రంగా విరుచుకుపడ్డారు టీడీపీ సీనియర్ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్. ఏ స్కామ్ లేని సీమెన్స్ ఒప్పందంలో ఏదో జరిగిపోయిందని చెప్పే ప్రయత్నం ప్రభుత్వం చేస్తోంది. సీమెన్స్ సంస్థ, ప్రేమ్ చంద్రా రెడ్డి, సెంట్రల్ టూల్ డిజైన్స్ సంస్థ తప్పు చేయకుండా చంద్రబాబే తప్పు చేశారా..? ఈడీ ఎంక్వైరీ చేస్తుండగా.. సీఐడీ ఎంక్వైరీ ఎందుకు చేస్తున్నారు. ఈడీ నలుగురిని అరెస్ట్ చేసింది కాబట్టి.. తప్పే నని రీతిలో సీఎం కామెంట్లు చేశారు. అరెస్ట్ చేస్తేనే తప్పు చేసినట్టు అయితే.. ఈ రూల్ సీఎం జగనుకూ వర్తిస్తుంది. అరెస్ట్ ..మిగతా 2లో

## ఐసెట్ దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం

ఏప్రిల్ 19 వరకు స్వీకరణ

మే 20 నుంచి అందుబాటులో హాల్ టికెట్లు




అమరావతి, మార్చి 20 (మనం న్యూస్): ఆంధ్రప్రదేశ్‌లో ఎంబీఏ, ఎంసీయే కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే అర్హత పరీక్ష ఐసెట్. ఈ ఇంటిగ్రేటెడ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ 2023 సంవత్సరానికి గాను దరఖాస్తుల ప్రక్రియ నేడు ప్రారంభం అయింది. ఏపీలో ఈ ఏడాది ఐసెట్ పరీక్షను అనంతపురం శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీ నిర్వహిస్తోంది. ఐసెట్ కన్వీనర్‌తో పాటు ఏపీ హయ్యర్ ఎడ్యుకేషన్ కౌన్సిల్ కూడా దీనిపై వివరాలు తెలిపింది.

**దరఖాస్తులు ఆన్ లైన్‌లో చేసుకోవాలి**

మార్చి 20 నుంచి ..మిగతా 2లో



## అణుదాడికి సిద్ధంగా ఉండండి..

సైన్యానికి కిమ్ జోంగ్ ఉన్ ఆదేశాలు

ఉ.కొరియా సరిహద్దుల్లో అమెరికా-దక్షిణ కొరియా వ్యూహాత్మక దళాలు

2

### మంచిమాట

ఓడిపోతున్నా అని తెలిసిన క్షణంలో కూడా పోరాడేవాడే నిజమైన ధైర్యవంతుడు.

శుభోదయం

## ఐసీసీ ద్వంద్వ వైఖరి విడనాడాలి

(మొదటిపేజీ తరువాయి)

హితవు పలికింది. 'ఐసీసీ నిష్పాక్షిక వైఖరితో వ్యవహరించాలి. అంతర్జాతీయ చట్టాల ప్రకారం అరెస్టుల వంటి వాటి నుంచి దేశాధినేతలకున్న ఇమ్యూనిటీని గౌరవించాలి. అలాగే ఐసీసీ రాజకీయాలకు దూరం ఉండటంతో పాటు ద్వంద్వ వైఖరిని విడనాడాలి' అని చైనా విదేశాంగ ప్రతినిధి వాంగ్ వెన్బిన్ కోరారు. ఉక్రెయిన్‌లోని ఆక్రమిత ప్రాంతాల నుంచి రష్యాకు పిల్లలను చట్టవిరుద్ధంగా తరలించడం వంటి యుద్ధ నేరాలకు బాధ్యుడిగా పేర్కొంటూ తాము వారెంట్ జారీ చేసినట్లు ఐసీసీ స్పష్టం చేసింది. గతేడాది ఫిబ్రవరిలో ఉక్రెయ్పు సైనిక చర్య మొదలు ఈ నేరాలకు పాల్పడినట్లు పేర్కొంది. అయితే.. తాము ఐసీసీని గుర్తించడం లేదని, అందువల్ల దాని చర్యలు రష్యాపై చెల్లుబాటుకావని క్రెమ్లిన్ ఇప్పటికే స్పష్టం చేసింది.

**మాస్కో చేరుకున్న జిన్‌పింగ్..**

ఇదిలా ఉంటే.. ప్రస్తుతం చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ రష్యాకు చేరుకున్నారు. మూడు రోజులపాటు ఆ దేశంలో పర్యటించనున్నారు. ఉక్రెయిన్‌పై రష్యా దాడి కొనసాగుతోన్న వేళ.. ఈ పర్యటనకు ప్రాధాన్యం సంతరించుకుంది. ఇద్దరు అధినేతలు సోమవారం రాత్రి చర్చలు జరపనున్నారు. ఇప్పటికే చైనా చెప్పిన శాంతి ప్రణాళికను రష్యా స్వాగతించింది. తమ చర్చల్లో దానిని కూడా భాగం చేసే అవకాశముందని చెప్పింది. బీజింగ్ కాల్పుల విరమణకు పిలుపునివ్వగా.. పశ్చిమ దేశాలు ఆ ప్రతిపాదనను తిరస్కరిస్తున్నాయి.

## భారీగా పెరిగిన బంగారం ధర..

(మొదటిపేజీ తరువాయి)

తెలిపారు. ఉక్రెయిన్- రష్యా యుద్ధం ప్రారంభమైన తొలినాళ్లలో పసిడికి భారీగా డిమాండ్ ఏర్పడింది. యుద్ధ పరిస్థితులు మదుపరులను తీవ్రంగా కలవరపెట్టాయి. దీంతో అంతర్జాతీయంగా ఔన్సు బంగారం ధర గతేడాది మార్చిలో 2052 డాలర్లు పలికింది. గత కొంతకాలంగా పసిడి తగ్గుతూ వచ్చింది. ఈక్విటీ మార్కెట్లు రాణించడంతో బంగారం ధర దిగి వచ్చింది. ఇటీవల కాలంలో మార్చి 8 నాటికి 1818 డాలర్ల కనిష్ఠానికి చేరింది. ఫలితంగా దేశీయంగా 10 గ్రాముల పసిడి రూ.56-57వేల స్థాయికి చేరింది. ఇటీవల బ్యాంకింగ్ రంగంలో చోటుచేసుకుంటున్న వరుస పరిణామాలు బంగారం ధరకు రెక్కలు రావడానికి కారణమయ్యాయి. అనూహ్యంగా పది రోజుల వ్యవధిలోనే పసిడి ధర రూ.56వేల స్థాయి నుంచి రూ.60వేల స్థాయికి చేరింది.

**ఎన్నాళ్లీ దూకుడు..?**

ఎప్పుడైతే అమెరికాలో సిలికాన్ వ్యాలీ బ్యాంక్ ఎప్పుడైతే పతనం అయ్యిందో.. మదుపరుల్లో భయాలు మొదలయ్యాయి. దీనికితోడు రోజుల వ్యవధిలోనే సిగ్నేచర్ బ్యాంక్ మూతపడడం, స్విట్జర్లాండ్‌కు చెందిన క్రెడిట్ సూయిజ్ పతనావస్థకు చేరడం వంటి పరిణామాలు వారి భయాలను మరింత పెంచాయి. దీంతో అనిశ్చిత పరిస్థితులు సురక్షిత పెట్టుబడి సాధనంగా భావించే బంగారంవైపు మదుపరులు తమ పెట్టుబడులను మరలిస్తున్నారు. ఈ క్రమంలో అంతర్జాతీయ స్పాట్ గోల్ మార్కెట్లో ఔన్సు బంగారం ధర 2000 డాలర్లను తాకింది. యూఎస్ గోల్ ఫ్యూచర్ సైతం 2 శాతం పెరిగి 2012 డాలర్లకు చేరింది. అయితే, గత కొంత కాలంగా వడ్డీ రేట్లు పెంచుతూ వస్తున్న అమెరికా ఫెడరల్ రిజర్వ్ మరోసారి మంగళవారం సమావేశం కానుంది. వరుస బ్యాంకింగ్ పతనాల నేపథ్యంలో ఆచితూచి నిర్ణయం వెలువరించే అవకాశం ఉందని తెలుస్తోంది. ఫెడ్ వెలువరించే రేట్ల నిర్ణయం బంగారం ధరకు దిశానిర్దేశం చేస్తుందని నిపుణులు చెబుతున్నారు.

## ఏటీఎంలలో రూ.2 వేల నోటు ఉంచాలా? వద్దా..?

(మొదటిపేజీ తరువాయి)

స్పష్టతనిచ్చారు. ఏటీఎంలలో నోట్లను ఉంచాలని గానీ, ఉంచొద్దని గానీ తాము బ్యాంకులకు సూచించలేదని లోక్‌సభలో ఓ సభ్యుడు అడిగిన ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా వార్షిక నివేదిక ప్రకారం.. 2017 మార్చి నాటికి చలామణీలో ఉన్న రూ.500, రూ.2000 వేల నోట్ల విలువ రూ.9.512 లక్షల కోట్లు కాగా.. 2022 మార్చి నాటికి ఆ మొత్తం రూ.27.057 లక్షల కోట్లకు పెరిగిందని నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. ఏటీఎం కేంద్రాల్లో నోట్లను అందుబాటులో ఉంచడమనేది బ్యాంకుల స్వతంత్ర నిర్ణయమని తెలిపారు. కాలానికి అనుగుణంగా, ఖాతాదారుల అవసరాలను బట్టి నోట్లను జమ చేస్తుంటాయని పేర్కొన్నారు. కేంద్రం అప్పులకు సంబంధించి మరో ప్రశ్నకు బదులిస్తూ.. 2023 మార్చి 31 నాటికి కేంద్రం అప్పులు రూ.155.8 లక్షల కోట్లకు చేరుకుంటుందని అంచనా వేశారు. ఇది దేశ జీడీపీలో 57.3 శాతం ఉంటుందని అంచనా వేశారు.

## యాంటిబయాటిక్స్‌పై కేంద్రం కొత్త మార్గదర్శకాలు

(మొదటిపేజీ తరువాయి)

వ్యాప్తితో కొవిడ్ సోకే ప్రమాదాన్ని తప్పనిసరిగా పరిగణనలోకి తీసుకోవాలి. కొవిడ్ బాధితుల్లో బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్ సోకినట్లు క్లినికల్‌గా లక్షణాలు కన్పిస్తేనే యాంటీబయాటిక్స్‌ను వాడాలి. లేదంటే వాటి అవసరం లేదు. పినవిర్-రిటోనవిర్, హైడ్రోక్లోరోక్విన్, ఐవర్మెక్టిన్, మోల్నుపిరావిర్, ఫావిపిరావిర్, అజిత్రోమైసిన్, డాక్సీసైక్లిన్ వంటివి కొవిడ్ చికిత్సలో ఉపయోగించకూడదు. కొవిడ్ తీవ్రత ఎక్కువగా ఉన్న బాధితులకు ఐదురోజుల పాటు రెమిడెసివిర్ ఇవ్వొచ్చు'' అని కేంద్రం ఆ మార్గదర్శకాల్లో స్పష్టం చేసింది. దేశంలో కరోనా కేసులు మళ్లీ పెరుగుతున్నాయి. ఆదివారం దేశవ్యాప్తంగా వెయ్యికి పైగా కేసులు నమోదవ్వగా.. సోమవారం 918 కొత్త కేసులు వెలుగుచూశాయి. అటు యాక్టివ్ కేసులు కూడా 6,350కి చేరాయి.

## భారత పర్యటనలో జపాన్ ప్రధాని కిషిదా..

(మొదటిపేజీ తరువాయి)

మధ్య వ్యూహాత్మక, అంతర్జాతీయ భాగస్వామ్యం ఎంతో ముఖ్యమైంది. జీ20కి భారత్, జీ7కు జపాన్ అధ్యక్షత వహిస్తోన్న సమయంలో కలిసి పనిచేయడమనేది మంచి అవకాశం. భారత అధ్యక్షతన జరుగుతోన్న జీ20 సదస్సుకు సంబంధించి ప్రాధాన్యాలను పీఎం కిషిదాకు వివరించా. ఇరు దేశాల ద్వైపాక్షిక సంబంధాలను సమీక్షించాం. రక్షణ, డిజిటల్ టెక్నాలజీ రంగాల్లో సహకారంపై అభిప్రాయాలు పంచుకున్నాం. సెమీ కండక్టర్ల సరఫరా గొలుసుతోపాటు ఇతర ముఖ్యమైన సాంకేతికతలపై చర్చలు జరిపాం' అని కిషిదాతో భేటీ అనంతరం ప్రధాని నరేంద్ర మోదీ వెల్లడించారు. జపాన్ ప్రధానమంత్రి ఫ్యుమియో కిషిదా మాట్లాడుతూ.. స్వేచ్ఛాయుత ఇండో పసిఫిక్‌కు సంబంధించిన ప్రణాళికను భారత్లోనే వెల్లడిస్తానని అన్నారు. భారత్తో తమ ఆర్థిక సహకారం అభివృద్ధికి దోహదం చేయడంతోపాటు జపాన్‌కూ ఆర్థిక అవకాశాలను సృష్టిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అంతకుముందు మాట్లాడిన ఇరు దేశాల ప్రతినిధులు.. రక్షణ, భద్రత వంటి అంశాలతోపాటు వాణిజ్యం, పెట్టుబడులు, నూతన సాంకేతికతల్లో పరస్పర సహకారాన్ని పెంపొందించుకోవడంపై దృష్టి సారిస్తున్నామని చెప్పారు. శాంతియుత, స్థిరత్వ, సుసంపన్నమైన ప్రపంచం కోసమే ఇరుదేశాలు ఈ ద్వైపాక్షిక చర్చలు జరుపుతున్నాయని భారత విదేశాంగ మంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి అరిందమ్ బాగ్చి వెల్లడించారు.

# దమ్ముంటే వీడియోలను బయటపెట్టాలి

### ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటమితో

### పిచ్చి పరాకాష్ఠకు చేరింది

### మా తప్పుంటే ఏ శిక్షకైనా సిద్ధం

### సర్కారుపై టీడీపీ ఎమ్మెల్యేల ఆగ్రహం




అమరావతి, మార్చి 20 (మనం న్యూస్): ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటమితో వైసీపీలో పిచ్చి పరాకాష్ఠకు చేరిందని టీడీపీ ఎమ్మెల్యేలు విమర్శించారు. అసెంబ్లీలో తమ పార్టీ ఎమ్మెల్యేలు డోలా బాల వీరాంజనేయస్వామి, గోరంట్ల బుచ్చయ్యచౌదరిపై జరిగిన దాడి ఘటనలను వారు తీవ్రంగా ఖండించారు. సభ వాయిదా అనంతరం డోలా బాల వీరాంజనేయస్వామి, గోరంట్ల బుచ్చయ్యచౌదరితో పాటు మిగిలిన టీడీపీ ఎమ్మెల్యేలు బెందాళం అశోక్, ఏలూరి సాంబశివరావు మీడియాతో మాట్లాడారు. వైకాపా ప్రభుత్వానికి దమ్ముంటే సభలో జరిగిన పరిణామాలపై వీడియోలను బయట పెట్టాలని డిమాండ్ చేశారు.

''శాసనసభలో వైకాపా ఎమ్మెల్యేలు సుధాకర్‌బాబు, ఎలీజా నాపై దాడి చేశారు. స్పీకర్ పోడియం వద్ద నిరసన తెలుపుతుండగా దాడికి పాల్పడ్డారు. ఈ సంస్కృతి మంచిది కాదు. గౌరవ సభను కౌరవసభగా మార్చేశారు. సీఎం జగన్ దృష్టిలో పడాలనే ఉద్దేశంతోనే మాపై దాడి చేశారు. తిరిగి మేమే స్పీకర్‌పై దాడి చేసినట్లు మీడియా ముందు అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారు. అసెంబ్లీలో ఘటనలపై వీడియోలను ఎడిట్ చేయకుండా విడుదల చేయండి. స్పీకర్‌పై నేను అనుచితంగా ప్రవర్తించినట్లు రుజువైతే నాపై ఏ శిక్ష విధించినా దానికి కట్టుబడి ఉంటాను. ముందస్తు ప్రణాళికలో భాగంగానే ఇది జరిగింది. ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ గెలుపును పక్కదోవ పట్టించేందుకే ఇలా చేశారు. స్పీకర్ సమక్షంలోనే ఇది జరిగినందున నాపై దాడి చేసిన వారిపై ఆయన చర్యలు తీసుకోవాలి'' అని డోలా బాల వీరాంజనేయస్వామి అన్నారు.

''ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ కోసం మేం పోరాడుతున్నాం. జీవో నంబర్ 1పై రాష్ట్రవ్యాప్తంగా పోరాటం జరుగుతోంది. అందుకే దీనిపై సభలో వాయిదా తీర్మానం ఇచ్చి చర్చకు పట్టుబట్టాం. స్పీకర్ అనుమతించలేదు. దీంతో పోడియం వద్ద నిరసన తెలిపాం. ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలతో వైకాపా నేతలు ఫ్రస్ట్రేషన్‌లో ఉన్నారు. అందుకే మతిభ్రమించి మాపై దాడి చేశారు. ఒక దళిత ఎమ్మెల్యేపై దాడి జరుగుతుంటే స్పీకర్ కనీసం పట్టించుకోలేదు. ఆయన ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారు. మాకు మైక్ ఇవ్వకుండా నిరోధిస్తున్నారు. 40 ఏళ్లుగా శాసనసభకు వస్తున్నా.. ఏనాడూ ఇలాంటి ఘటనలు చూడలేదు. మంత్రి కారుమూరు నాగేశ్వరరావు, మాజీ మంత్రి వెలంపల్లి మాపై దాడికి రావడమేంటి? నేను పోడియం బయట ఉంటే వెలంపల్లి దూసుకొచ్చి నా చేతిలోని ప్లకార్డులు లాక్కొని పచ్చి బూతులు మాట్లాడారు. దాడులు చేయమని సీఎం వారిని ప్రోత్సహిస్తున్నారు. రాష్ట్రంలోని పరిస్థితి వాళ్లకి అర్థమవుతోంది. అందుకే ఇలా ప్రవర్తిస్తున్నారు. ఇలాంటి దుర్మార్గ ప్రభుత్వాన్ని సాగనంపేందుకు ప్రజలు సిద్ధమవుతున్నారు'' అని గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు.

''ప్రజాస్వామ్యంలో ఇది బ్లాక్ డే. బ్రిటిష్ కాలం నాటి జీవో నంబర్1పై వాయిదా తీర్మానం ఇస్తే చర్చ చేపట్టలేదు. సీఎం జగన్ తన రక్షణ కోసం తీసుకొచ్చిన జీవో అది. దళిత ఎమ్మెల్యే ప్లకార్డు పట్టుకుని నిరసన తెలిపితే.. స్పీకర్ దాన్ని పక్కకు నెట్టేశారు. తిరిగి మేం దాడి చేశామని వైకాపా ఎమ్మెల్యేలు ఆరోపిస్తున్నారు. ప్రజాసమస్యలపై ప్రతిపక్ష పార్టీల సభ్యులు పోడియం వద్ద నిరసన తెలుపుతారు. అధికార పార్టీ సభ్యులు అక్కడికి రావాల్సిన అవసరమేంటి?స్పీకర్ మీన మేషాలు లెక్కించకుండా దీనిపై సమాధానం చెప్పాలి. ముందస్తు ప్రణాళికతోనే ఈ దాడి జరిగింది. దీనిపై ప్రజలకు వైకాపా సమాధానం చెప్పాల్సిన అవసరముంది. అసెంబ్లీలో జరిగిన ఘటనల వీడియోలను యథాతథంగా విడుదల చేయాలి'' అని బెందాళం అశోక్ తెలిపారు.

''ఈరోజు దుర్దినం. మా పార్టీకి చెందిన డోలా బాల వీరాంజనేయస్వామిపై భౌతికదాడి అమానుషం. జీవో నంబర్ 1పై వాయిదా తీర్మానం ఇచ్చి చర్చ చేపట్టాలని కోరాం. ఈ క్రమంలో స్వామిపై సంతనూతలపాడు, చింతలపూడి ఎమ్మెల్యేలు సుధాకర్, ఎలీజా దాడి చేశారు. ఇలాంటి వ్యక్తులు ప్రజాప్రతినిధులుగా ఉండటం సిగ్గుచేటు. చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా దారుణంగా ప్రవర్తించారు. ప్రేక్షకపాత్ర వహించిన స్పీకర్ ఆ పదవికి అనర్హుడు. మేమేం దాడి చేశామని ఆరోపిస్తున్న అధికార పార్టీ.. సభలో జరిగిన గందరగోళంపై వీడియోలను బయటపెట్టాలి. అప్పుడే ప్రజలకు వాస్తవాలు తెలుస్తాయి'' అని ఏలూరి సాంబశివరావు అన్నారు.

# విద్యార్థుల పేరుతో అతిపెద్ద స్కాం..

(మొదటిపేజీ తరువాయి)

కూడా ఉన్నాయి. రూ.371 కోట్లు హారతి కర్పూరంలా హరించుకుపోయింది. ఈ డబ్బు షెల్ కంపెనీల ద్వారా రకరకాల మార్గాల్లో వెళ్లి, తిరిగి ఆ షెల్ కంపెనీల ద్వారా చంద్రబాబు వద్దకు వచ్చింది. దోచేసిన డబ్బు జేబులోకి ఎలా తెచ్చుకోవాలో చంద్రబాబుకు బాగా తెలుసు. నేను బటన్ నొక్కితే ప్రజల ఖాతాల్లోకి సొమ్ము వెళుతుంది... చంద్రబాబు బటన్ నొక్కితే ఆయన ఖాతాలోకి డబ్బులు వస్తాయి. చంద్రబాబు అధికారంలోకి వచ్చిన రెండు నెలల్లోనే ఈ స్కాం ఊపిరి పోసుకుంది. ఈ స్కిల్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు కోసం చంద్రబాబు టెండర్ల ప్రక్రియ కూడా చేపట్టలేదు. సీమెన్స్ కంపెనీలోని వ్యక్తితో లాలూచీ పడ్డారు. 90 శాతం సీమెన్స్, 10 శాతం ప్రభుత్వం భరిస్తుందని చెప్పారు. సీమెన్స్ సుమారు రూ.3 వేల కోట్లు ఇస్తుందని ప్రచారం చేశారు. ఒక కంపెనీ ఎక్కడైనా రూ.3 వేల కోట్ల గ్రాంట్ ఇస్తుందా? ఈ ప్రాజెక్టుకు డీపీఆర్ కూడా చేయించలేదు. ఇంత పెద్ద మొత్తంలో ప్రజాధనం దోపిడీకి గురవుతుంటే ఒక్కరూ మాట్లాడలేదు. కారణం ఒక్కటే... డి.పి.టి అని నేను ఇంతకుముందు కూడా పబ్లిక్ మీటింగులలో చెబుతుంటాను. డి అంటే దోచుకో, పి అంటే పంచుకో, టి అంటే తినుకో అని అర్థం. ఇదీ వాళ్ల విధానం. ఎవడూ అడగడు, ఎవడూ రాయడు, ఎవడూ చూపడు... ప్రశ్నిస్తానన్నవాడు ప్రశ్నించడు. ఈ స్కాంను మించిన అవినీతి ఎక్కడా చూడం. క్యాబినెట్‌లో నిర్ణయించినమేరకు జీవో ఇచ్చారు. అయితే జీవోలో ఒకలాగా ఉంటే, ఒప్పందంలో మరొకలాగా ఉంటుంది. 6 క్లస్టర్లు ఏర్పాటు చేస్తామని జీవోలో చెప్పారు. ఒక్కో క్లస్టర్‌కు రూ.546 కోట్లు ఖర్చు చేస్తామన్నారు. జీవోకు, ఒప్పందానికి ఎక్కడా పొంతన లేదు. జీవో స్వరూపాన్ని మొత్తం మార్చేశారు. 10శాతం కాంట్రిబ్యూషన్ అనేది ఒప్పందంలోకి వచ్చేసరికి ఎగిరిపోయింది. ఆర్థికసాయం కింద రూ.330 కోట్లు ఇచ్చేట్టు మార్పులు చేశారు. స్కాంకు ఇక్కడ బీజం పడింది. ఆ తర్వాత 3 నెలల కాలంలో 5 దఫాలుగా రూ.371 కోట్లు విడుదల చేశారు. చంద్రబాబు పాత్ర లేకుండా ఇంత పెద్ద స్కాం జరుగుతుందా? జీవో ఒకలా ఉంది, ఎంవోయూ మరోలా ఉంది... సంతకాలు ఎలా చేశారో చెప్పాలి. తీగ లాగితే డొంక కదిలింది. దీనిపై సీమెన్స్ సంస్థ కూడా అంతర్గత దర్యాప్తు జరిపింది. ప్రభుత్వ జీవోతో తమకు ఎలాంటి సంబంధం లేదని సీమెన్స్ చెప్పింది' అని సీఎం జగన్ వివరించారు.

# శాసనసభ కాదు.. కౌరవ సభ..

(మొదటిపేజీ తరువాయి)



ఆయన వారికి అభినందనలు తెలిపి సత్కరించారు. అనంతరం చంద్రబాబు మాట్లాడారు.

**రామగోపాల్ రెడ్డి పులివెందుల పులి**

''ముగ్గురు ఎమ్మెల్సీలకు మనస్ఫూర్తిగా అభినందనలు తెలియజేస్తున్నాం. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎన్ని సవాళ్లు వచ్చినా సమర్థంగా ఎదుర్కొన్నాం. ముగ్గురు అభ్యర్థులు, పార్టీ శ్రేణులంతా కష్టపడి పనిచేయడం వల్లే విజయం సాధించాం. సాంకేతికతను సద్వినియోగం చేసుకున్నాం. భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి పులివెందుల పులిగా మారారు. అక్కడ జగన్‌రెడ్డి ఓడిపోయి రామగోపాల్ రెడ్డి గెలిచారు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా వెనక్కి తగ్గలేదు. ఓట్ల లెక్కింపు సమయంలోనూ కుట్ర చేశారు. బెదిరింపులకు పాల్పడితే గట్టిగా నిలబడి ఎదుర్కొన్నారు. గెలిచిన తర్వాత డిక్లరేషన్ ఇవ్వకుండా ఇబ్బంది పెట్టారు. డిక్లరేషన్ ఇచ్చే వరకు అక్కడే ఉండాలని సూచించాను. పట్టభద్రుల ఎన్నికల్లోనే కాదు.. ఇక ముందూ మేమేంటో చూపిస్తాం.

**బెదిరిస్తే పారిపోతామనుకుంటున్నారా?**

శాసనసభలోనే దాడులు చేసే సంస్కృతిని వైసీపీ నేతలు తీసుకొచ్చారు. నా జీవితంలో ఎప్పుడూ ప్రతిపక్ష పార్టీల సభ్యులపై దాడి చేయించాలనే ఆలోచన చేయలేదు. స్వామి, గోరంట్లపై దాడులు చేస్తారా? మా ఎమ్మెల్యేలపై దాడి చేసి తిరిగి మావాళ్లపైనే ఆరోపణలా? దాడి చేసిన వారికి వచ్చే ఎన్నికల్లో ప్రజలే బుద్ధి చెబుతారు. పోలీసులు కేసులు పెడితే భయపడే పరిస్థితి లేదు. బెదిరిస్తే పారిపోతామనుకుంటున్నారా? ఎదురు తిరుగుతాం. విజ్ఞతలేని నాయకుడు సీఎంగా ఉంటే ఇలానే జరుగుతాయి. సభా గౌరవాన్ని మంటగలిపే వ్యక్తి ఈ సైకో జగన్. సైకోను ఇంటికి పంపాలంటే ప్రజలంతా ముందుకు రావాలి'' అని చంద్రబాబు పిలుపునిచ్చారు.

## సహజీవనానికి రిజిస్ట్రేషనా..?

(మొదటిపేజీ తరువాయి)

పిటిషన్ కొట్టేశారు చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్. దేశంలో సహజీవనానికి గుర్తింపు ఉండాలని, ఈ మేరకు రిలేషన్‌షిప్‌లో ఉండే ప్రతీజంట రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేసుకోవాలని, అలాగే.. ఆ జంటలకు సామాజిక భద్రత కల్పించాలంటూ ఓ న్యాయవాది ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. ఆ ఆలోచన ద్వారా సహజీవనంలో జరుగుతున్న నేరాల సంఖ్య తగ్గుతుందని అభిప్రాయపడ్డారు ఆ న్యాయవాది. అయితే.. ఈ పిటిషన్‌పై సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ ఘాటుగా స్పందించారు. ఎలాంటి విషయంతోనైనా ఇక్కడికి వస్తున్నారు. ఇలాంటి వాటిల్లో ఇకపై జరిమానాలు విధించడం మొదలుపెడతాం. ఏంటిది?.. రిజిస్ట్రేషనా? ఎవరితో? కేంద్ర ప్రభుత్వంతోనా? సహజీనవంలో ఉన్న జంటలతో కేంద్రం ప్రభుత్వానికి ఏం పని? ఏం సంబంధం అసలు? అంటూ చీఫ్ జస్టిస్ చంద్రచూడ్ తీవ్ర అసహనం వ్యక్తం చేస్తూ.. పిటిషన్‌ను డిస్మిస్ చేస్తున్నట్లు ప్రకటించారు. ఏ ఉద్దేశంతో పిటిషన్ వేశారని న్యాయవాదిని సీజేఐ ప్రశ్నించగా.. సోషల్ సెక్యూరిటీ అనే సమాధానం ఇచ్చారాయన. ఒకానొక తరుణంలో న్యాయవాదిపై ఆగ్రహం వెల్లగక్కిన సీజేఐ.. పిటిషన్‌ను డిస్మిస్ చేశారు. ఢిల్లీలో శ్రద్ధా వాకర్ ఘటన.. ఆపై వరుసగా మరో నాలుగైదు సహజీవన జంటల తాలుకా నేరాలు వెలుగులోకి రావడంతో కేంద్రం తరపు నుంచి లివింగ్ రిలేషన్ షిప్‌లపై రిజిస్ట్రేషన్, గైడ్‌లైన్స్‌ల కోసం తాను సుప్రీంను ఆశ్రయించినట్లు చెప్పారా న్యాయవాది.

## అణుదాడికి సిద్ధంగా ఉండండి..

పాంగ్యాంగ్: ఏ క్షణమైనా అణు ప్రతిదాడి చేసేందుకు సిద్ధంగా ఉండాలని ఉత్తరకొరియా అధినేత కిమ్ జోంగ్ ఉన్ తన సైనిక దళాలను ఆదేశించారు. ఈ విషయాన్ని ఆ దేశ ప్రభుత్వ రంగ వార్తాసంస్థ కేసీఎన్ఏ సోమవారం ధ్రువీకరించింది. ఉ.కొరియా సరిహద్దుల్లో అమెరికా-దక్షిణ కొరియా వ్యూహాత్మక దళాలు సంయుక్తంగా సైనిక విస్తరణ చేయడాన్ని తప్పుపట్టారు. ఇరు దేశాలు సంయుక్తంగా ఉ.కొరియా అణుదాడులను తిప్పికొట్టేలా సైనిక విన్యాసాలు నిర్వహించాక కిమ్ నుంచి ఈ వ్యాఖ్యలు వచ్చాయి. మరోవైపు డమ్మీ అణువార్ హెడ్‌తో ఉత్తర కొరియా ఆదివారం ఓ బాలిస్టిక్ క్షిపణిని పరీక్షించింది. ఇది సుమారు 800 కిలోమీటర్ల దూరం ప్రయాణించి 800 మీటర్ల ఎత్తులో లక్ష్యాన్ని తాకింది. అణుదాడి ఎలా చేయాలనే అంశాన్ని పరీక్షించే క్రమంలో ఈ ప్రయోగం చేశారు. ఎటువంటి అవాంఛనీయ పరిస్థితుల్లో అయినా కచ్చితంగా దాడి చేసేలా దళాల సంసిద్ధతకు ఇది ఉపయోగపడనుందని ఉత్తరకొరియా చెబుతోంది. అమెరికా దళాలు ఫ్రీడమ్ షీల్ పేరిట చేపట్టిన సంయుక్త సైనిక విన్యాసాల్లో స్ట్రాటజిక్ బాంబర్లను వినియోగించడంతో ఉత్తరకొరియా అణుప్రతిదాడులపై దృష్టి సారించింది. ఇటీవల కాలంలో అమెరికా-దక్షిణ కొరియాలు నిర్వహించిన అతిపెద్ద సైనిక విన్యాసాలు ఇవే. వీటిల్లో బీ-1బీ, ఎఫ్-35ఏ యుద్ధ విమానాలు పాల్గొన్నాయి. తాజాగా జరిగిన క్షిపణి పరీక్షకు కిమ్ తన కుమార్తె కిమ్ జుఏతో కలిసి హాజరయ్యారు. ఈ చిత్రాలు ఉత్తరకొరియా మీడియాలో పబ్లిష్ అయ్యాయి. ప్రస్తుతం కిమ్ కుమార్తె వయసు 9 సంవత్సరాలు.



# అసెంబ్లీలో రగడ..

(మొదటిపేజీ తరువాయి)

మల్లాది విష్ణు.. టీడీపీ సభ్యులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. మరోవైపు.. టీడీపీ సభ్యులు స్పీకర్ పోడియం వద్ద తమ నిరసన కొనసాగించారు. ఈ దశలో టీడీపీ సభ్యులను సస్పెండ్ చేయాలంటూ చీఫ్ విప్ ముదునూరు ప్రసాద రాజు తీర్మానాన్ని ప్రతిపాదించే ప్రయత్నం చేశారు. ఇంతలో స్పీకర్ పోడియం వద్ద ఒక్కసారిగా ఉద్రిక్తత పెరిగింది. టీడీపీ ఎమ్మెల్యే బాలవీరాంజనేయ, వైసీపీ ఎమ్మెల్యే సుధాకర్‌బాబు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. తమపై దాడి చేశారంటూ టీడీపీ, వైసీపీ నేతలు పరస్పరం ఆరోపణలు గుప్పించారు. ఈ క్రమంలోనే సభ వాయిదా పడింది. అయితే.. ఈ ఘర్షణకు సంబంధించిన వీడియోను విడుదల చేయాలంటూ టీడీపీ సభ్యులు డిమాండ్ చేశారు.

## అర్థవంతమైన చర్చల్లేకుండా ఈ దాడులేంటి?

(మొదటిపేజీ తరువాయి)

విడుదల చేశారు. ''చట్టసభల గౌరవాన్ని, హుందాతనాన్ని పరిరక్షించాలి. ఇలాంటి ఘటనలతో ప్రజాస్వామ్య స్ఫూర్తికి విఘాతం కలుగుతుంది. టీడీపీ ఎమ్మెల్యేలు డోలా బాల వీరాంజనేయస్వామి, గోరంట్ల బుచ్చయ్యచౌదరిపై దాడిని ప్రజాస్వామ్యవాదులంతా ఖండించాలి. జీవో నంబర్ 1పై చర్చకు స్పీకర్ అనుమతించకపోవడం దారుణం. చట్ట సభలలో అర్థవంతమైన చర్చలు చేసి ప్రజలకు మేలు చేస్తారని అందరం ఆశిస్తాం. పరిపాలన విధానాల్లో ప్రజా ప్రయోజనాలకి విరుద్ధంగా ఉన్నవాటిపై చర్చ చేయాలి. చర్చ కోసం పట్టుబడితే దాడి చేయడం భావ్యం కాదు. ఇదే పరిస్థితి కొనసాగితే ఇలాంటి దాడులు చట్ట సభల నుంచి వీధుల్లోకి వస్తాయి. ఇటువంటి పరిణామాలు ప్రజాస్వామ్యాన్ని పరిహాసం చేస్తాయి. ముందుగా చట్ట సభల గౌరవాన్ని, హుందాతనాన్ని కాపాడాల్సిన బాధ్యత సభా నాయకుడిగా సీఎంపైనా ఉంటుంది'' అని పవన్ అన్నారు.

## టీడీపీ సభ్యుల తీరు గర్హనీయం

(మొదటిపేజీ తరువాయి)

ప్రమాణం చేసి మరీ ఆ స్ఫూర్తికి విరుద్ధంగా టీడీపీ సభ్యులు ప్రవర్తిస్తున్నారని మండిపడ్డారు. అసెంబ్లీ నుంచి ఏడ్చి వెళ్లిపోయి.. బయట ఉండి అమాయకుడైన టీడీపీ దళిత శాసనసభ్యుడిని అడ్డంపెట్టి స్పీకర్పనే దాడికి పురిగొల్పాడని మంత్రి మేరుగ నాగార్జున మండిపడ్డారు. స్పీకర్ తమ్మినేని సీతారాం, వైయస్ఆర్ సీపీ దళిత శాసనసభ్యుడు సుధాకర్ బాబుపై శాసనసభలో టీడీపీ సభ్యులు చేసిన దాడిని మంత్రి మేరుగ నాగార్జున తీవ్రంగా ఖండించారు. మరోవైపు మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ మాట్లాడుతూ.. సభ్య సమాజం సిగ్గుతో తలదించుకునేలా టీడీపీ సభ్యుల తీరు ఉంది. స్పీకర్ ఛైర్ ను గౌరవించాల్సిన బాధ్యత అందరిపై ఉంది. డోలా వీరాంజనేయ స్వామి గడిచిన వారం రోజులుగా సభాపతి కుర్చీని నెట్టడం, ప్లకార్డులు పెట్టడం చేస్తూనే ఉన్నారు. దళిత సభ్యులు, ఉప ముఖ్యమంత్రి పై దాడి చేయటం, దుర్భాషలాడటం చేస్తూనే ఉన్నారు. కాగితాలు చింపి సభాపతి పై వేయటం టీడీపీ ఎమ్మెల్యేలకు అలవాటుగా మారింది. వాళ్ళే దాడి చేస్తారువాళ్ళే భోరున ఏడుస్తారు. బీసీలంటే చంద్రబాబుకు చిన్న చూపు ఉందన్నారు వేణుగోపాల్. బీసీ నాయకుడు తమ్మినేని స్పీకర్ గా ఎన్నిక అయినప్పుడు కూడా కుర్చీ వరకు తీసుకుని వెళ్ళటానికి చంద్రబాబు రాలేదు. స్పీకర్ పట్ల గౌరవాన్ని చూపించటానికి చంద్రబాబుకు మనసు రాలేదు. దెబ్బతిన్నది మా సభ్యుడు సుధాకర్ బాబు అన్నారు మంత్రి వేణుగోపాల్.

## క్విడ్ ప్రోకో. షెల్ కంపెనీలకు పర్యాయపదం వైసీపీ

(మొదటిపేజీ తరువాయి)



అయినంత మాత్రాన తప్పు చేసినట్టు కాదు అనే వాదనే సీఎం జగన్ విషయంలో వైసీపీ చేస్తోంది కదా..? మూడేళ్ల క్రితం సీఐడీ విచారణలో ఏం తేల్చారు..? కేవలం ఓటమి భారం నుంచి తప్పించుకోవడానికే స్కిల్ డెవలప్మెంట్‌పై సభలో చర్చించారు. దేశానికి క్విడ్ ప్రోకో.. షెల్ కంపెనీలు అనే పదాలను పరిచయం చేసింది జగనే అన్నారు పయ్యావుల కేశవ్. క్విడ్ ప్రోకో.. షెల్ కంపెనీలు అనే పదాలను సీఎం జగన్ మాట్లాడితే ఎలా..?సీఎం జగన్ అనుకున్న విధంగా ఈడీ విచారణలో తేలుతుందనే అనుమానం వైసీపీ ప్రభుత్వానికి వచ్చి ఉంటుంది. అందుకే సమాంతరంగా సీఐడీ విచారణ చేపడుతోంది.రెండు రోజుల పాటు సీమెన్స్ ఒప్పందంలో ఏదో జరిగిపోయిందని సభ సమయాన్ని దుర్వినియోగం చేసింది. ఎక్కడో జీఎస్టీ చెల్లింపులకు సంబంధించి జరుగుతోన్న విచారణకు ఏపీకి.. చంద్రబాబుకు సీఎం జగన్ లింక్ పెట్టే ప్రయత్నం చేస్తున్నారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత స్కిల్ డెవలప్మెంట్ మాజీ ఎండీ అర్జా శ్రీకాంత్ ఇచ్చిన నివేదిక బయట పెట్టండి. ఏ అకౌంట్లకు డబ్బులు వెళ్లాయి. ఏ పెద్దల ఖాతాలకు వెళ్లాయోననే వివరాలు విడుదల చేయండి. గత ప్రభుత్వం.. ఈ ప్రభుత్వం ఇచ్చిన నివేదికలేవీ తప్పు పట్టడం లేదు. ఈ ప్రభుత్వం కూడా చాలా మందికి ఉద్యోగాలు ఇప్పించామని స్కిల్ డెవలప్మెంట్ వెబ్ సైట్లల్లో వివరాలు ఉన్నాయి. సీమెన్స్ కంపెనీని విచారణకు పిలవండి. తమకు సంబంధం లేదంటూ సీమెన్స్ సంస్థ ఇచ్చిన స్టేట్మెంటే పట్టుకుని వేలాడుతున్నారు. సీమెన్స్ సంస్థకు డబ్బులు రిలీజ్ చేసింది ఘంటా సుబ్బారావో.. ఇంకొకరో కాదు.. ప్రేమ్ చంద్రారెడ్డి రిలీజ్ చేశారన్నారు కేశవ్.

# ఐసెట్ దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం

(మొదటిపేజీ తరువాయి)

ఏప్రిల్ 19 వరకు దరఖాస్తుల స్వీకరణ
దరఖాస్తు చార్జీ రూ.650
బీసీలకు దరఖాస్తు చార్జీ రూ.600
ఎస్సీ ఎస్టీ అభ్యర్థులకు రూ.550
మే 24, 25 తేదీల్లో ఐసెట్ పరీక్షలు
రెండు షిఫ్టులలో పరీక్షలు
ఉదయం 9 గంటల నుంచి 11.30 గంటల వరకు పరీక్ష
మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్ష
మే 20 నుంచి అందుబాటులో హాల్ టికెట్లు

# మాదకద్రవ్యాలపై విద్యార్థులకు అవగాహన

## -సిఐ ఓబులేష్



చంద్రగిరి, మార్చి 20, మనం న్యూస్ : చంద్రగిరి మండల పరిధిలోని అగరాల. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సోమవారం సిఐ ఓబులేష్ మాదకద్రవ్యాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ క్రమంలో ప్రిన్సిపాల్ ఎమ్మెస్ డాక్టర్ సుకుమార్ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమంలో సీఐ మాట్లాడుతూ జీవితంలో అత్యంత కీలకమైన విద్యార్థి దశలో వ్యసనాలకు బానిసగా మారితే భవిష్యత్తు అంధకారంగా మారుతుందని అన్నారు.మత్తు పదార్థాలు గంజాయి, పాన్ పరాగ్, డ్రగ్స్, సిగరెట్, మద్యపానం, సారాయి ఇటువంటి మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలి, సీనియర్, జూనియర్ విద్యార్థులకు ర్యాగింగ్ లకు పాల్పడవద్దని అన్నారు, ఆన్ లైన్ లో మోసాలు ఎక్కువయ్యానని అన్నారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థి దశలో విద్యార్థులు చదువుపై శ్రద్ధ వహించి, భవిష్యత్తును మీ యొక్క లక్ష్యం వైపు పయనించాలన్నారు. మత్తు పదార్థాలు సేవించడం ద్వారా విద్యార్థుల భవిష్యత్తు నాశనం అవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఐ వంశీధర్, ఐతే పల్లి సచివాలయ మహిళా పోలీస్ హేమావతి, విభాగాధిపతులు టి నరసింహారెడ్డి, డాక్టర్ భక్తవత్సలం, ప్రోగ్రాం ఆఫీసర్ ఎన్ సుభాష్ చంద్రబోస్, అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

# కుప్పంలో ఎర్రచందనం పట్టివేత



కుప్పం, మార్చి 20, మనం న్యూస్: చిత్తూర్ జిల్లా ఎస్పీ రిషాంత్ రెడ్డి ఐపిఎస్ ఉత్తర్వు మేరకు ఎర్రచందనం అక్రమ రవాణా పైన్యాళాపలమనేరు సుధాకర్ రెడ్డి పర్యవేక్షణలో కుప్పం ఇన్స్పెక్టర్ శ్రీధర్ వారి సబ్-ఇన్స్పెక్టర్ శివ కుమార్ మరియు సిబ్బంది సహితముగా ఈరోజు ఉదయం 5.00 గంటలకు నడుమూరు వెళ్ళగా అక్కడ నాలుగు కారులు వుండి ఒక కారులో నుంచి ఇంకో కారులో కొయ్యలను నలుగురు వ్యక్తులు మార్చుతు వుండినారు. పోలీసులు అయిన మమ్మల్ని చూసి సదరు నలుగురు వ్యక్తులు పారిపోవుటకు ప్రయత్నించగా వారిని పట్టుకొని సదరు కార్లను తనిఖీ చేయగా రెండు కార్లలో 11 ఎర్రచందనం దుంగలు వుండి, వాటి మొత్తం బరువు సుమారు 400 కేజీ లు. అంతటా నలుగురు వ్యక్తులను పట్టుకొని కేసు నమోదు చేసి రిమాండుకు పంపడమైనది. ఎర్రచనదనం దుంగలు విలువ 40,00000/- రూపాయలు, ముద్దాయిల వివరాలు. లక్ష్మణ ఆచారి, వయస్సు 30సంవత్సరాలు, తండ్రి: క్రిష్ణమాచారి, స్వస్థలం: కురపర్తి గ్రామం మరియు పంచాయతి, వాయల్పాడు మండలం, అన్నమయ్య జిల్లా పవన్ కుమార్, వయస్సు: 33సం.రాలు, తండ్రి: లేట్ బాలసుబ్రమణ్యం, వేదాంతపురం గ్రామం, తిరుపతి రూరల్ మండలం, తిరుపతి జిల్లా. సయ్యద్ మౌల, వయస్సు: 47సం.రాలు, తండ్రి: లేట్ అబ్దుల్ సత్తార్, డోర్.నెం: 2/43-ఎ, ముస్లిం వీధి, సూలుగిరి టౌన్, క్రిష్ణగిరి జిల్లా, తమిళనాడు రాష్ట్రం. +.క్రిష్ణన్, వయస్సు: 30సం.రాలు, తండ్రి: గణేషన్, మురుగన్ నగర్, బోగనపల్లి పోస్ట్, క్రిష్ణగిరి జిల్లా, తమిళనాడు రాష్ట్ర.చెందిన వారిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినారు

# ఎస్సీ, బీసీల మధ్య ఘర్షణలకు బాబు కుట్ర చేస్తున్నాడు

**- అసెంబ్లీలో వైసిపి దళిత ఎమ్మెల్యేలపై టిడిపి ఎమ్మెల్యేలు దాడి ప్రజాస్వామ్యానికి కళంకం**

**- పూతల పట్టు శాసనసభ్యులు ఎమ్మెస్ బాబు**



పూతలపట్టు, మార్చి 20, మనం న్యూస్: శాసనసభలో టిడిపి ఎమ్మెల్యేలు దళిత ఎమ్మెల్యే ల పై దాడులు చేయడం అత్యంత దారుణమని.. అసలు ప్రజాస్వామ్యంలో ఉన్నమా అనిపించేలా ఉందని పూతలపట్టు శాసనసభ్యులు ఎమ్మెస్ బాబు విస్మయం వ్యక్తం చేశారు. సోమవారం అసెంబ్లీ లో దళిత ఎమ్మెల్యే పై జరిగిన దాడిని ఎమ్మెల్యే ఎమ్మెస్ బాబు ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. ఈ సంఘటనపై ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ వర్గాలకు సముచిత స్థానం కల్పించడంతోపాటు సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ఆర్థిక అభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్నారని. ఎస్సీ బీసీల మధ్య విభేదాలు సృష్టించేలా తెలుగుదేశం పార్టీ వ్యవహరించడం అత్యంత దారుణంగా ఉందన్నారు. దళితుడిగా పుట్టడమే నేరం అన్న చంద్రబాబు నాయుడు ఓట్ల కోసం తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యేలను చంద్రబాబు రెచ్చగొట్టి అసెంబ్లీ కి పంపిస్తున్నారని తెలిపారు.. అసెంబ్లీ సాక్షిగా దాడులు చేయడం శాసనసభ వ్యవస్థని అపహాస్యం పాలు చేస్తున్నారంటూ చంద్రబాబు పై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. అసెంబ్లీ సాక్షిగా వైకాపా ఎమ్మెల్యేలపై ప్రతిపక్ష ఎమ్మెల్యేలు దాడులు చేయడం స్పీకర్ పై అసభ్యకరంగా మాట్లాడడం వంటి చర్యలు మానుకోకుంటే రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు.. చేయాలని డిమాండ్ చేశారు తెలుగుదేశం ఆగడాలను ఐక్యంగా ఎదుర్కొంటామన్నారు. దళితులందరూ ఐక్యంగా ఉండి తెలుగుదేశం పార్టీని ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు.

# ప్రజలకు ఇబ్బంది కల్గించే వ్యాపారులపై చర్యలు తప్పవు



తిరుపతి కార్పొరేషన్, మార్చి 20, మనం న్యూస్: తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ నగర పరిధిలోని ప్రజలకు ఇబ్బందులు కల్గించేలా వ్యాపారాలు చేస్తున్న వారికి, తోపుడు బండ్ల వారికి తగిన చర్యలు తప్పవని తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ అనుపమ అంజలి అన్నారు. తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం జరిగిన డయల్ యువర్ కమిషనర్, అర్జీలు స్వీకరించే కార్యక్రమంలో కమిషనర్ అనుపమ అంజలి, డిప్యూటీ మేయర్ ముద్రనారాయణలు పాల్గొని వచ్చిన సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. అదేవిధంగా సచివాలయ సిబ్బందితో కమిషనర్ అనుపమ మాట్లాడుతూ తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ కార్యలయంలో ప్రతి సోమవారం వచ్చే పిర్యాదులను స్వీకరించి జూమ్ మీటింగ్ ద్వార సంబంధిత సచివాలయ సిబ్బందికి అప్పటికప్పుడే పరిశీలన నిమిత్తం ఇవ్వబడుతుందని, కావున ప్రతి ఒక్క సచివాలయంలో అడ్మిన్ ఆధ్వర్యంలో సెక్రటరీలు అందుబాటులో వుండాలని, ప్రతి ఒక్క సచివాలయ సిబ్బంది యూనిఫామ్ దరించి విధులు నిర్వహించాలని కమిషనర్ అనుపమ అంజలి స్పష్టమైన ఆదేశాలు జారీ చేసారు. తీర్థకట్టవీధిలో తోపుడు బండ్లు అడ్డు కారణంగా వాహనాల పార్కింగ్ చేయడం కష్టంగా వుందని, అదేవిధంగా బ్లిస్ హోటల్ ఎదురుగా తాళ్ళపాక అపార్ట్మెంట్ సమీపంలో రోడ్డుపైన అక్రమముగా షాప్ నిర్మించడంతో వాహనదారులకు ఇబ్బందిగా వుందనే వేరువేరు పిర్యాధులపై స్పందిస్తూ ప్రజలకు ఇబ్బంది కల్గిస్తే తగిన చర్యలు తీసుకుంటామన్నారు. శ్రీనివాసం ఎదురుగా ఓపెన్ డ్రైన్ కోసం త్రవ్వేసి పనులు పూర్తి చేయలదనే పిర్యాదులుపై స్పందిస్తూ మరో పదిరోజుల్లో పనులను చేపడుతామన్నారు. మదురానగర్లో ఓపెన్ డ్రైన్ బ్లాక్ అయినదని, సుందరయ్య నగర్లో మురికినీరు రోడ్డుపైకి వస్తున్నదని, కేశవాయనగుంట వద్ద యూడిఎస్ బ్లాక్ అవుతున్నదని, రాయల్ నగర్లో పెద్ద కాలువని శుభ్రపరచాలనే పిర్యాదులపై స్పందిస్తూ త్వరగా ఆయా సమస్యలను పరిష్కరిస్తామన్నారు. అదేవిధంగా సమస్యలను పరిష్కరించాలని వచ్చిన పిర్యాధీదారులకు హామి ఇస్తూ వారు సూచించిన పిర్యాదులపై తక్షణమే తమ అధికారులు

పరిశీలించి తగు చర్యలు చేపడుతారని కమిషనర్ అనుపమ అంజలి, డిప్యూటీ మేయర్ ముద్రనారాయణలు చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ సునీత, ఉప కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, ఎంఈలు చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి, రెవెన్యూ అధికారి కె.ఎల్.వర్మ, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ హరికృష్ణ, సెక్రటరి రాధిక, మేనేజర్ చిట్టిబాబు, డిఈలు విజయకుమార్ రెడ్డి, రవీంధ్రరెడ్డి, దేవిక, గోమతి, మహేష్, శానిటరి సూపర్ వైజర్లు చెంచెయ్య, సుమతి తదితర అధికారులు పాల్గొన్నారు.

# వేర్వేరు కారణాలతో ఇద్దరు యువకుల ఆత్మహత్య

**- ఉరేసుకుని ఒకరు...**

**- పురుగుల మందు తాగి మరొకరు**





మదనపల్లె, మార్చి 20, మనం న్యూస్ క్రైమ్: వేర్వేరు కారణాలతో ఇద్దరు యువకులు ఆత్మహత్య చేసుకున్నారు. ఇందులో ఒకరు ఉరేసుకుని, మరొకరు పురుగుల మందు తాగి బలవన్మరణానికి పాల్పడ్డారు. తాలూకా పోలీసుల కథనం మేరకు... మదనపల్లె మండలం కోళ్లబైలు పంచాయతీ కాట్లాటపల్లెకు చెందిన ఓబుల్ రెడ్డి కుమారుడు వి.కిరణ్ కుమార్ రెడ్డి (22) పుంగనూరు రోడ్డులోని ఓ ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ సెకండియర్ చదువుతున్నాడు. ఈనేపథ్యంలో విద్యార్థి సోమవారం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన స్థానికులు బాధిత కుటుంబీకులకు, తాలూకా పోలీసులకు సమాచారం అందించారు. ఇందులోభాగంగా పోలీసులు కాట్లాటపల్లెకు చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి ఘటనపై ఆరా తీశారు. అయితే పరీక్షల్లో ఫెయిల్ అవుతాననే భయంతో జీవితం మీద విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు చెప్పారు. కాగా కిరణ్ వారం రోజులుగా కళాశాలకు వెళ్లకపోగా, తన ద్విచక్రవాహనాన్ని తాకట్టు పెట్టడంతో కుటుంబీకులు మందలించారని, దాంతో ఆత్మహత్య చేసుకున్నట్లు సమాచారం. అనంతరం మృతదేహాన్ని జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసుదర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చంద్రశేఖర్ చెప్పారు. అలాగే కలకడ మండలం ఎనుగొండపాళెం పంచాయతీ ఎగువతాండాకు చెందిన శంకర్ నాయక్ కుమారుడు రెడ్డినాయక్(20) ఇంటి వద్ద వ్యవసాయ పనులు చేస్తున్నాడు. ఈక్రమంలో సోమవారం పొలం వద్దకెళ్లిన ఇతడు అక్కడ మనస్తాపం చెంది పురుగుల మందుతాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన రైతులు బాధితుని 108 వాహనంలో మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమంగా మారడంతో మృతిచెందాడు. అయితే రెడ్డినాయక్ అప్పులబాధతో ఆత్మహత్య చేసుకున్నట్లు సమాచారం. కానీ కుటుంబ సభ్యులు మాత్రం అనారోగ్యంతో ఆత్మహత్య చేసుకున్నట్లు చెబుతున్నారు. ఈ మేరకు కేసుదర్యాప్తు చేస్తున్నట్లు కలకడ పోలీసులు చెప్పారు. కాగా యువకుల మృతితో బాధిత కుటుంబాల్లో విషాదం. అలుముకుంది.

# దేశానికి ఐకాన్‌గా టీటీడీ మాను స్క్రిప్ట్స్ ప్రాజెక్టు

**- వీటిపై పిహెచ్ డి లు చేసే స్థాయికి తీసుకుని రావాలి**

**- టీటీడీ ఈవో ఎవి ధర్మారెడ్డి**

తిరుపతి (టీటీడీ), మార్చి 20, మనం న్యూస్: టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న మానుస్క్రిపట్స్ ప్రాజెక్టు దేశానికే ఐకాన్ గా తయారు కావాలని టీటీడీ ఈవో ఎవి ధర్మారెడ్డి చెప్పారు. ఇక్కడ స్కాన్ చేసి భద్రపరచిన మానుస్క్రిపట్స్ పై పిహెచ్ డి లు చేసే స్థాయికి తీసుకుని రావాలన్నారు.మానుస్క్రిపట్స్ ప్రాజెక్టు ప్రగతిపై సోమవారం శ్రీ వేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయంలో ఆయన సమీక్ష నిర్వహించారు. ప్రాజెక్టు ప్రగతిపై అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఈవో ధర్మారెడ్డి మాట్లాడుతూ, పురావస్తు శాఖ నుంచి తెచ్చిన సుమారు 5500 తాళపత్ర గ్రంధాల్లో ఇప్పటివరకు 3370 తాళపత్ర గ్రంధాలు స్కాన్ చేయడం జరిగిందని తెలిపారు. ఇందులో 2,11,313 తాళపత్రాలు ఉన్నట్లు ఆయన చెప్పారు. రెండు నెలల్లో మిగిలిన గ్రంధాలను కూడా స్కాన్ చేయడానికి అవసరమైన సాంకేతిక సహకారం, సిబ్బందిని ఇస్తామని ఈవో వివరించారు. ప్రస్తుతం రోజుకు ఎన్ని తాళపత్రాలు స్కాన్ చేస్తున్నారు, తాళపత్రం శుభ్రపరచడం నుంచి తైల శోధన, స్కానింగ్ వరకు జరిగే వివిధ ప్రక్రియల గురించి ఈవో తెలుసుకున్నారు. వేదాంతం, పురాణాలు, కావ్యాలు, జ్యోతిష్యం తదితర అంశాలకు సంబంధించిన తాళపత్ర గ్రంధాలు ఉన్నాయని అధికారులు ధర్మారెడ్డి కి వివరించారు. ఇవి జాతి సంపద అని, వీటిని జాగ్రత్తగా స్కాన్ చేసి ప్రతి ఒక్కరికీ అర్థమయ్యేలా తెలుగులో తర్జుమా చేయాలని ఈవో అధికారులకు సూచించారు. ఇలా తర్జుమా చేసిన వాటిని పుస్తక రూపంలో తేవడానికి ఒక ప్రాజెక్టు తయారు చేసి ప్రతిపాదనలు ఇవ్వాలని ఆదేశించారు. ఈ పుస్తకాల ఆధారంగా పి హెచ్ డి చేయడానికి అవసరమైన వాతావరణం కల్పించి పిహెచ్ డి లు ప్రదానం చేసే ఏర్పాటు చేయాలన్నారు. దేశంలో ఇంకా ఎక్కడ మాను స్క్రిపట్స్ ఉన్నాయో తెలుసుకుని వాటిని సేకరించి స్కాన్ చేసి భద్రపరచ గలిగితే పరిశోధకులకు మరింత ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ప్రస్తుతం ఉన్న గ్రంధాలను అంశాల వారీగా వర్గీకరించి వాటికి ప్రత్యేకంగా నంబర్లు వేసి భద్రపరచడానికి చర్యలు తీసుకోవాలన్నారు. సనాతన జీవన్ ట్రస్టు సహకారంతో టీటీడీ ఆధ్వర్యంలో వేద విశ్వవిద్యాలయం పర్యవేక్షణలో జరుగుతున్న ఈ ప్రాజెక్టుకు దేశంలోనే ప్రత్యేక గుర్తింపు తేవాలని ఆయన ఆకాంక్షించారు. జేఈవో సదా భార్గవి, విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య రాణి సదాశివ మూర్తి, మానుస్క్రిపట్స్ ప్రాజెక్టు డిప్యూటీ ఈవో విజయలక్ష్మి, విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య రాధేశ్యాం సమీక్షలో పాల్గొన్నారు.



# టీడీపీ ఎమ్మెల్యేలపై దాడి అప్రజాస్వామికం



బుచ్చినాయుడు కండ్రిగ, మార్చి 20, మనం న్యూస్: శాసనసభలో నిరసన తెలుపుతున్న టీడీపీ ఎమ్మెల్యే విరాంజంజనేయ స్వామి పై వైసిపీ ఎమ్మెల్యే లు దాడి చేయడం అప్రజాస్వామికమని మండల టీడీపీ అధ్యక్షులు సుధాకర్ నాయుడు పేర్కొన్నారు.సోమవారం ఏపీ శాసన సభలో చోటు చేసుకున్న పరిణామాలు ప్రజాస్వామ్యం ను అపహాస్యం చేసేలా ఉన్నాయన్నారు. టీడీపీ ఎమ్మెల్యే లపై దాడి చేసి తమ పై దాడి చేసారని వైసిపీ నేతలు చెప్పుకోవడం సరి కాదని ప్రజలు అన్నీ గమనిస్తున్నారని జరగబోయే అసంబ్లీ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతారని పేర్కొన్నారు. ఎమ్మెల్సి ఎన్నికల్లో ఓటమి ని తట్టుకోలేని వైకపా నేతలు దాడులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ప్రస్తుతం కురుస్తున్న అకాల వర్షాలకు వరి, మిర్చి పంటలు నీట మునిగాయని కల్లాల్లోనే వరి ధాన్యం తడిసి పాయిందని ఆవేదన వ్యక్తం చేశారు. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలనిడిమేండ్ చేశారు.

# మొక్కలు సామాజిక సంపద ప్రతి ఒక్కరూ వీటిని నాటాలి



కురబలకోట, మార్చి 20, మనం న్యూస్: మొక్కలు సామాజిక సంపద యని మండలంలోని పిచ్చలవాండ్లపల్లె కార్యదర్శి రమణ, ఇంజినీరింగ్ అసిస్టెంట్ కార్తీక అన్నారు. సచివాలయ ఆవరణలో వారు మొక్కలు నాటారు. వీటి వల్ల పరిసరాలు ఆహ్లాదంగా ఆనందంగా ఉంటాయన్నారు. ప్రశాంత వాతావరణంతో పాటు చల్లని గాలిని చక్కటి నీడను ఇవి ఇస్తాయన్నారు. తద్వారా ఆందోళనను తగ్గిస్తాయన్నారు. పర్యావరణానికి ఎంతో మేలు చేస్తాయన్నారు. భావితరాలకు కూడా మేలన్నారు. ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటాలన్నారు. ఔషద మొక్కలు నాటడం మరీ మంచిదన్నారు. ఆరోగ్యాన్ని ఇస్తాయన్నారు. ఇవి ప్రమాదకర వ్యాధుల నుండి బయటపడేస్తాయన్నారు.

# స్పందన వినతులకు అర్థవంత పరిష్కారం చూపాలి



తిరుపతిటౌన్, మార్చి 20, మనం న్యూస్ : స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణీత కాల వ్యవధి లోపల ప్రజలు అందజేసిన సమస్యల అర్జీలకు అర్థవంత పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం కలెక్టరేట్ లో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ , జాయింట్ కలెక్టర్ డి. కె బాలాజీ, డి ఆర్ ఓ శ్రీనివాసరావు, ఎస్ డి సి లు కోదండ రామిరెడ్డి, భాస్కర్ నాయుడు, జిల్లాలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి వినతులను స్వీకరించి స్పందన ఆన్ లైన్ నమోదుతో రసీదులు అందించారు. రెవెన్యూ శాఖకు-108, పోలీస్ శాఖ కు -04, మునిసిపల్ శాఖ - 04, పంచాయతీ రాజ్ కు - 01, డి ఆర్ డి ఎ కు -01 , పి ఓ ఎస్ ఎస్ ఎ - 01 , వైద్య ఆరోగ్య శాఖ -02 , లాండ్ అండ్ సర్వే - 01, సర్వ శిక్ష అభయాన్ -01, స్కిల్ డెవలప్ మెంట్ -01, ఎంప్లాయిమెంట్ -01 లు కలిపి 125 మొత్తం వినతులు రావడం జరిగిందని జిల్లా అధికారులు వచ్చిన అర్జీలను సకాలంలో పరిష్కరించాల్సిందిగా స్పందనకు హాజరయిన వివిధ శాఖలకు సంబందించిన జిల్లా అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

# వడగండ్ల వానతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలి నష్టపరిహారం చెల్లించాలి

## సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ డిమాండ్



అనంతపురం. మార్చి 20. మనం న్యూస్: జిల్లాలో ఇటీవల కురిసిన వడగండ్ల వానతో శింగనమల నియోజకవర్గం రైతులు పూర్తిగా నష్టపోయారని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే వారికి పరిహారం చెల్లించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం కామ్రేడ్ నీలం రాజశేఖర రెడ్డి భవన్ లో ఆపార్టీ నాయకులతో కలసి ఆయన మీడియాతో మాట్లాడారు. అకాల వర్షాలు కురవడంతో శింగనమల నియోజక వర్గ పరిధిలోని నార్పల, పుట్లూరు, బుక్కరాయసముద్రం , శింగనమల ప్రాంతాలలో అన్నిరకాల పంటలు పూర్తిగా నాశనమయ్యాయని అయన ఆవేదన వ్యక్తం చేశారు. పుట్లూరు మండలంలో సుమారు 20 కోట్ల రూపాయలు, నార్పల మండల పరిధిలో కోటిన్నర నష్టం జరిగిందని అయన విచారం వ్యక్తంచేశారు. అయితే జరిగిన నష్టం అంచనా వేయడంలో సంభందిత అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారని విమర్శించారు. అరటి, మామిడి, మొక్కజొన్న బొప్పాయి తదితర పంటల తోపాటు 15 వందల ఎకరాల్లో వరిపంట నేలకొరిగిందని అయన వాపోయారు. పుట్లూరు మండలంలో 20 కోట్లు, నార్పల మండలంలో ఒకటిన్నర కోటి రూపాయల పంటనష్టం జరిగిందన్నారు. వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులు జరిగిన నష్టాలను వెంటనే అంచనా వేసి నష్టపరిహారానికి ప్రతిపాదించాలని అయన డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి నష్టపోయిన రైతులను ఆదుకోవాలన్నారు. సకాలంలో సంభందిత అధికారులు స్పందించని పక్షంలో సీపీఐ, రైతు సంఘం నాయకులు ఆందోళన కార్యక్రమాలు చేపట్టేందుకు బాధిత రైతులతో మమేకమౌతున్నారని అయన హెచ్చరించారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి చిన్నప్ప యాదవ్, శింగనమల నియోజకవర్గ కార్యదర్శి, నారాయణస్వామి,పుట్లూరు మండల కార్యదర్శి పెద్దయ్య,రైతు సంఘం శింగనమల నీయోజకవర్గ అధ్యక్ష కార్యదర్శులు, మధుయాదవ్ ,రాము,చేనేత కార్మిక సంఘం జిల్లా సబ్ కమిటీ సభ్యుడు నేసే మధు, రైతుసంఘం జిల్లా నాయకులు, శివారెడ్డి, అరటివేముల గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## అకాల వర్షాలతో దెబ్బతిన్న పంటలను పరిశీలించిన ఎల్ నారాయణ చౌదరి



చెన్నేకొత్తపల్లి మార్చి 20 మనం న్యూస్: గత మూడు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాల కారణంగా దెబ్బతిన్న పంటలను చెన్నేకొత్తపల్లి మండలంలోని వెంకటంపల్లి, ఒంటికొండ గ్రామాలలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ఎల్ నారాయణ చౌదరి పరిశీలించారు. ఆయన రైతులతో కలిసి నష్టపోయిన పంటలకు ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం అందజేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ ముత్యాల రెడ్డి, హిందూపురం పార్లమెంట్ ఉపాధ్యక్షులు దండు ఓబులేసు, మాజీ ఎంపీపీ అంకే అమరేంద్ర, మాజీ కన్వీనర్ రామకృష్ణారెడ్డి, పార్థసారథి, సూర్యనారాయణ రెడ్డి, వెంకటరెడ్డి, రమణారెడ్డి, కాన శివారెడ్డి, అక్కులప్ప, వెంకటేశు, రంగారెడ్డి, కనుముక్కల రమణ మరియు టిడిపి నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

## యుటిఎఫ్ జిల్లా నూతన కమిటీ ఎంపిక



పెనుకొండ మార్చి 20 మనం న్యూస్ : ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ యుటిఎఫ్ జిల్లా ఆధ్వర్యంలో రవీంద్ర భారతి పాఠశాల ఆవరణంలో ప్రథమ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నూతన కమిటీని ఎంపిక చేశారు. కమిటీలో పెనుకొండ నుంచి ముగ్గురు ఉపాధ్యాయ నాయకులకు చోటు లభించింది. కమిటీ అధ్యక్షులుగా జయచంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా నాగేంద్ర, గౌరవ అధ్యక్షులుగా భూతన్న, సహాయ అధ్యక్షులుగా బాబు, సీతాలక్ష్మి, కోశాధికారిగా సుధాకర్, జిల్లా కార్యదర్శిగా తహీర్ వలి, నారాయణస్వామి, రమీజాబి ,శ్రీనివాసులు, హరికృష్ణ, చంద్రశేఖర నాయుడు, రాష్ట్ర కౌన్సిలర్లుగా మారుతి, శ్రీనివాసులు, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ గా రామకృష్ణ, జిల్లా కన్వీనర్లు గా నరేష్, మున్సిపల్ కమిటీ సభ్యులు గా రామాంజనేయులు, మహిళా కమిటీ సభ్యులు శీతాలక్ష్మి, స్టడీ సర్కిల్ గా మారుతి, శ్రీనివాసులు, ఐక్య ఉపాధ్యాయ పత్రిక కమిటీ సభ్యులుగా సుధాకర్, అకాడమిక్ కమిటీ సభ్యులు గా శివశంకర్ ,సాంస్కృతిక కమిటీ సభ్యులు గా, మహంతిశ్వర ,ఆడిట్ సభ్యులు ఆంజనేయులు ,జయచంద్ర, రామకృష్ణ నాయక్, ఆదినారాయణ, మల్లికార్జున, రవీంద్ర తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఓ ప్రకటనలో తెలిపారు .

## పంట నష్టం జాబితాను రెండు రోజుల్లోగా సమర్పించండి...జిల్లా వ్యవసాయాధికారి చంద్ర నాయక్



బుక్కరాయసముద్రం...(మనం న్యూస్) : మొన్నటి దినం అనగా శనివారం రాత్రి వచ్చిన గాలి, వడగళ్ళ వాన కు దెబ్బ తిన్న మొక్కజొన్న పంట ను పొడరాళ్ల, రేగడి కొత్తూరు గ్రామముల లో పరిశీలించిన ఆయన నష్ట పరిహారాన్ని 33 కాలం ల యొక్క ఫార్మాట్ లో పొందు పరచి రెండు రోజులలోగా సమర్పించాలని అవసరమైతే ఇతర గ్రామాల యొక్క గ్రామ వ్యవసాయ సహాయకులను పంట దెబ్బ తిన్న గ్రామములకు పంపి రైతులయొక్క పొలములను సందర్శించి నష్ట పరిహారం జాబితాను తయారు చెయ్యవలె నని రెండు రోజుల్లోగా సంబంధిత తహసీల్దార్ లు సహాయ వ్యవసాయ సంచాలకుల ద్వారా తన కార్యాలయమునకు పంపవలెనని ఆదేశించారు.ఈ కార్యక్రమం లో గ్రామ సర్పంచ్ ఎర్రిస్వామి, మండల వ్యవసాయాధికారి శ్యాం సుందర్ రెడ్డి, గ్రామ వ్యవసాయ సయహకుడు శ్రీనివాస్ వాలంటీర్స్ ఇతర రైతులు పాల్గొన్నారు.

## రైతులకు అందుబాటులో జీవన రేఖ



రాప్తాడు, మార్చి 20, మనం న్యూస్ : రభీ సీజన్ లో రైతులు పొలాల్లో పెట్టిన పంటలను తప్పనిసరిగా ఈ క్రాప్ బుకింగ్ చేయించుకోవాలని రాప్తాడు మండల వ్యవసాయ శాఖ అధికారి శుభకర్ పేర్కొన్నారు. రాప్తాడు మండలం జి.కొత్తపల్లి గ్రామం నందు రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సంధర్భంగా ఏవో మాట్లాడుతూ రైతులకు అందుబాటులో జీవన రేఖ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలియజేశారు. ఏపీఎంఐపీ ద్వారా డ్రిఫ్ కోసం దరఖాస్తు చేసుకుని మంజూరు కాకపోతే జీవన రేఖ ద్వారా సమస్యను పరిష్కరిస్తామన్నారు. రైతు భరోసా కేంద్రంలో ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఇన్సూరెన్స్ మిస్ మ్యాచింగ్ దరఖాస్తులను పరిశీలించి రైతులకు న్యాయం చేస్తామన్నారు. పిఎం కిసాన్ ఈ కేవైసీ ఇంకా చేయించుకోని రైతులు వెంటనే చేయించుకోవాలన్నారు. మామిడి పంట నష్టం వాటిల్లితే ఈ సంవత్సరం నుంచి ఇన్సూరెన్స్ వస్తుందని తెలియజేశారు. అకాల వర్షాలకు పంట నష్టం జరిగితే వెంటనే ఎంపీఈఓలకు సమాచారం అందించి నష్టపరిహారం కొరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పి చంద్రకళ చిన్న కృష్ణారెడ్డి ఎంపీఈఓ నలినాక్షి ఇంజనీర్ అసిస్టెంట్ తనూజ్ రెవిల్యూషన్ డ్రిప్ కంపెనీ చరణ్ కుమార్ రెడ్డి రైతులు పాల్గొన్నారు.

## హైకోర్టు ఏర్పాటు కోసం న్యాయవాదుల దీక్ష

### సంఘీబావం తెలిపిన బి.జి.ఎస్. నాయకులు



అనంతపురం మార్చి 20 మనం న్యూస్: రాయలసీమలో హైకోర్టు ఏర్పాటుకు సంబందించిన సమగ్ర బిల్లును ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లో పెట్టాలని డిమాండ్ చేస్తూ సోమవారం అనంతపురం జిల్లా కోర్టు ఆవరణంలో న్యాయవాదులు ఒక రోజు రిలే నిరాహార దీక్షను చేపట్టారు. అభివృద్ధి వికేంద్రికరణ సాధన జె ఏ సి ఆధ్వర్యంలో జరిగిన న్యాయవాదుల దీక్షలకు న్యాయ విద్యార్థి బంజారా గిరిజన సమైక్య రాష్ట్ర అధ్యక్షులు రమవత్ సురేష్ నాయక్ సంఘీబావం తెలిపారు.ఈ సందర్భంగా రమవత్ సురేష్ నాయక్ మాట్లాడుతూ సీఎం వై.యస్. జగన్మోహన్ రెడ్డి అసెంబ్లీ సాక్షిగా న్యాయ రాజధానిగా రాయలసీమలో హై కోర్టును ఏర్పాటు చేస్తామని చెప్పారన్నారు. అయితే నేటికి కూడా ఎటువంటి కార్యక్రమాలు రాయలసీమలో ప్రారంభించ లేదన్నారు. దీన్ని పరిశీలిస్తే రాష్ట్ర ప్రభుత్వానికి రాయలసీమ ప్రాంత వాసులపై నిజమైన ప్రేమ, విశ్వాసం, లేదని నిరూపితం అవుతోందన్నారు. అంతే కాక జ్యుడీషియల్ అకాడమీని కాజ ప్రాంతంలో ప్రారంభించడం చూస్తుంటే, రాష్ట్ర ప్రభుత్వం చెప్పిన మాటలకు, ఆచరణలో ఎక్కడ కూడా పొంతన లేకుండా పోయిందన్నారు. శ్రీ భాగ్ ఒప్పందం మేరకు రాయలసీమ ప్రాంతంలో అభివృద్ధి చేసిన దాఖలాలు లేవన్నారు.ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలలో బిల్లును ప్రవేశపెట్టి,దానిని కేంద్ర ప్రభుత్వానికి పంపాలన్నారు. న్యాయ రాజధానిగా రాయలసీమలో వెంటనే హైకోర్టును ఏర్పాటు చేయాలన్నారు. అంతేకాక ఇటీవల కాలంలో జరిగిన గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వచ్చిన ఫలితాలను చూస్తే రాయలసీమ వ్యాప్తంగా ఉన్న గ్రాడ్యుయేట్లలో ఈ ప్రభుత్వం పట్ల ఎంత వ్యతిరేకత ఉందన్నది స్పష్టమవుతోందన్నారు.2024 కల్లా రాయలసీమ ప్రాంతంలో హైకోర్టు ఏర్పాటు చేయకుంటే ఈ ప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లో గట్టి బుద్ధి చెబుతామని అయన హెచ్చరించారు.కార్యక్రమానికి అభివృద్ధి వికేంద్రికరణ సాధన జె ఏ సి కన్వీనర్ ఆలూరు రామిరెడ్డి, కో కన్వీనర్ హనుమన్నలు నాయకత్వం వహించారు. దీక్షలో 8మంది యువ న్యాయవాదులు పాల్గొన్నారు.

## ఘనంగా జాతీయ నోటి శుభ్రత దినోత్సవం



విడపనకల్లు మార్చి 20 మనం న్యూస్ : మండల కేంద్రం లోని ఏపీ మోడల్ స్కూల్ లో జాతీయ నోటి శుభ్రత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వైద్యుడు కే రాజేంద్ర ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులకు ప్రతి రోజు రెండు పూటలా దంతాలను ఎలా శుభ్రం చేయాలన్న అంశం అవగాహన కల్పించారు. ఓరల్ హెల్త్ హైజీన్ గురించి వివరించారు. అనంతరం 4డి ఎస్ స్క్రీనింగ్ చేసి విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. మోడల్ స్కూల్ లో వంటశాలను, భోజనం కార్యక్రమాన్ని పరిశీలించారు.ఈ కార్యక్రమంలో పి. ప్రమీలదేవి, సి హెచ్ ఓ జయభారతి, మునెమ్మ, శర్మష్ వలి, ఆరోగ్య పర్యవేక్ష్యకులు, నూర్ మొహమ్మద్, లక్షి, ఆరోగ్య కార్యకర్తలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యార్థి సంఘం నాయకులకు ముందస్తు నోటీసులో జారీ చేసిన పోలీసులు

**జీవో నెంబర్ (1) ని రద్దు చేసే వరకు ఉద్యమాలు చేస్తాం**

**చలో అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్న ఏఐవైఎఫ్ నాయకుల కు ముందస్తు నోటీసులు**

**రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబర్ ఒకటిని ఉపసంహరించుకోవాలి**

**పోలీసులను అడ్డుపెట్టుకుని ఉద్యమాలను ఆపలేరు ఏఐవైఎఫ్ నాయకులు**



రాయదుర్గం మనం న్యూస్: జీవో నెంబర్ 1 రద్దుకై చలో అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్న రాయదుర్గం ఏఐవైఎఫ్ నాయకులకు పోలీసులు ముందస్తు నోటీసులు ఇచ్చారు.ఈ సందర్భంగా రాయదుర్గం ఏఐవైఎఫ్ తాలూకా అధ్యక్ష కార్యదర్శులు కుమార్ నాయక్ కోట్రేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జీవో నంబరు 1 తీసుకుని వచ్చి సభలు సమావేశాలు నిరసనలు ధర్నాలు నిర్వహించాలంటే ముందుగా అనుమతి తీసుకోవాలని నిబంధనతో ఈ జీవోని నెంబర్ 1 పాస్ చేయడం దుర్మార్గం ప్రస్తుత వైసిపి రాష్ట్ర ప్రభుత్వం నాడు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రాష్ట్రం మొత్తం పాదయాత్ర చేసి అనేక రకాల ధర్నాలు నిరసనలు తెలియజేసి ప్రజలకు అనేక రకాల హామీలు ఇచ్చి తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత జీవో నెంబర్ (1) తీసుకుని రావడం ఎంతవరకు సమన్వయమని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రాజ్యాంగం ఇచ్చిన ఒక హక్కుగా ప్రతి ఒక్క భారత పౌరుడు దేశంలో, రాష్ట్రాల్లో కావచ్చు ఎక్కడైనా తనకి అన్యాయం జరిగినప్పుడు నిరసన తెలియజేసే హక్కు రాజ్యాంగం కల్పించింది.కానీ వైసిపి ప్రభుత్వం ఇవన్నీ తుంగలో తొక్కేసి ఏమి పట్టనట్టుగా ఈ రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరించడం హేయం అన్నారు.జీవో నెంబర్ ఒకటి రద్దుకై చలో అసెంబ్లీకి బయలుదేరిన రాయదుర్గం అఖిలభారత యువజన సమైక్య ,ఏఐవైఎఫ్ నాయకులను స్థానిక బస్టాండ్ లో అడ్డుకొని ముందస్తు నోటీసులు ఇవ్వడం దుర్మార్గం అని మండిపడ్డారు. ఇలా ఎన్నాళ్ళు పోలీసుల్ని అడ్డుపెట్టుకుని నిరసనలు, ర్యాలీలు ఇలా కార్యక్రమాలను అడ్డు కోవడం, ఉద్యమాలను రాష్ట్ర ప్రభుత్వం నిలువరించే దిశగా ముందుకు వెళ్లడం సరైనది కాదని,వెంటనే జీవో నెంబర్ (1) ఒకటిని రద్దు చేయాలని అఖిల భారత యువజన సమైక్య ఏఐవైఎఫ్ గా డిమాండ్ చేస్తున్నాం అన్నారు.మీరు పోలీసుల చేత ఎన్ని నోటీసులు జారీ చేసిన జీవో నెంబర్ (1) ఒకటికై ఉద్యమాలు చేస్తూనే ఉంటాం అని రాష్ట్ర ప్రభుత్వానికి తెలియజేస్తున్నాము.నోటీసులు తీసుకున్న వారిలో ఏఐవైఎఫ్ నాయకులు రాయదుర్గం మండల కార్యదర్శి అనీల్, నాయకులు కుబేర లు ఉన్నారు.

## బసవేశ్వర విగ్రహ ఏర్పాటుకు అనుమతివ్వండి

### మేజర్ పంచాయతీ ఈఓను కోరిన వీరశైవ సంఘం



ఉరవకొండ, మార్చి 20, మనం న్యూస్: ప్రముఖ సంఘ సంస్కర్త, సమసమాజ నిర్మాణ ప్రదాత శ్రీ బసవేశ్వరుని విగ్రహ ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని ఉరవకొండ పంచాయతీ ఈఓ గౌస్ సాహెబ్ ను తాలూకా వీరశైవ సంఘం కోరింది. ఈ మేరకు ఆ సంఘం తాలూకా అధ్యక్షుడు బుక్కీట్ల అశోక్ , ప్రధాన కార్యదర్శి పాల్తూరు శంకర్, కార్యదర్శి వీరప్ప, డైరెక్టర్లు రాజన్న, రుద్రప్ప, నటరాజ, నిరంజన్ గౌడ్ సోమవారం పంచాయితీ ఈవోను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ వీరశైవ లింగాయత్ ఆరాధ్య దైవమైన శ్రీ బసవేశ్వరుడి విగ్రహాన్ని ఉరవకొండ పట్టణంలో ఏర్పాటు చేయాలని తమ సంఘం నిర్ణయించిందన్నారు. అందుకోసం స్థలం కేటాయించాలని తాము కోరుతున్నామని చెప్పారు.ఈమేరకు సర్పంచ్, ఈఓ, పాలకవర్గం విగ్రహం ఏర్పాటుకు స్థలం కేటాయించాలని కోరారు.

## ఆర్ వై ఎమ్ ఇ సి కళాశాల ప్రొఫెసర్, హనుమంతరావుకు డాక్టరేట్



బళ్ళారి, మార్చి 20, మనం ప్రతినిధి: నగరంలోని ప్రతిష్టాత్మకమైన విద్యాసంస్థ రావు బహదూర్ మహాబలేశ్వరప్ప ఇంజనీరింగ్ కళాశాలలో ప్రొఫెసర్ గా పని చేస్తున్న హనుమంతరావుకు డాక్టరేట్ లభించింది. హైదరాబాద్ నగరానికి చెందినప్రొఫెసర్, డాక్టర్ విజయభాస్కర్ రెడ్డి మార్గదర్శకత్వంలో, ప్రాబిలిస్టిక్ ఆప్టిమల్ పవర్ యు ఆఫ్ కర్ణాటక పవర్ గ్రిడ్ ఇన్ కార్పొరేటింగ్ ప్లగ్ ది బిల్ ఏసి ట్రాన్స్మిషన్ సిస్టం అన్న అంశంపై పరిశోధనలు చేసిన నేపథ్యంలో, డాక్టరేట్ లభించింది. ఈ సందర్భంగా కళాశాల మేనేజ్మెంట్ కమిటీ అధ్యక్షుడు, ప్రిన్సిపల్, ప్రొఫెసర్లు కళాశాల సిబ్బంది హనుమంతరావును అభినందించారు.

## నోటి శుభ్రతతో శారీరక ఆరోగ్యం

### ఆమిద్యాల ప్రాథమిక పాఠశాలలో ' ప్రపంచ నోటి ఆరోగ్య దినం '



ఉరవకొండ, మార్చి 20, మనం న్యూస్: ప్రతి సంవత్సరం మార్చి 20న నిర్వహించే 'ప్రపంచ నోటి ఆరోగ్య దినం' సందర్భంగా సోమవారం ఆమిద్యాల ప్రాథమిక పాఠశాలలో రాకెట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాదాకారిని పావని మరియు దంత వైద్యురాలు రాజేశ్వరి దేవి నోటి ఆరోగ్యం గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ... ఎవరికైతే నోరు ఆరోగ్యంగా ఉంటుందో వారి శారీరక ఆరోగ్యం బాగుంటుందని తెలియచేశారు. ఆహార పదార్థాలు సరిగా నమలక పోవడం వలన అజీర్తి, కడుపు నొప్పితో పాటు అనీమియా లాంటి రక్తహీనత సమస్యలు వస్తాయని తెలిపారు. చిన్న పిల్లలు అతిగా తీపి పదార్థాలు, శీతల పానీయాలు వినియోగం వల్ల పళ్ళు గార పట్టడం, పుచ్చి పోవడం, ఏనామిల్ అరిగి పళ్ళు జివ్వు మనడం లాంటి అనారోగ్య సమస్యలు వస్తాయని, పిల్లలు తీపి పదార్థాలు, శీతల పానీయాలు ఎక్కువ తీసుకోరాదని దంత వైద్యురాలు రాజేశ్వరి దేవి సూచించారు. పాఠశాలలో పంటి సమస్యలున్న 25 మంది విద్యార్థిని ,విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి మందులు అందచేశారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ఓ నాగరంగయ్య, హెల్త్ ఎడ్యుకేటర్ షఫీ, సచివాలయ ఏఎన్ఎం లు కోమల, చాముండేశ్వరి సీ.ఓ భగవాన్ దాస్ పాఠశాల ప్రధానోపాధ్యాయిని పద్మావతి మరియు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# అసెంబ్లీ సాక్షిగా దళిత ఎమ్మెల్యేపై జరిగిన దాడి అత్యంత హేయమైన చర్య

### వైకాపా అరాచక పాలనను అంతమొందించాలి


### బిసి మేధావులు, విద్యావంతులు, యువత ఆలోచన చేయాలి

### తెలుగుదేశం పార్టీ నేతలు వడ్డే వెంకట్



అనంతపురం మార్చి 20మనం న్యూస్: రాష్ట్రంలో అరాచక పాలన నడుస్తోందని నిండు సభ సాక్షిగా ఒక దళిత ఎమ్మెల్యే పై వైకాపా ఎమ్మెల్యేలు చేసిన దాడి అత్యంత దుర్మార్గమని రాష్ట్రంలో వైకాపా నేతలు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని ₹తెలుగుదేశం పార్టీ వడ్డెర సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ వడ్డే వెంకట్, తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణలు₹ మండిపడ్డారు. సోమవారం సాయంత్రం శ్రీ సత్యసాయి జిల్లా కదిరి పట్టణంలో తెదేపా నేతలు ₹వడ్డే వెంకట్, సామకోటి ఆది₹ విలేకరులతో మాట్లాడుతూ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటమిని జీర్ణించుకోలేక పవిత్రమైన అసెంబ్లీలో వైసీపీ అసెంబ్లీ రౌడీలు తెలుగుదేశం పార్టీ దళిత ఎమ్మెల్యే డోలా బాల వీరాంజనేయ స్వామి పై దాడి చేశారని ఇది ప్రజాస్వామ్యానికి చీకటి రోజు అని విమర్శించారు. దళిత శాసన సభ్యుడు డోలా బాల వీరాంజనేయ స్వామి మీద దాడి హేయమైన చర్య అని పేర్కొన్నారు. దళిత, బడుగు బలహీనవర్గాల ఓట్లతో గెలిచిన జగన్ మోహన్ రెడ్డి అసెంబ్లీ సాక్షిగా దళిత నాయకుడు డోలా బాల వీరాంజనేయ స్వామి మీద దాడి చేయించటం దుర్మార్గమన్నారు. జీవో నంబర్ వన్ మీద ప్రతి పక్ష పార్టీలు చేస్తున్న పోరాటం, అంగన్ వాడిలు చేస్తున్న పోరాటాల నుండి ప్రజల దృష్టి మరల్చేందుకు ఈ నీచానికి వైసిపి గుండాలు దిగారని విమర్శించారు. నాలుగు దశాబ్దాలుగా శాసన సభ్యుడుగా ఉన్న టిడిపి సీనియర్ నేత బుచ్చయ్య చౌదరి మీద అసెంబ్లీ సాక్షిగావెల్లంపల్లి శ్రీనివాస్ దురుసు ప్రవర్తనను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు.చరిత్రలో ఇదొక చీకటి రోజు అని ప్రజాస్వామ్య వాదులంతా ఎమ్మెల్యేల మీద జరిగిన దాడిని ముక్త కంఠంతో ఖండించాలి అని తెలిపారు. బడుగు, బలహీన వర్గాలకు చెందిన మేధావులు, విద్యావంతులు, యువత ఆలోచన చేయాలని రాష్ట్రంలో రాక్షస పాలన నడుస్తోందని తెలుగుదేశం పార్టీ తోనే బడుగు బలహీన వర్గాలకు న్యాయం జరుగుతుందని వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి రాష్ట్రంలోని బీసీ సోదరులందరూ ఏకతాటిపైకి రావాలని వడ్డే వెంకట్, సామకోటి ఆదినారాయణలు కోరారు. కార్యక్రమంలో నాయకులు చిలమత్తూరు వెంకటేష్, పాలేపల్లి ఈశ్వర్, వెంకటేష్, ఐ టీడీపీ పుట్టపర్తి నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి మంజునాథ్, పల్లపు రమేష్, చెక్ పోస్ట్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి, సంక్షేమంలో ఏపీ ఆదర్శం



కూడేరు మార్చి 20( మనం న్యూస్): మండల పరిధిలోని గొట్కూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, వైస్సార్ హెల్త్ క్లినిక్ భవనాలను సర్పంచ్ ఆశలత,ఎంపిపి నారాయణరెడ్డితో కలిసి మాజీ ఎమ్మెల్యే సోమవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ గ్రామాల్లో సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థతో ప్రజల ముంగిటకే ప్రభుత్వ పాలనను తీసుకొచ్చారన్నారు. అర్హతే ప్రామాణికంగా నవరత్నాల పథకాల ద్వారా ప్రతి ఇంటికీ అందిస్తున్న ఏకైక ప్రభుత్వంగా వైఎస్సార్సీపీ రికార్డు సృష్టించిందన్నారు. మూడేళ్ల వ్యవధిలోనే 30 ఏళ్ల అభివృద్ధి చేసి చూపించామన్నారు.ఆర్థిక అసమానతలు తొలగించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్మోహన్రెడ్డి పాలన సాగిస్తున్నారని విశ్వేశ్వరరెడ్డి కొనియాడారు.ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి దేవా, హనుమాతరెడ్డి, మదన్మోహనరెడ్డి,బైరెడ్డి రామచంద్రారెడ్డి, గంగాధర్, దేవేంద్ర, రంగారెడ్డి, రాజశేకర్,సూర్య,వైస్సార్సీపీ ప్రజాప్రతినిధులు, వైస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# చంద్రబాబు నాయుడుకు ఏమని చెబుతారు సుధీర్ రెడ్డి గారు..?

**- టీడీపీ నాయకులు అండతోనే ల్యాంకో వంటెద్దు పోకడకు కారణమని చెబుతారా..?**



శ్రీకాళహస్తి, మార్చి 20, మనం న్యూస్ ప్రతినిధి: లాంకో యాజమాన్యం వ్యవహరిస్తున్న ఒంటెద్దు పోకడ పై తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్తామని, ఏర్పేడు మండలం చిందేపల్లి గ్రామస్తులకు అండగా నిలుస్తామని హామీ ఇచ్చిన టిడిపి నియోజకవర్గ ఇన్చార్జ్ సుధీర్ రెడ్డి లాంకో యాజమాన్యానికి అండగా నిలిచిన టిడిపి నాయకులు, కార్యకర్తలపై కూడా ఫిర్యాదు చేస్తారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. లాంకో కర్మాగారం ఏర్పాటు కావడానికి ల్యాంకో పరిశ్రమ ఏర్పాటుకు భూములు ఇచ్చింది, అనుమతి సాధించింది తమ కుటుంబీకులే అని చెప్పిన సుధీర్ రెడ్డి టిడిపి నాయకులు, కార్యకర్తలు అండతో, పోలీసు బలగాలతో చిందేపల్లి రోడ్డు మాయం చేయడానికి లాంకో యాజమాన్యం కృషి చేస్తుంటే చిందేపల్లి గ్రామస్తుల అభ్యర్థన మేరకు సంఘటన స్థలానికి చేరుకున్న సుధీర్ రెడ్డి మానవ హక్కులను హరిస్తున్న లాంకో యాజమాన్యంపై టీడీపీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబునాయుడు,మానవ హక్కుల కమిషన్ దృష్టికి తీసుకెళుతామని చెప్పడం స్వాగతించాల్సిన విషయమే. అయితే సుధీర్ రెడ్డి ఒక విషయం తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. లాంకో కార్మికుల పట్ల నిరంకుశత్వంగా వ్యవహరించడానికి, లాంకో యాజమాన్యానికి వెన్నుదన్నుగా వున్న టిడిపి నాయకులు గురించి కూడా చంద్ర బాబు నాయుడుకు చెప్పాల్సి వుంది.టీడీపీ నాయకులు ప్రోత్బలంతోనే కోళ్ల ఫారం నుండి చిందే పల్లి మీదుగా వెళుతున్న ఆర్ అండ్ బి రోడ్డును మాయం చేయడానికి, ల్యాంకో సిద్ధమైందన్న విషయాన్ని గుర్తుతెరగాల్సింది. కొంత మంది టిడిపి నాయకులే ల్యాంకోకు అండగా నిలిచి నిరుపేద కార్మికుల పొట్ట కొడుతున్నారని, అలాగే ఆర్ అండ్ బి రోడ్డును ఆక్రమించడానికి ల్యాంకో యత్నించడం వెనుక వున్నది కూడా కొంత మంది టిడిపి నాయకులు, కార్యకర్తలని గమనించాల్సింది. ఇదిలా ఉంటే ఇద్దరు మాజీ సర్పంచ్లు ఇప్పటికే న్యాయపరంగా రావాల్సిన హక్కులు కాపాడుకోవడం కోసం,ఆర్ అండ్ బీ రోడ్డు ఆక్రమించడానికి వ్యతిరేకంగా న్యాయస్థానాన్ని ఆశ్రయించినట్లు సమాచారం. మొత్తం మీద సుధీర్ రెడ్డి చింతపల్లి గ్రామస్తులకు అండగా నిలవడం విషయమే. మరి లాంకో యాజమాన్యంకు అండగా నిలిచిన టిడిపి నాయకులు కార్యకర్తలపై ఆయన ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.

## కుప్పం మునిసిపాలిటీలో ఎస్ఈ గోపాల్ రెడ్డి ఆకస్మిక తనిఖీ



కుప్పం, మార్చి 20, మనం న్యూస్: కుప్పం మున్సిపాలిటీ విచ్చేసిన ఎస్ఈ గోపాల్ రెడ్డి రానున్న వేసవి కాలం ను దృష్టిలో ఉంచుకొని సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ ఏర్పాటనకు డీకేపల్లి చెరువు, పాలారు, వీరప్ప నాయనిచెరువు ను పరిశీలించారు. ఎస్ ఈ కి ఇక్కడి పరిస్థితులను కుప్పం మున్సిపల్ చైర్మన్ డా. సుధీర్ వివరించారు, ఈ ఇరిగేషన్ ప్రాజెక్టు వివరాలను ఇరిగేషన్ డిఈ హరినాథ్ రెడ్డి క్లుప్తంగా తెలిపారు. ఎస్ ఈ మాట్లాడుతూ వెంటనే ఇరిగేషన్ డిపార్ట్మెంట్తో మాట్లాడి సమస్యను వివరించి తదుపరి సమాచారం త్వరలోనే అందిస్తామని తెలిపారు. అదే విధంగా కుప్పం మున్సిపాలిటీలోని 16,18,19,20 వార్డులకు సంబంధించిన పెద్ద డ్రైనేజీ పైన ఫుట్ పాత్ వేయడానికి అట్లా వేసినచో ప్రజలకు కలిగే లాభాలను వివరించారు. మున్సిపల్ చైర్మన్ డా.సుధీర్ , ప్రజా సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకొని చేసే ఈ మంచి కార్యక్రమం నికి సానుకూలంగా స్పంది ంచారు.. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రవి రెడ్డి ఇరిగేషన్, డిఈ హరినాథ్ రెడ్డి, ఏఈ విష్ణు, ఇంజనీర్ అసిస్టెంట్ తదితరులు పాల్గొన్నారు.

## వైసీపీ నుండి టీడీపీలోకి 60 కుటుంబాలు చేరిక





కుప్పం, మార్చి 20, మనం న్యూస్: కుప్పం నియోజకవర్గం దళిత నాయకుడు కన్నన్ ఆధ్వర్యంలో కుప్పం నియోజకవర్గంలోని సుమారు 60 వైసిపి కుటుంబాలు విజయవాడలో చంద్రబాబు నాయుడు సమక్షంలో సోమవారం నాడు చేరినట్లు వారు తెలిపారు ఈ సందర్భంగా పార్టీలో చేరిన వైసిపి ప్రముఖులు విజయ్ కుమార్ , మునుస్వామి , సురేష్ మాట్లాడుతూ వైసిపి పార్టీలో కష్టపడి పనిచేస్తున్న తగిన గుర్తింపు ఇవ్వనందున మనస్థాపం చెంది పార్టీ వీడి తెలుగుదేశంలో చేరినట్లు వారు తెలిపారు.. అదేవిధంగా మండల స్థాయిలో తెలుగుదేశం పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేస్తామని చంద్రబాబు గెలుపే లక్ష్యంగా పనిచేస్తామని వారు ఈ సందర్భంగా తెలిపారు చంద్రబాబు నాయుడు సమక్షంలో టిడిపి కండువా కప్పుకోవడం ఆనందంగా ఉందని వారు తెలిపారు అదేవిధంగా కుప్పం నియోజకవర్గ ఇన్చార్జ్ పిఎస్ మునిరత్నం మాట్లాడుతూ రాష్ట్రంలో టిడిపి ప్రభంజనం మొదలైందని ఈ సందర్భంగా కుప్పం నియోజకవర్గంలోని వైసిపి 60 కుటుంబాలు సుమారు చేరడం శుభపరిణామణి ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో త్రిలోక్ , గోపి, బి.ఎం.కె. రవి వెంకటేశు, కలై, మురుగేష్, సామిడి, ధర్మ, రాజు, అంబేద్కర్ తదితరులు పాల్గొన్నారు

## నష్టపోయిన రైతులను ఆదుకుంటాము

**రాష్ట్ర ప్రభుత్వ విద్యా సలహాదారులు ఆలూరు సాంబ శివారెడ్డి**



గార్లదిన్నె మార్చి 20మనం న్యూస్: శింగనమల నియోజకవర్గం లో నీ పుట్లూరు,నార్పల, మండలాల్లోని పలు గ్రామాల్లో గత రెండు రోజుల క్రితం కురిసిన వడగండ్ల వానకు నష్టపోయిన పంట పొలాలను పరిశీలించిన రాష్ట్ర ప్రభుత్వ విద్యా సలహాదారులు ఆలూరు సాంబశివారెడ్డి పరిశీలించారు ఈ సందర్భంగా ఆలూరు సాంబశివారెడ్డి మాట్లాడుతూ నష్ట పోయిన రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. నష్టపోయిన పంట యొక్క వివరాలను అంచనా వేయాలని సంబంధిత అధికారులకు సూచిం చారు.తక్షణమే నష్టపరిహారం అందేలాగా ప్రభుత్వం దృష్టికి తీసుకొని వెళ్లి రైతులకు నష్టపరిహారం వచ్చేలాగా చేస్తానని రైతులకు భరోసా ఇచ్చారు.

## పంట నష్టంపై సమీక్ష సమావేశం

నార్పల మార్చి 20(మనం న్యూస్ ) నార్పల మండలం లోని మండల పరిషత్ కార్యాలయం యందు పంట నష్టం పై మండల అధికారుల సమీక్ష సమావేశం నిర్వహించారు.మండల పరిధిలోని పలు గ్రామాల్లో శనివారం సాయంత్రం కురిసిన వడగండ్ల వానతో నార్పల మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లో పండ్ల తోటలు వివిధ రకాల పంటలు పూర్తిగా నాశనమై మండల రైతులు వందలాది ఎకరాల్లో పంట నాశనమై కోట్లాది రూపాయలు పంట నష్టపోవడం జరిగిందని పంట నష్టాన్ని అంచనా వేయడానికి సోమవారం మండల కేంద్రంలోని స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో తాసిల్దార్ నారాయణస్వామి అధ్యక్షతన మండల అధికారులు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల అధికారులు వీఆర్వో లో పంచాయతీ కార్యదర్శులతో కలిపి మూడు నాలుగు టీంలుగా ఏర్పాటు చేసి పంట నష్టాన్ని అంచనా వేయడం జరుగుతుందని తాసిల్దార్ నారాయణస్వామి ఎంపీడీవో దివాకర్ తెలిపారు.

నార్పల మండల వ్యాప్తంగా శనివారం కురిసిన వడగండ్ల వాన కు ఇంత వరకు దెబ్బ తిన్న పంటల వివరాలుఅరటి...1,322 ఎకరాల్లో మామిడి = 260 ఎకరాల్లో చిని 290 ఎకరాల్లో బొప్పాయ20ఎకరాల 23 ఎకరాల్లోటమోటా 12 ఎకరాల్లోమొక్కజొన్న 474 ఎకరాల్లో వేరుశనగ = 125 ఎకరాల్లో వరి 80 ఎకరాల్లో ఉద్దులు 15 ఎకరాల్లో పంట నష్టంమైనట్లు అధికారులు ప్రాథమిక అంచనా వేయడం జరిగిందని తెలిపారు.

ఈ సమావేశంలో మండల విద్యాధికారి కృష్ణయ్య ఎస్సు రాఘవరెడ్డి విద్యుత్ ఏఈ రఘునాథ్ బాబు ఆర్డబ్ల్యూఎస్ ఇంజనీర్ రవీంద్రనాథ్ రెడ్డి మండల వ్యవసాయ అధికారి ముస్తఫా ఏపీవో ఓబన్న ఏపీఎం తిప్పమ్మ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు..



## 25లోపు పంట నష్ట జాబితాను అందజేయాలి



పెనుకొండ మార్చి 20 మనం న్యూస్: ఇటీవల అకాల వర్షాలకు పంట నష్టపోయిన రైతుల జాబితాను తయారుచేసి ఈనెల 25 లోపు మండల వ్యవసాయ కార్యాలయంలో అందజేయాలని సహాయ వ్యవసాయ సంచాలకులు స్వయంప్రభ పేర్కొన్నారు. సోమవారం ఆమె మండల పరిధిలోని దుద్దే బండ, వెంకటగిరి పాళ్యం ,ఆర్బికేల పరిధిలో వడగండ్ల వర్షానికి దెబ్బతిన్న రైతు పంట పొలాలను పరిశీలించారు. ఆయా రైతు భరోసా కేంద్రాల సిబ్బంది పంట నష్టపోయిన రైతు పొలాలను సందర్శించి పంట నష్టాన్ని అంచనా వేసి వ్యవసాయ శాఖ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి సురేంద్ర నాయక్ ,సచివాలయ అగ్రికల్చర్ అసిస్టెంట్ జయరాం, రైతులు ముకుంద, బాబుల్ రెడ్డి తదితర వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎండల తీవ్రత, వడగాల్పులు అధికంగా నమోదు కానున్నాయి

**- జిల్లా అధికారులు అవగాహన కల్పించాలి, ఏర్పాట్లు చేపట్టాలి**

**- జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి**

తిరుపతిటౌన్, మార్చి 20, మనం న్యూస్: మార్చి మాసం నుండి ఈ ఏడాది ఎండల తీవ్రత అధికంగా ఉంటుందని 48 నుండి 49 డిగ్రీలు జిల్లాలో నమోదు అయ్యే అవకాశం ఉందని, వడగాల్పులు తోడుకానున్నాయని జిల్లా అధికారులు, స్వచ్ఛంద సంస్థలు లు, స్వయం సహాయక సంఘాలు సమన్వయంతో అవగాహన కల్పించడం, చలివేంద్రాల ఏర్పాటు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కె.వెంకటరమణా రెడ్డి అన్నారు. సోమవారం మధ్యాహ్నం స్థానిక కలెక్టరేట్ లో విపత్తుల నిర్వహణ కు సంబంధించి ఈ ఏడాది నమోదు కానున్న ఎండల తీవ్రత, వడగాల్పులపై చేపట్టాల్సిన ముందుజాగ్రత్తలపై జె.సి. డి.కె.బాలాజీతో కలసి జిల్లా అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎండల తీవ్రత, వడగాల్పులు నమోదు కానున్న నేపథ్యంలో రెవిన్యూ యంత్రాంగం, జిల్లా, మండల స్థాయిలో కంట్రోల్ రూముల ఏర్పాటు, పంచాయితీ రాజ్, మున్సిపల్ శాఖలు మజ్జిగ పంపిణీ, చలి వేంద్రాల ఏర్పాటు చూడాలని అన్నారు. ప్రధానంగా ప్రతి రోజు నమోదు కానున్న ఎండ తీవ్రత వివరాలు మీడియాకు అందించి ప్రత్యేక కాలమ్ ఏర్పాటుతో ప్రచురించేలా చూడాలని అన్నారు. స్వచ్ఛంద సంస్థలు, మహిళా సంఘాల సభ్యులు సహకారం అందించాలని సూచించారు. గ్రామాలలో పశువుల కోసం ఏర్పాటు చేసి ఉన్న వాటర్ టబ్స్ లో ఎప్పటికప్పుడు నీరు నింపేలా, విద్యుత్ అంతరాయం కలిగితే చేతి పంపులు అందుబాటులో ఉండేలా చూడాల్సి ఉంటుందని అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. పాఠశాలల పిల్లలకు సంబంధించి ప్రభుత్వం త్వరలో సమయం నిర్ణయించనున్నదని ఆ సమయం ప్రకారం వెంటనే పిల్లలు ఇంటికి చేరేలా జిల్లా విద్యా శాఖ చర్యలు తీసుకోవాలని, వైద్య ఆరోగ్య శాఖ సహకారంతో ఓ.ఆర్.ఎస్. ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని అన్నారు. వైద్య ఆరోగ్య శాఖ అన్ని సచివాలయాలలో ఉన్న హెల్త్ సెంటర్లలో, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో, సి.హెచ్.సి. లలో, జిల్లా కేంద్ర ఆసుపత్రులలో కావలసిన ఓ.ఆర్.ఎస్., ఫ్లూఇడ్స్, మందులు అందుబాటులో ఉండాలని అన్నారు. విద్యుత్ శాఖ తప్పనిసరి అన్ని ఆసుపత్రులకు విద్యుత్ అంతరాయం అన్నది కలగకుండా పర్యవేక్షణ ఉండాలని అన్నారు. వడదెబ్బ తో ఏ ఒక్కరికి ప్రాణ హాని జరగరాదని అన్ని శాఖలు సమన్వయంతో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం సరైన సమయానికి ఆసుపత్రులకు చేర్చండం వంటివాటిపై దృష్టి పెట్టాలని అన్నారు. ఉపాధి హామీ పనులకు సంబంధించి పనులను ఉదయం, సాయంత్రం సమయాలలో చేపట్టేలా చూడాలని పనులు జరుగుతున్న ప్రదేశాలలో షెల్టర్ల ఏర్పాటు చూడాలని అన్నారు. పట్టణ ప్రాంతాలలో ప్రత్యేకంగా బస్ స్టాప్ ల వద్ద, రద్దీ ప్రాంతాలలో తాత్కాలిక గ్రీన్ షేడ్స్ ఏర్పాటు తప్పనిసరి చేయాల్సి ఉంటుందని, స్ట్రీట్ వెండర్స్ లకు సౌకర్యం వంటివి మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లా ప్రజలకు ప్రత్యేకంగా తెలియజేసేది మధ్యాహ్నం 12 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు బయట తిరగరాదని, అత్యవసర పరిస్థితులైతే అన్ని జాగ్రత్తలతో వెళ్ళాలని సూచించారు.

ఈ సమీక్షలో జిల్లా రెవిన్యూ అధికారి శ్రీనివాస రావు, జిల్లా గ్రామీణ నీటి సరఫరా అధికారి విజయకుమార్, జిల్లా విద్యాశాఖాధికారి శేఖర్, సెక్షన్ సూపరింటెండెంట్ పరమేశ్వర స్వామి, వైద్య శాఖ అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు బాలకృష్ణా రెడ్డి, రాజా రెడ్డి, మార్కండేయ రెడ్డి, సుబ్రహ్మణ్యం, అరుణ, అమరేంద్ర, గౌరి, సుమలత , జిల్లా వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



## బడుగుమాకులపల్లి వారపు సంత వేలం నిర్వహణ

శాంతిపురం, మార్చి 20, మనం న్యూస్: బడుగుమాకులపల్లి వారపు సంతకు పెరిగిన ఆదాయం జిల్లాలోని అతిపెద్ద సంతగా పేరుగాంచిన బడుగుమాకు పల్లి వారపు సంతకు ఈ ఆర్థిక సంవత్సరానికి ఆదాయం పెరిగింది. గత సంవత్సరం 21లక్షల60వేల ఆదాయముండగా ఈసారి 60వేల ఆదాయం పెరిగి 22 లక్షల ఇరవై వేలయ్యింది. ఈసారి వారపు సంత వేలంపాట లో పాల్గొన్న వారికి నియమ నిబంధనలను వర్తిస్తాయని పంచాయతీ అధికారులు జిల్లా అధికారులు తెలియజేశారు కాగా 2023 -2024 ఆర్థిక సంవత్సరానికి కోళ్లు,గొర్రెలు, వారపు సంతను 5,లక్షల13వేలరూపాయలకు కుప్పం మండలం వసనాడు గ్రామానికి చెందిన ఎం సత్యనారాయణ అనే గుత్తేదారు దక్కించుకున్నారు. ప్రైవేటు వాహనాల వేలం పాటను 4, లక్షల 63 వేల రూపాయలకు శాంతిపురం మండల కేంద్రానికి చెందిన సుబ్రహ్మణ్యం గుత్తేదారు దక్కించుకున్నారు. అంగళ్లు సంత వేలంపాటలో 5 లక్షల 55 వేల రూపాయలకు, మండల పరిధిలోని జంగాలపల్లికి చెందిన బాలాజీ అనే గుత్తేదారు దక్కించుకోగా ఎద్దుల సంతను 6 లక్షల 89, వేల రూపాయలకు మండల కేంద్రంలోని ఆరు మొత్తం పల్లి గ్రామానికి చెందిన జ్ఞానేంద్ర రెడ్డి దక్కించుకున్నారు ఈ వేలం పాట కార్యక్రమంలో సర్పంచ్ ఏవి జయరాం, ఉపసర్పంచ్ అప్పిరెడ్డి,ఈఓపిఆర్డి విజయదత్, పంచాయతీ కార్యదర్శులు జి అశ్వత్ నారాయణ, బిఆర్ రవి నాయక్, పంచాయతీ ఆ పంచాయతీ వార్డు సభ్యులు, నేతలు మురళీమోహన్ రెడ్డి జగదీష్ నాయుడు శ్రీనివాసులు రెడ్డి గ్రామ సచివాలయ సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

## దళిత టీడీపీ ఎమ్మెల్యేపై దాడి చేయడం దారుణం

**- రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షుడు మునస్వామి**



రామకుప్పం, మార్చి 20, మనం న్యూస్ : శాసన సభసమావేశల్లో అధికారపార్టీ శాసనసభ్యుడు దళిత టీడీపీ శాసనసభ్యులైన బాలవీరాంజనేయస్వామిపై దాడిచేయడం హేయమైన చర్య అని సోమవారం రామకుప్పం టి. డి. పి కార్యాలయంలో రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షుడు మునస్వామి వై. సి. పి ప్రభుత్వం పై మండిపడ్డారు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఘోరపరాజయం పాలైనందుకు వై. సి. పి ఆరాచకాలు చేస్తుందన్నారు ఏ ఆరాచకాలను కట్టి పెట్టి ప్రజాస్వామిబద్దకంగా పాలనా చేయాలాన్నారు చీకటి జి. ఓ పై టి. డి. పి శాసనసభ్యులు నిరసన వ్యక్తం చేస్తే వై. సి. పి శాసనసభ్యులు విరుచుకుపడి దాడిచేయడం దారుణమ న్నారు వై. సి. పి ప్రభుత్వం నా ఎస్సీ ఎస్టీ బి. సి అని ప్రగాల్బాలు పలుకుతూ వీరి మధ్య చిచ్చుపెట్టి పబ్బం గడుపుకుంటున్నారన్నారు చట్టాలను గౌరవించడం పోయి రౌడీయిజం చేయడం 70 ఏళ్ళ వృద్ధుడైన గోరంట్ల బచ్చయ్య చౌదరిపై వెల్లంపల్లి శ్రీనివాస్ దాడి చేయడం అమానుషమన్నారు 4ఏళ్ళ ఈ వై. ఎస్సార్ ఆరాచకపాలన పట్ల ప్రజల్లో తీవ్ర వ్యరేకత పెరిగిందన్నారు ఇప్పటికైనా వై. సి. పి పెద్దలు గుర్తించి ప్రజాస్వామిబద్దకంగా మెలగాలని హితావుపలికారు ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మహ్మద్ రఫి కామరాజునాయక్ బాబు పాల్గొన్నారు

# పెద్దశేష వాహనంపై శ్రీ కోదండరాముడి వైభవం

తిరుపతి (టీటీడీ), మార్చి 20, మనం న్యూస్: తిరుపతి శ్రీ కోదండరామస్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మొదటిరోజు సోమవారం రాత్రి 7 గంటల నుంచి పెద్దశేష వాహనంపై శ్రీ సీత లక్ష్మణ సమేత శ్రీ రామచంద్రమూర్తి భక్తులకు కనువిందు చేశారు. గజరాజులు ముందు కదులుతుండగా, భక్తజన బృందాలు చెక్కభజనలు, కోలాటాలతో స్వామివారిని కీర్తిస్తుండగా, మంగళవాయిద్యాల నడుమ స్వామివారి వాహనసేవ కోలాహలంగా జరిగింది. భక్తులు అడుగడుగునా కర్పూరహారతులు సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు. ఏడులోకాలకు సంకేతంగా ఏడుపడగలు గల ఆదిశేషుడు స్వామివారిని







స్తుతిస్తూ, స్వామికి మంచం, పరుపు, ఛత్రం మూడూ తానే అయి శేషశాయి అనే పేరును సార్థకం చేశారు. శ్రీవారికి విశ్రాంతికీ, సుఖనిద్రకూ కారణమయ్యారు . తనను, శేషుణ్ణీ దర్శించే భక్తుల్ని కాపాడుతానని, భక్తులు శేషుని వలే తనకు నిత్యసేవకులుగా ఉండి సత్ఫలాలు పొందాలని ఈ వాహనసేవ ద్వారా స్వామి వారు అనుగ్రహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో తిరుమల పెద్దజీయర్స్వామి, చిన్నజీయర్స్వామి, జేఈవో వీరబ్రహ్మం దంపతులు,ఆలయ డెప్యూటీ ఈవో శ్రీమతి నాగరత్న, విజివో మనోహర్, ఏఈవో మోహన్, సూపరింటెండెంట్ రమేష్, కంకణభట్టర్ ఆనంద కుమార్ దీక్షితులు, టెంపుల్ ఇన్స్పెక్టర్లు చలపతి, సురేష్,విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆకట్టుకున్న భక్తి సంగీత కార్యక్రమాలు :శ్రీ కోదండరామ స్వామి వారి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ఎస్వీ సంగీత, నృత్య కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు సోమవారం నిర్వహించిన భక్తి సంగీత కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. సాయంత్రం 6 నుండి 7 గంటల వరకు హరిబాబు – నాదస్వరం,శ్రీనివాసులు మరియు నాగేశ్వరరావు – డోలు, రాత్రి 7 నుండి 8 గంటల వరకు శ్రీమతి చిన్నమ్మ దేవి బృందం గాత్ర సంగీతం నిర్వహించారు. రాత్రి 8 నుండి 9 గంటల వరకు తిరుపతికి చెందిన సురేష్ బృందం నృత్య కార్యక్రమం జరిగింది....

## మార్చి 21న శ్రీవాణి టికెట్ల ఆన్‌లైన్ కోటా విడుదల



తిరుమల,మార్చి 20, మనం న్యూస్: శ్రీవాణి టికెట్లకు సంబంధించిన జూన్ నెల ఆన్ లైన్ కోటాను మార్చి 21వ తేదీ మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు టిటిడి విడుదల చేయనుంది. మార్చి 23న శ్రీవారి ఆర్జితసేవా టికెట్లు. తిరుమల శ్రీవారి ఆర్జిత సేవా టికెట్లకు సంబంధించిన జూన్ నెల కోటాను మార్చి 23న ఉదయం 10గంటలకు టిటిడి ఆన్లైన్లో విడుదల చేయనుంది. వీటిలో కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవలు ఉన్నాయి.అదేవిధంగా, జూన్ నెలకు సంబంధించిన మిగతా ఆర్జితసేవా టికెట్లకు ఆన్లైన్ లక్కీడిప్ నమోదు ప్రక్రియమార్చి 24న ఉదయం 11 గంటలకు మొదలవుతుంది. లక్కీడిప్ లో టికెట్లు పొందిన వారు సొమ్ము చెల్లించి ఖరారు చేసుకోవాల్సి ఉంటుంది. అంగప్రదక్షిణం టోకెన్లు. జూన్ నెలకు సంబంధించినఅంగప్రదక్షిణంటోకెన్ల కోటాను మార్చి 24నఉదయం 10 గంటలకు టిటిడి ఆన్లైన్లోవిడుదలచేయనుంది.వృద్ధులు, దివ్యాంగుల దర్శన కోటా... వయోవృద్ధులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధులున్నవారు తిరుమల శ్రీవారిని దర్శించుకునేందుకు వీలుగా ఏప్రిల్ నెల ఉచిత ప్రత్యేక దర్శనం టోకెన్ల కోటాను మార్చి 24వ తేదీన మధ్యాహ్నం 3 గంటలకు టిటిడి ఆన్లైన్లో విడుదల చేయనుంది. భక్తులు ఈ విషయాన్ని గమనించి టికెట్లు బుక్ చేసుకోవాలని కోరడమైనది.

## వైకాపా దళిత ఎమ్మెల్యే సుధాకర్ బాబుపై దాడి చేయడం చాలా బాధాకరం

బంగారుపాళ్యం, మార్చి 20, మనం న్యూస్: వైఎస్సాఆర్ పార్టీ దళిత ఎమ్మెల్యే పై తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే లు దాడి చేయడం చాలా బాధాకరం అని చిత్తూరు జిల్లా పూతలపట్టు నియోజకవర్గం బంగారుపాళ్యం మండలానికి చెందిన రాష్ట్ర వైఎస్సాఆర్ టీచర్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి పొన్నేరి దామోదరం అన్నారు ఆయన మాట్లాడుతూ సోమవారం జరిగిన అసెంబ్లీ సమావేశంలో ఎస్సీ వర్గానికి చెందిన ఎమ్మెల్యే సుధాకర్ బాబు పై టిడిపి వర్గాలు దాడి చేయడం చాలా అమానుష్యమని బాధాకరమని దళితులంటే చిన్నచూపు ఎందుకని దళితులను అసభ్యకరంగా మాట్లాడడం చాలా బాధాకరమని వాపోయారు. ఎస్సీ సామాజ వర్గానికి చెందిన ఎమ్మెల్యేలు చాలామంది ఉన్నారు ఉప ముఖ్యమంత్రి గంగాధర నెల్లూరు శాసన సభ్యులు నారాయణస్వామి పై కూడా అవమాన పదజాలంతో అసెం బ్లీలో మాట్లాడడం తెలుగుదేశం పార్టీ వారికి తగదని ఇది ఎంతవరకు మం చిది కాదని, మీ అహంకారాలు అనిచే రోజులు దగ్గరలో ఉన్నాయని అన్నారు


## గంటల పాటు కవిత ఈడీ విచారణ



న్యూఢిల్లీ, మార్చి 20: ఢిల్లీ మద్యం కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) విచారణకు రెండోసారి హాజరైన ఎమ్మెల్సీ కవితను అధికారులు సుదీర్ఘంగా విచారించారు. ఇవాళ ఉదయం విచారణ ప్రారంభించిన ఈడీ అధికారులు దాదాపు 8 గంటలుగా ఆమెను ప్రశ్నించారు. పీఎంఎల్ఏ సెక్షన్ 50 కింద ఎమ్మెల్సీ కవితను అధికారులు ప్రశ్నిస్తున్నారు. మద్యం కేసులో మనీలాండరింగ్ అంశంలో ఆమెపై ఆరోపణలు వచ్చిన విషయం తెలిసిందే. ఒకవైపు కవిత విచారణ కొనసాగుతుండగానే.. తెలంగాణ అదనపు ఏజీ ఢిల్లీలోని ఈడీ కార్యాలయానికి చేరుకున్నారు. గత వారం కవితకు ఈడీ నోటీసులు జారీ చేసినా ఆమె విచారణకు హాజరుకాలేదు. తాను దాఖలు చేసిన పిటిషన్ను ఈ నెల 24న సుప్రీంకోర్టు విచారించనుందని, న్యాయస్థానం తదుపరి ఉత్తర్వులు జారీ చేసే వరకు వేచిచూడాలని కవిత ఈ నెల 16న లేఖ ద్వారా ఈడీకి విజ్ఞప్తి చేశారు. కానీ ఇవాళ రావాలని ఈడీ మళ్లీ నోటీసులు ఇవ్వడంతో కవిత విచారణకు హాజరయ్యారు.

## ఆత్మ నిర్భర్ భారత్ అభియాన్ పథకంలో గుంటూరు రైల్వే పనులకు 125 కోట్లు విడుదల

రేణిగుంట, మార్చి 20, మనం న్యూస్ ప్రతినిధి: సికింద్రాబాద్, నంద్యాల, విజయవాడ మరియు తెనాలి నాలుగు వైపుల నుండి గుంటూరు జంక్షన్ ద్వారా ట్రాఫిక్ను ఎదుర్కోవడానికి ప్రస్తుతం ఉన్న అడ్డంకులను నివారించడానికి గుంటూరు రైల్వేస్టేషన్ పునర్నిర్మించడానికి 125 కోట్లు. మంజూరు చేసినందుకు గుంటూరు ప్రజల తరపున కృతజ్ఞతలు తెలియచేస్తున్నాను. 2022–23 సంవత్సరానికి కేంద్రం మంజూరుచేసిన నిధులకు గాను కేంద్ర ఆర్థికమంత్రి కి కృతజ్ఞతలు తెలియచేసిన గుంటూరు ఎంపీ గల్లా జయదేవ్ ప్యాసింజర్ రైళ్లకు ,ఎక్స్ప్రెస్ రైల్వేస్, మరియు గూడ్స్ , ట్రాఫిక్ కు అంతరాయం లేకుండ 24 గంటలు , మెరుగుపరచడానికి.,రైల్వే ప్లటుఫామ్స్ కోసం ఈ నిధులు అవసరమవుతాయని పేర్కొన్నారు మరియు రైల్వే గుంటూరు స్టేషన్ తో పాటు, మంగళగిరి స్టేషన్ను అభివృద్ధి కోసం తీసుకున్న నిర్ణయాన్ని లక్ష్మీ నరసింహస్వామి భక్తులల




తరపున కృతజ్ఞతలు తెలుపుతున్నాను గుంటూరు మరియు దాని పరిసర ప్రాంతాల ప్రజలు సౌకర్యాలు వినియోగించుకునేలా, నిర్ణీత కాలవ్యవధిలో పై పనులను పూర్తి చేయాలని కోరారు

## ‘గవర్నర్’ పిటిషన్‌పై సుప్రీంలో విచారణ

- నోటీసులు జారీ చేస్తామన్న సుప్రీంకోర్టు
- వద్దని కోరిన సొలిసిటర్ జనరల్..




న్యూఢిల్లీ, మార్చి 20: శాసనసభ ఆమోదం తెలిపిన బిల్లులను గవర్నర్ ఆమోదించడం లేదని, ఈ మేరకు ఆదేశాలు జారీచేయాలని కోరుతూ తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టులో సోమవారం విచారణ జరిగింది. ఈ సందర్భంగా పిటిషన్‌పై సర్వోన్నత న్యాయస్థానం కేంద్రం స్పందనను కోరింది. సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ జేబీ పార్దివాలా ధర్మాసనం పిటిషన్‌పై విచారణ జరిపింది. ఈ సందర్భంగా గవర్నర్‌కు నోటీసులు జారీ చేస్తామని ధర్మాసనం తెలిపింది. కేంద్రం తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. నోటీసులు అక్కర్లేదని, ఏం జరుగుతుందో తెలుసుకుంటామన్నారు. బిల్లుల ఆమోదంపై పురోగతిని తెలుసుకొని చెబుతానని కోర్టుకు తెలిపారు. నోటీసులు అవసరం లేదని ధర్మాసనానికి విజ్ఞప్తి చేశారు. రాజ్యాంగబద్ధమైన పదవి దష్ట్యా నోటీసులు జారీ చేయొద్దని కోరారు. ఈ మేరకు కోర్టు విచారణను ఈ నెల 27వ తేదీకి వాయిదా వేసింది. విచారణ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది దుష్యంత్ దవే వాదనలు వినిపించారు.రాష్ట్ర శాసనసభ ఆమోదించిన బిల్లులను గవర్నర్ ఆమోదించడం లేదని, సెప్టెంబర్–2022లో ఆమోదించిన కామన్ రిక్రూట్మెంట్ బోర్డ్ బిల్లుతో సహా పలు కీలక బిల్లులు గవర్నర్ వద్ద పెండింగ్లో ఉన్నాయన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 200 ప్రకారం గవర్నర్‌కు శాసనసభ ఆమోదించిన బిల్లులకు ఆమోదం తెలుపడం, తిరస్కరించడం, లేదంటే రాష్ట్రపతి పరిశీలన కోసం పంపే అధికారం ఉందని, అయితే ఈ అధికారాన్ని సాధ్యమైనంత త్వరగా ఉపయోగించాలని తెలంగాణ ప్రభుత్వం తరపున దుష్యంత్ దవే వాదనలు వినిపించారు.పెండింగ్‌లో ఉన్న బిల్లులు ఇవే..తెలంగాణ విశ్వవిద్యాలయాలకు ఉమ్మడి రిక్రూట్మెంట్ బోర్డు బిల్లుములుగులోని అటవీ కళాశాల, పరిశోధనా సంస్థను అటవీ వర్సిటీగా అప్గ్రేడ్ చేసే బిల్లుజీఎస్టీ చట్ట సవరణఆజమాబాద్ ఇండస్ట్రియల్ ఏరియా చట్ట సవరణమున్సిపల్ చట్ట సవరణపబ్లిక్ ఎంప్లాయిమెంట్ చట్ట సవరణప్రైవేటు యూనివర్సిటీ సవరణ బిల్లుమోటార్ వెహికిల్ టాక్సేషన్ సవరణ బిల్లు

## పార్లమెంట్‌లో బీఆర్ఎస్ ప్రకంపనలు వాయిదాల పర్వంపై బీఆర్ఎస్ మండిపాటు

- జేపీసీకి నామ నాగేశ్వరరావు డిమాండ్
- ప్రతిపక్షాల గొంతు నొక్కుతున్న కేంద్రం
- ప్రతిపక్ష పాత్రనూ పోషిస్తున్న కేంద్రం
- ప్రతి పక్ష నాయకులపైకి దర్యాప్తు సంస్థలను ఉసిగొల్పుతున్న కేంద్రం
- ప్రజలంతా కేంద్రం దుర్నీతిని గమనిస్తున్నారు
- కేంద్రానికి తగిన గుణపాఠం ఖాయం
- విజయ్ చౌక్ ధర్నాలో లోక్ సభలో బీఆర్ఎస్ పక్ష నాయకులు నామ నాగేశ్వరరావు ధ్వజం

ఖమ్మం, మార్చి 20 (మనం బ్యూరో) : అదానీ – హిడెన్ బర్గ్ అంశంపై బీఆర్ఎస్ ఎంపీలు పార్లమెంట్ లో ప్రకంపనలు సృష్టిస్తున్నారు. బీఆర్ఎస్, విపక్ష పార్టీల ఆందోళనతో ఉభయ సభల్లో వాయిదాల పర్వం కొనసాగుతోంది. బీఆర్ఎస్ ఇస్తున్న వాయిదా తీర్మాణాలను తిరస్కరిస్తూ ఉభయ సభలను వాయిదా వేసుకుంటూ పోతుండడం పట్ల సర్వత్రా నిరసన వెల్లువ కొనసాగుతోంది. కేంద్రం తీరుపై బీఆర్ఎస్ మండిపడుతోంది.అదానీ అంశంపై సత్వరమే సంయుక్త పార్లమెంటరీ కమిటీ వేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఎంపీలు ప్లకార్డులతో దిక్కులు పిక్కటిల్లేలా నినాదాలు చేస్తూ పార్లమెంట్ నుంచి నడుచుకుంటూ వెళ్లి విజయ్ చౌక్ లో పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. మోదీ డౌన్ డౌన్... కేంద్ర ప్రభుత్వ నిరంకుశత్వం నశించాలి... అదానీ అంశంపై జేపీసీ వేయాలి.. ప్రజాస్వామ్య విలువలు కాపాడలంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా లోక్ సభలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు నామ నాగేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కావాలనే అదానీ అంశాన్ని పక్కదోవ పట్టించేందుకు పార్లమెంట్ ను తనంతట తానే వాయిదా వేసుకుంటూపోతూ మాట్లాడకుండా ప్రతిపక్షాల గొంతు నొక్కుతుందని ధ్వజమెత్తారు .స్వాతంత్ర్యం వచ్చిన ఇన్నేళ్లలో ఇటువంటి పరిస్థితిని ఎన్నడూ చూడలేదన్నారు. ప్రజలు ఎన్నుకున్న ప్రజా ప్రతినిధులమంతా నిత్యం పార్లమెంట్ లోపల, బయట ప్రజాస్వామ్య విలువలు కాపాడేందుకు శాంతియుతంగా ప్రజా ప్రాధాన్యత కలిగిన అంశంపై ఆందోళన చేస్తున్నా కేంద్రం నిస్సిగ్గుగా వ్యవహరిస్తూ ప్రజలకు జవాబు చెప్పకుండా మోహం చాటేస్తుండడం దారుణమన్నారు. పార్లమెంట్ లో అధికార పక్ష ఎంపీలే పార్లమెంట్ ను వాయిదా వేయాలని కోరుతున్నారని, కేంద్ర ప్రభుత్వం కూడా ప్రతిపక్షాల ఆందోళనలను పట్టించుకోకుండా సభను వాయిదా వేస్తూ తానే ప్రతిపక్ష పాత్రను కూడా పోషిస్తున్న వింత పరిస్థితి పార్లమెంట్ లో ఉందని నామ పేర్కొన్నారు. ఒక వైపు దర్యాప్తు సంస్థలను ప్రతి పక్ష పార్టీల నాయకులపై ఉసి కొల్పుతూ రాజకీయ పబ్బం గడుపుకుంటుందని దుయ్యబటారు. కేంద్రం దుర్నీతిని దేశ ప్రజలంతా గమనిస్తున్నారని, రానున్న రోజుల్లో వారికి ప్రజలే తగిన గుణపాఠం నేర్పుతారని స్పష్టం చేశారు. అదానీ అంశంపై జేపీసీ వేయాలని పార్లమెంట్లో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తున్నా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకుండా నియంతృత్వంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. ప్రతిపక్షాలను సభల్లో నోరు తెరవనివ్వకుండా సభలను వాయిదా వేస్తూ ప్రజాస్వామ్య విలువలను కాలరాస్తుందన్నారు. కోట్లాది మంది ప్రజలు కష్టపడి సంపాదించుకున్న డబ్బును ఎల్ఐసి , ఎస్బీఐ , తదితర బ్యాంకులు, ఆర్థిక సంస్థల్లో దాచుకున్నారని, ఇప్పుడు ప్రజల డబ్బుకు భద్రత కరువైందని, ఈ అంశంపై చర్చించాలని కోరుతూ నిత్యం వాయిదా తీర్మానాలు ఇస్తున్నా ప్రతి సారి తిరస్కరిస్తూ ప్రజాస్వామ్య విలువలను కాలరాస్తున్నారని ధ్వజమెత్తారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం భేషజాలకు పోకుండా అదానీ –హిడెన్ బర్గ్ అంశంపై సంయుక్త పార్లమెంటరీ కమిటీనీ లేదా సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జి చేత విచారణ జరిపించి, వాస్తవాలు ప్రజల ముందుంచాలని నామ డిమాండ్ చేశారు. లేకుంటే రానున్న రోజుల్లో ఈ ప్రభుత్వానికి ప్రజలే తగిన శాస్తి చేయడం తథ్యమని నామ పేర్కొన్నారు. ఈ ధర్నాలో పార్టీ పార్లమెంటరీ నాయకులు కే.కేశవరావు, పార్టీ ఎంపీలంతా పాల్గొన్నారు. కాగా అదానీ అంశంపై సోమవారం కూడా పార్లమెంట్ ఉభయ సభల్లో వాయిదాల పర్వం కొనసాగింది. ప్రతిపక్ష విపక్ష ఎంపీలు పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ జేపీసీకి డిమాండ్ చేయడంతో తొలుత సభలను మధ్యాహ్నం 2 గంటలకు వాయిదా వేశారు. మళ్ళీ 2 గంటలకు సభ సమావేశం కాగానే అదే పరిస్థితి తలెత్తడంతో ఉభయ సభలను మంగళవారానికి వాయిదా వేశారు.



## కాలయాపన చేయకుండా రైతులను ఆదుకోండి

- 5 లక్షల ఎకరాల్లో పంట నష్టం
- ఫసల్ బీమాను రాష్ట్రంలో అమలు చేయాలి
- సీఎంకు బండి సంజయ్ లేఖ



హైదరాబాద్, మార్చి 20 (మనం న్యూస్): తెలంగాణలో అకాల వర్షాలతో 5 లక్షల ఎకరాలకు పైగా పంట దెబ్బతిందని.. నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించి ఆదుకోవాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు సీఎం కేసీఆర్‌కు ఆయన బహిరంగ లేఖ రాశారు. ప్రకృతి వైపరీత్యాల కారణంగా రైతులు నష్టపోతే ఆదుకొనేందుకు రాష్ట్రంలో ఇప్పటివరకు సమగ్ర పంట బీమా పథకాన్ని రూపొందించకపోవడం బాధాకరమన్నారు. పథకం రూపొందించడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కారణంగా ఏళ్ల తరబడి అన్నదాతలు నష్టపోతూనే ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫసల్ బీమా యోజన పథకాన్ని తెలంగాణలో అమలు చేసుంటే.. పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందేదని బండి సంజయ్ అన్నారు. భాజపాకు పేరొస్తుందనే అక్కసుతోనే రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేయడం లేదని విమర్శించారు. కనీసం ఇప్పటికైనా స్పందించి సమగ్ర పంటల బీమా పథకాన్ని తీసుకొచ్చి రైతులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. సర్వేలు, నివేదికల పేరుతో కాలయాపన చేయకుండా యుద్ధప్రాతిపదికన నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. వ్యవసాయంలో అద్భుతాలు సృష్టించేందుకు రైతులకు ఉచితంగా ఎరువులు, విత్తనాలు అందిస్తామని గతంలో ప్రభుత్వం ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలన్నారు. వచ్చే వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని రైతులందరికీ రైతుబంధుతో పాటు ఉచితంగా యూరియా, విత్తనాలను అందించాలని బండి సంజయ్ లేఖ ద్వారా సీఎం కేసీఆర్‌ను కోరారు.

## ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్



ఖమ్మం, మార్చి 20 (మనం బ్యూరో) : నయాబజార్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ వి.పి.గౌతమ్ సోమవారం ఆకస్మికంగా తణిఖీ చేసారు. పరీక్షా కేంద్రంలో విద్యార్థులను హాల్ టికెట్లో సరిపోల్చి పరిశీలించారు. మాస్ కాపీయింగ్ జరుగకుండా బాధ్యులు పర్యవేక్షించాలని ఇన్విజిలెటర్స్ను ఆదేశించారు. విద్యార్థులకు కల్పించిన మౌళిక వసతులను పరిశీలించారు. పరీక్షా హాలులో నిరంతర విద్యుత్ సరఫరా, ఫ్యాన్లు, వెలుతురు, ఉండాలని, త్రాగునీరు అందుబాటులో ఉంచాలన్నారు. పరీక్ష కేంద్రంలో ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికారలు, సెల్ఫోన్ అనుమతించరాదని, సమీపంలో ఎటువంటి జీరాక్స్ సెంటర్లు ఉండరాదని, 144 సెక్షన్ పటిష్టంగా అమలు చేయాలని సంబంధిత పోలీసు అధికారులకు కలెక్టర్ సూచించారు.

## వివి ప్యాడ్ లను పకడ్బందీగా తరలించాలి : కలెక్టర్ కె శశాంక



మహబూబాబాద్, మార్చి 20 (మనం ప్రతినిధి): వివి ప్యాడ్ లను పకడ్బందీగా తరలించాలని మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ కె.శశాంక ఆదేశించారు.సోమవారం ఈవీఎం గోడౌన్ ను పరిశీలించిన కలెక్టర్ ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు 578 ఎం-2 టైప్ వి.వి.ప్యాడ్ లను జిల్లా నుండి కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టి పకడ్బందీగా తిరుపతి ఇసిఐఎల్ ఫ్యాక్టరీకి తరలించాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భనలో కలెక్టర్ వెంట ఎలక్షన్ విభాగం తహశీల్దార్ అనురాధ బాయి, మహబూబాబాద్ తహశీల్దార్ నాగ భవాని, డిప్యూటీ తహసీల్దార్ గణేష్, సిబ్బంది బషీర్, రంజిత్, సెక్యూరిటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పంట నష్టంపై నివేదికలు అందించాలి : కలెక్టర్ శశాంక



మహబూబాబాద్, మార్చి20(మనం ప్రతినిధి): అకాల వర్షాలకు కోల్పోయిన పంటల వివరాలపై నివేదికలు తక్షణం అందజేయాలని జిల్లా కలెక్టర్ శశాంక జిల్లా అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి అకాల వర్షాలకు జరిగిన పంట నష్టం పై సంబంధిత రెవెన్యూ, వ్యవసాయ, ఉద్యానవన తదితర శాఖల అధికారులతో కలెక్టర్ టెలి కాన్ఫరెన్సు ద్వారా సమీక్షించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అకాల వర్షాలకు పంటలు, ఆస్తి ప్రాణ నష్టం జరిగినట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. విద్యుత్ స్తంభాలు విరిగిపోవడం, కూలి పోవడం, ట్రాన్స్ఫార్మర్స్ మరమ్మతులు చేపట్టి విద్యుత్తు సరఫరా నిలిచిన ప్రదేశాలను తక్షణం సందర్శించి పునరుద్ధరించాలన్నారు.జిల్లాలో తొర్రుర్, దంతాలపల్లి, పెద్ద వంగర, నెల్లికుదురు, కేసముద్రం, గూడూరు తదితర మండలాలలో పంటనష్టం వివరాలు ఇస్తూ గూడూరు మండలంలో ప్రాణ నష్టం జరిగినట్లు, పెద్ద వంగర మండలంలో చనిపోయిన పాడి పశువు వివరాలు అందించాలన్నారు. మండలస్థాయి, గ్రామస్థాయి అధికారులు సిబ్బంది క్షేత్ర స్థాయిలో పర్యటించి సమగ్ర సమాచారం తో నివేదికలు అందించాలన్నారు.అలాగే ఉద్యాన శాఖ పంట నష్టంపై నివేదిక అందజేయాలన్నారు.ఈ టెలి కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ అభిలాష అభినవ్, ఆర్డీఓ లు కొమరయ్య, రమేష్, వ్యవసాయ, ఉద్యానవన, రెవిన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణిలో వచ్చిన సమస్యలకు సత్వర పరిష్కారం చూపాలి

**-జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**



భూపాలపల్లి, మార్చి 20 మనం ప్రతినిధి : ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి వచ్చిన సమస్యలకు అధిక ప్రాధాన్యత ఇచ్చి సత్వర పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. సోమవారం జయశంకర్ భూపాలపల్లి ఇల్లందు క్లబ్ హౌస్ లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజల సమస్యలకు సంబంధించిన 22 దరఖాస్తులను జిల్లా కలెక్టర్ స్వీకరించారు. ప్రజల నుండి అందిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించుటకు సంబంధిత శాఖలకు కలెక్టర్ తెలిపారు.ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను ప్రాధాన్యతతో వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. పెండింగ్ లో ఉన్న సమస్యలకు అధిక ప్రాధాన్యత ఇచ్చి పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులకు కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో డి పి ఓ ఆశాలత, సి పి ఓ కె.శామ్యూల్ డి ఆర్ డి ఓ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సామాన్యుడు సంతోషంగా బ్రతకాలి అన్నది ప్రభుత్వ విధానం

**-కెసిఆర్ పాలనలో చైతన్యవంతమైన సమాజ నిర్మాణం**

**-తెలంగాణ ప్రజల ప్రేమ గొప్పది**

**-అందరినీ ప్రేమిస్తున్నది**

**-రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి**






వనపర్తి ప్రతినిధి మార్చి 20 (మనం న్యూస్ ): తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక ప్రజలందరూ కెసిఆర్ పాలనలో సామాన్యుడు సహితం సంతోషంగా బ్రతకాలి అన్నది ప్రభుత్వ విధానమని ఆ రకంగా జన రంజికమైన పాలన కెసిఆర్ అందిస్తున్నారని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి తెలిపారు. వనపర్తి నియోజకవర్గం పెద్దమందడి మండలం వెల్టూరు గ్రామం గోపాల సముద్రం వద్ద నిర్వహించిన టిఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్సీ తక్కెళ్ళపల్లి రవీందర్రావు తో కలిసి హాజరై మాట్లాడుతూ 700 ఏళ్ల క్రితం నిర్మించిన గణపసముద్రం, వనపర్తి రాజులు నిర్మించిన గోపాల సముద్రాన్ని పునరుద్ధరిస్తున్నాం. దశాబ్దాల కాలం పాటు నిలిచిపోయే విధంగా అభివృద్ధి పనులను ముఖ్యమంత్రి కేసీఆర్ సహకారంతో శాశ్వతంగా నిలిచిపోయే అభివృద్ధి చేశామని తెలిపారు.ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడిగా వనపర్తి నియోజకవర్గంలో 70 వేల ఎకరాలకు సాగునీరు అందించిన తర్వాతనే గత ఎన్నికల్లో నామినేషన్ వేశాను.పెద్ద ఎత్తున చెక్ డ్యాంల నిర్మాణం పూర్తిచేశాం. గ్రామాలు, తండాలకు సీసీ, బీటీ రహదారులను నిర్మించాం.రాష్ట్రంలో అత్యంత ఎక్కువగా సీసీ రహదారులు వేసిన నియోజకవర్గం వనపర్తి అని అన్నారు.కాంగ్రెస్, బీజేపీ పాలిత రాష్ట్రాలలో కరంటు, సాగునీరు, గురుకు లాలు, రైతుబంధు, రైతుభీమా, కేసీఆర్ కిట్ , కళ్యాణలక్ష్మి పథకాలు ఎందుకు లేవని ప్రశ్నించారు.వనపర్తిలో దేశంలోనే మొదటిసారి బాలికల గురుకుల వ్యవసాయ కళాశాలను ఏర్పాటు చేశామని 46 లక్షల కుటుంబాలకు ఆసరా ఫించన్లు ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ, ఏకైక ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. తమ ప్రభుత్వం నీళ్లు, కరంటు, మౌళిక వసతుల కల్పనకు దాదాపు 80, 90 శాతం ఖర్చు చేయడం జరిగింది.రాబోయే రోజులలో ప్రజలందరికీ ఉపాధి లక్ష్యంగా ప్రణాళికాబద్ధంగా ముందుకుసాగుతామని ఇప్పటి వరకు నియోజకవర్గంలో మూడువేల ఇళ్ల నిర్మాణం పూర్తయ్యింది . మరో మూడు వేల ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి అర్హులకు దశలవారీగా డబల్ బెడ్రూం ఇండ్లు నిర్మించి ఇస్తామని చెప్పారు. ప్రజాసేవ కోసం అంకితభావంతో పని చేస్తూ చేతికి శస్త్రచికిత్స జరిగిన వైద్యులు 45 రోజులు విశ్రాంతి తీసుకోమన్నా కేవలం మూడు రోజులే విశ్రాంతి తీసుకుని పనిచేయడం జరిగిందని తెలిపారు. త్వరలో కానాయపల్లి నుండి పెద్దమందడి చెరువుకు లిఫ్టు ఏర్పాటు చేస్తాం అని అన్నారు.వేలాదిగా తరలివచ్చి ఆత్మీయ సమ్మేళనం విజయవంతం చేసిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

**ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు వ్యాఖ్యలు**

తెలంగాణ రాష్ట్రం దేశంలోని మిగతా రాష్ట్రాలకు భిన్నంగా అభివృద్ధిలో ముందంజ వేసింది.కరంటు, సాగునీరు పుష్కలంగా ఉన్నది.తెలంగాణ గడపగడపకూ తాగునీరు అందించగలుగుతున్నాం.గత ప్రభుత్వాలకు చిత్తశుద్ధి లేదని ఆ ప్రభుత్వాలు ఎందుకు తాగునీరు అందించలేకపోయాయని ప్రశ్నించారు.నాడు వలసెల్లిన పాలమూరుకు ఇతర రాష్ట్రాల కూలీలు వలసవస్తున్నారు.

తాగునీళ్లు, సాగునీళ్లు, కరంటు పంచాయతీలు తెలంగాణలో లేవు .గత ప్రభుత్వాల్లో అన్నింటికీ ఆందోళనలే ఉండేవన్నారు.రైతుబంధు, రైతుభీమా పథకాలు విజయవంతంగా అమలవుతున్నాయి. వనపర్తి, పాలమూరు బిడ్డలు తెలంగాణ రాష్ట్రంలో ఆనందంగా ఉన్నారు.75 ఏళ్లు నష్టపోయిన తెలంగాణ నేడు సుభిక్షమవుతున్నది.వనపర్తి జిల్లాగా ఏర్పాటు అయి ఎంతో అభివృద్ధి చెందుతున్నది.దేశంలో ఇంత అభివృద్ధి చేస్తున్న ముఖ్యమంత్రి ఎవరూ లేరు.పచ్చని తెలంగాణ మీద నిప్పులు కురిపిస్తున్న వారిని ప్రజలు గమనించాలన్నారు. అభివృద్ధి చేస్తున్న బి ఆర్ఎస్ పార్టీని నేతలను ప్రజలు ఆశీర్వదించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ అధ్యక్షులు, మున్సిపల్ చైర్మన్ గట్టు యాదవ్ గారు, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షులు జగదీశ్వర్ రెడ్డి, జడ్పీటీసీలు రఘుపతిరెడ్డి, రాజశేఖర్ రెడ్డి, మార్కెట్ చైర్మన్ పలుస రమేష్ గౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్, మండల వైస్ ప్రెసిడెంట్ రఘుప్రసాద్ , మండల బీఆర్ఎస్ అధ్యక్షులు వేణు యాదవ్, మండల రైతుబంధు సమితి అధ్యక్షులు రాజాప్రకాష్ రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, వార్డు మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.



# రైతులకు ప్రభుత్వం ఇచ్చే భరోసా ఏంటి

**- జిల్లాలో 6 వేల ఎకరాల్లో పంటనష్టం,**

**- వైయస్సార్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల,**



వికారాబాద్ మార్చి 20 మనం న్యూస్:రైతులకు ప్రభుత్వం ఇచ్చే భరోసా ఎంటి అని జిల్లాలో కనీసం 6 వేల ఎకరాల పంట నష్టం జరిగిందని వైయస్సార్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సోమవారం వికారాబాద్ నియోజక వర్గంలోనిమోమిన్ పేట మండలం అ్రవాది కుర్దు గ్రామంలో జరిగిన పంట నష్టాన్ని పరిశీలిం చారు.వడగండ్ల వానకు సర్వం నష్టపోయామని వైఎస్ షర్మిలకు రైతులు విరించారు.ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ ..........ప్రతి రైతు నష్ట పోయాడని ఇంత వరకు ఒక్కరూ కూడా పరిశీలనకు రాలేదని మండి పడ్డారు.ఎంత నష్టం జరిగింది అనేది అంచనా కూడా వేయలేక పోతున్నారన్నారు. నష్ట పరిహారం పై పరిహారం ఇచ్చే దిక్కు కూడా లేదన్నారు. ఓట్లు వేయించుకోవడానికి తప్పా రైతులు ఎలా బ్రతుకు తున్నారు అని పట్టింపు ఈ ప్రభుత్వానికి లేదన్నారు.రాష్ట్ర వ్యాప్తంగా 5 లక్షల ఎకరాల్లో పంట నష్టం జరిగిందని రూ.1250 కోట్ల మేర నష్టం జరిగినట్లు అంచనా ఉందన్నారు.రైతులు భయపడకండి అనే భరోసా కూడా ఇప్పటికీ ముఖ్యమంత్రి ఇవ్వలేదన్నారు. రెండు వారాల్లో పంట చేతికి వచ్చే సమయంలో రైతు ఆగం అయ్యాడని అసలు తెలంగాణ లో ప్రతి ఏడాది పంట నష్టం జరిన పట్టించు కొనే దిక్కు లేదన్నారు.2018 -19 లో 960కోట్ల మేర పంటనష్టం జరిగిందని 2019- 20లో 990 కోట్ల మేర పంటనష్టం,2020-21 లో 500కోట్ల మేర నష్టం, 2021-22లో 1000కోట్లు మేర నష్టం,ఇప్పుడు 1250 కోట్ల నష్టం వాటిల్లిందని స్పష్టం చేశారు. ప్రతి ఏడాది ఒక్క రూపాయి కూడా నష్టపరిహారం ఇచ్చింది లేదన్నారు. మంత్రులు వస్తారు...గాలి మోటర్లలో తిరుగుతారు లెక్కలు తీస్తారు. తర్వాత మోసం చేస్తారన్నారు. పరిహారం ఇవ్వడానికి మాత్రం మొహం చాటేస్తారన్నారు, వైఎస్సార్ ఉన్నప్పుడు పంట నష్టం జరిగితే పరిహారంతో పాటు బోనస్ కూడా ఇచ్చే వారు అన్నారు.ఇప్పుడు రూపాయి కూడా పరిహారం ఇచ్చే దిక్కు లేదన్నారు. పండుగలా ఉన్న వ్యవసాయాన్ని కేసీఅర్ దండుగ చేశాడని పేర్కొన్నారు. మొత్తం 30 వేలు ఇచ్చే సబ్సిడీ పథకాలు బంద్ పెట్టాడని రాష్ట్రంలో కేసీఆర్ దరిద్రపు పాలనకు 8 వేల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని తెలిపారు.రైతు గౌరవంగా బ్రతకడం లేదని పంట నష్టం జరిగితే నేరుగా వచ్చి ముఖ్యమంత్రి పరిశీలన చేసింది లేదన్నారు.ముఖ్యమంత్రి కేసీఆర్ ను డిమాండ్ చేస్తున్నామని వెంటనే 1250 కోట్లు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## ఘనంగా పైడి రాకేష్ రెడ్డి జన్మదిన వేడుకలు

**-ప్రజాసేవి లక్ష్యంగా రాజకీయాల్లోకి..**

**-ప్రముఖ పారిశ్రామికవేత్త అంకాపూర్ రాకేష్ రెడ్డి**



ఆర్మూర్ మార్చి 20 (మనం న్యూస్ ): ప్రజా సేవే లక్ష్యంగా తనురాజకీయాల్లోకి రానున్నట్టు చెప్పకనే చెప్పిన అంకాపూర్ ప్రముఖ పారిశ్రామిక వ్యక్తి రాకేష్ రెడ్డి స్పష్టం చేశారు. విద్యా, వైద్యం ,సామి సామాజిక సేవ లక్ష్యంగా ముందుకు రానున్నానని ఈ సందర్భంగా గుర్తు చేశారు. సోమవారం అంకాపూర్ గ్రామంలో ప్రముఖ పారిశ్రామికవేత్త పైడి రాకేష్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ, ప్రజాసేవే తాను పుట్టిన గ్రామం నుండి ప్రజలకు సేవ చేయాలన్న నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు ప్రకటించారు. తాను కష్టాల కడలి నుండి వచ్చారని నిరుపేదల కష్టసుఖాలు తెలిసిన వాడిగా వారికి సేవ చేయాలనే సదుద్దేశంతో తాను రాజకీయాల్లోకి రా వస్తే తప్పేంటనని ఆయన అన్నారు. రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేద్కర్ రాజకీయాల్లో రాణించడం ప్రతి ఒక్క హక్కు అని ఆయన అన్నారు. ఈ సందర్భంగా గుర్తు చేశారు. తాను చిన్ననాటి నుండి కష్టాలను చూసినవాడిగా ప్రజలకు తన వంతుగా సేవ చేయాలని ఉద్దేశంతో రాజకీయాలకు రానున్నానని చెప్పకనే చెప్పినట్టుగా చెప్పారు. తాను రూపాయికి ఉచిత కార్పొరేట్ వైద్యాన్ని అందిస్తున్నానని అన్నారు. కన్న ఊరు రుణాన్ని



తీర్చుకునేందుకు రూపాయికి వైద్యాన్ని అందించేందుకు ముందుకు వచ్చాను అన్నారు.రాజకీయాల్లోకి ఆహ్వానం.....తాను ప్రజాసేవలోకి సందర్భంలో వివిధ పార్టీల అధిష్టాన నాయకులు తనను రాజకీయాల్లోకి రావాలని ఆహ్వానిస్తున్నారని చెప్పకనే చెప్పారు. తాను ప్రజలకు సేవ చేసేందుకు ముందుకు వచ్చేందుకు తన కుటుంబ సభ్యులు పరోక్షంగా సహకరిస్తున్నారని అన్నారు. టిఆర్ఎస్ పార్టీతో పాటు కాంగ్రెస్, టిడిపి ,బిజెపి వివిధ పార్టీల నాయకులు తాను రానున్న ఎన్నికల్లో పోటీ చేయాలంటూ ఆహ్వానాన్ని అందజేశారని ప్రకటించారు.ఉమ్మడి జిల్లాలోని కాకుండా ఇతర జిల్లాలలో తనకు ఎన్నికల్లో నిలబడేందుకు టికెట్ ఖరారు చేసేందుకు వివిధ పార్టీల అధిష్టాన నాయకులు ఆహ్వానం అందజేస్తున్నట్లు తెలిపారు. ఆర్మూర్ నిజామాబాద్ జహీరాబాద్ హైదరాబాద్ వరంగల్ టికెట్ ఖరారు చేస్తామని ఆయా పార్టీల అధిష్టానం ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. తాను రాజకీయాల్లో వస్తే స్వచ్ఛందంగా సేవ చేసేందుకు త నవంతంగా కృషి చేస్తానని స్పష్టం చేశారు.ఘనంగా జన్మదిన వేడుకలు....ఆర్మూర్ మండలంలోని అంకాపూర్ గ్రామంలో ప్రముఖ పారిశ్రామికవేత్త అంకాపూర్ రాకేష్ రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన నియోజకవర్గంలోని వివిధ మండలాల పార్టీల కతీతంగా రైతులు వివిధ పార్టీల నాయకులు జన్మదినాన్ని పురస్కరించుకొని అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలోని ఆర్మూర్ నందిపేట్,మక్లుర్ మండల వివిధ పార్టీల నాయకులు హాజరయ్యారు.

# మిల్లెట్ల ఆరోగ్య ప్రయోజనాలు, సాగు సుస్థితరత పై అవగాహన కల్పించాలి

**మిల్లెట్ ఫుడ్ పై అవగాహన కల్పించేలా ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించాలి.**

**- జిల్లా కలెక్టర్ ఆర్. వి. కర్ణన్**




కరీంనగర్ బ్యూరో,మార్చి20( మనం న్యూస్): మిల్లెట్ల ఆరోగ్య ప్రయోజనాలు మరియు మిల్లెట్ల సాగు యొక్క సుస్థిరతపై ప్రజల్లో అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ ఆర్.వి. కర్ణన్ తెలిపారు.సోమవారం కలెక్టరెట్ సమావేశ మందిరంలో మహిళా శిశు సంక్షేమ, ఎస్సీ, ఎస్టి, బీసీ, మైనార్టీ సంక్షేమ అధికారులతో మార్చి 20 నుండి ఎప్రిల్ 3 వరకు నిర్వహించనున్న పోషన్ అభియాన్ లోని పోషన్ పక్వాడ-2023 కార్యక్రమంపై జిల్లాస్థాయి కన్వర్జెన్సీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మిల్లెట్లను ఆహారంగా ప్రతిరోజు తీసుకోవడం వలన కలిగే ఆరోగ్య ప్రయోజనాలపై గర్భిణీలకు, ప్రజలకు పక్షం రోజుల పాటు అవగాహన కార్యక్రమాలను కార్యాచరణ ప్రకారం ఆవాసం చేసినట్లు తెలియజేసారు. ప్రజలకు ప్రతిరోజు మిల్లెట్ ఫుడ్ ను ఆహారంగా తీసుకోవడం వలన కలిగే ప్రయోజనాలను గురించి, ప్రజలకు మరియు ప్రతి గర్భిణి మహిళలు తీసుకోవాలని సూచించడంతో పాటు కలిగే ప్రయోజనాలను గురించి అవగాహన కల్పించాలని తెలిపారు. ఈనెల 23, 24 తేదిలలో జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ట్రైబల్, సోషల్ వెల్ఫేర్, బీసీ, మైనార్టీ పాఠశాలల్లో పోషికాహార లోపాన్ని నిర్మించడంలో మిల్లెట్ పాత్ర పై వ్యాసరచన, డ్రాయింగ్, న్యూట్రీషన్ ఫెయిర్ పోటీలను, మిల్లట్ ఫుడ్ ఉపయోగాలు మరియు ప్రయోజనాలపై కల్పించడం, ఇతర పోటీలను నిర్వహించాలని, పిల్లలు మిల్లెట్ ఫుడ్ తీసుకునేలా ప్రోత్సహించాలని, అదే విధంగా మిల్లెట్ ఫుడ్ ఫెస్టివల్ను నిర్వహించాలని పేర్కొన్నారు. జిల్లాలో ని అందరూ మహిళలకు, కిశోర బాలికలకు రక్త పరీక్షలను నిర్వహించాలని, ఇందులో ముఖ్యంగా గతంలో తీవ్రఎనిమియా ఉన్నవారికి మరోసారి పరీక్షలను నిర్వహించి, సమస్య తీవ్రతను బట్టి వారిని మెరుగైన వైద్యం కొరకు జిల్లా ప్రధాన ఆసుత్రికి పంపించాలని సూచించారు. అదేవిదంగా జిల్లాలోని అన్ని కళాశాలల విద్యార్థినులకు కూడా అనిమియా పరీక్షలను నిర్వహించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో స్ధానిక సంస్థల అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్, జిల్లా వైద్యాధికారి జువేరియా, పిడి డిఆర్డిఏ శ్రీలతారెడ్డి, డిపిఓ వీరబుచ్చయ్య, షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి నతానియెల్, వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి రాజమనోహర్, మైనారిటి శాఖ అధికారి మదుసుదన్, ట్రైబల్ వెల్ఫేర్ అధికారి గంగారాం, సిడిపిఓ లు, ఐసీడీఎస్ సూపర్వైజర్స్, పోషణ అభియాన్ జిల్లా కోఆర్డినేటర్ నాగరాజు, రొమీల, సతీష్ , మౌనిక హాజరయ్యారు.

# విద్యుత్ స్థంభం ఉంది....తీగలు ఎక్కడ..?

**- మాణిక్యారం వ్యవసాయ భూమిలో త్రీఫేస్ తీగలు మాయం - విద్యుత్ అధికారుల పనే**

**- ఎంపిటిసి శివరాత్రి పార్వతి**





కారేపల్లి రూరల్, మార్చి 20 (మనం న్యూస్) : సాధారణంగా విద్యుత్ పక్కన వాడకుండా పడవేసిన విద్యుత్ తీగలు దొంగలు ఎత్తుకెళ్ళటం జరుగుతుంది. ఇక్కడ స్థంభానికి ఉండి కొంతకాలం విద్యుత్ సరఫరా కలిగి ఉన్న విద్యుత్ తీగలు మాయమైన సంఘటన చోటు చేసుకుంది. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని మాణిక్యారం గ్రామంలోని హైస్కూల్ నుండి ఎర్రబోడు గ్రామంలోని చెరువు వరకు వ్యవసాయ భూములలో సుమారు 10సంవత్సరాల క్రితం త్రీఫేస్ విద్యుత్ లైన్ వేశారు. ఈలైన్ నుండి రైతులు తమ పోలాలకు విద్యుత్ సరఫరా చేసుకుంటూ తమ పంట పోలాల అవసరాలు తీర్చుకునే వారు. ఈ విద్యుత్ లైన్ ఆయా వ్యవసాయ ప్రాంతంలో ఉన్న సుబాబుల చెట్ల మధ్యలో నుండి వెళుతుంది. ఇటీవల సుబాబులు తీసివేయడంతో విద్యుత్ తీగలు లేకుండా మెండిస్థంబాలు రైతులకు దర్శనమిచ్చాయి. ఈ విషయాన్ని మాణిక్యారం ఎంపిటిసి పరిధిలోని రూప్లాతండా, వడ్డెరగుంపు రైతులు ఎంపిటిసి శివరాత్రి పార్వతిఅచ్చయ్య దృష్టికి తీగలు మాయమైన విషయం తీసుకుని వచ్చారు. దీంతొ ఎంపిటిసి సంఘటనా స్థలానికి వెళ్ళి పరిశీలించగా మెండి విద్యుత్ స్థంబాలు దర్శనమిచ్చాయి. పట్ల విద్యుత్ అధికారుల హస్తం ఉందని ఎంపిటిసి ఆరోపిస్తున్నారు. విద్యుత్ సరఫరా అవుతుంటే తీగలు దొంగలు తీసుకుని వెళ్ళే అవకాశం లేదని, సుమారు 20 స్ధంభాలకు సంబంధించిన తీగలు మాయం కావడం పట్ల అధికారులు హస్తం స్పష్టంగా కనిపిస్తుందన్నారు. వ్యవసాయ పోలాల్లోకి స్ధంబాలు వేయాలంటే రైతులు నిర్దేశించిన కొంత నగదు డిడి రూపంలో చెల్లించాలి, ఈ నగదు అదికారులే తీసుకునిఈతీగలు అమ్ముకుని వేరే వాటికి మళ్ళించారా..? అనే అనుమానం వస్తుందన్నారు. జిల్లా అధికారుల స్పందించకపోతే కలెక్టర్కు ఫిర్యాదు చేస్తానన్నారు.

# మాజీ ఆటగాళ్లకు మసాలా అవసరం..

## కేఎల్ రాహుల్‌కు మద్దతుగా నిలిచిన గంభీర్



న్యూఢిల్లీ: ఇటీవల కేఎల్ రాహుల్ ప్రదర్శనపై పలువురు విమర్శలు గుప్పిస్తున్న విషయం తెలిసిందే. అయితే.. మాజీ క్రికెటర్ గౌతమ్ గంభీర్ మాత్రం అతడికి మద్దతుగా నిలిచాడు. ఐపీఎల్‌లో లక్నో జట్టుకు మెంటార్‌గా గంభీర్.. కేఎ్ల విమర్శలు చేసేవారిపై విరుచుకుపడ్డాడు. మాజీ ఆటగాళ్లు యాక్టివ్‌గా ఉండటానికి వారికి మసాలా అవసరమంటూ ఎద్దేవా చేశాడు. మాజీ పేసర్ వెంకటేశ్ ప్రసాద్లాంటి వారు కేఎల్ రాహ్ప్ విమర్శలు చేసిన నేపథ్యంలో.. గంభీర్ ఈ వ్యాఖ్యలు చేశాడు.మరికొన్ని రోజుల్లో ఐపీఎల్ సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో రాహుల్ ఒత్తిడిలో ఉన్నాడా..? అని గంభీర్ను ప్రశ్నించగా.. రాహుల్ ప్రస్తుతం ఎలాంటి ఒత్తిడిలో లేడని.. ఐపీఎల్లో అతడు గొప్ప ఆటగాడని కొనియాడాడు. 'ఐపీఎల్లో గొప్ప ఆటగాడిగా కేఎల్ రాహుల్ ఎన్నోసార్లు నిరూపించుకున్నాడు. లక్నో జట్టుకు అతడు కెప్టెన్గా ఉన్నాడు. గత సీజన్లో జట్టును అతడు ప్లేఆఫ్స్‌కు చేర్చాడు. ఈ ఫార్మాట్లో ఇప్పటికే 4 శతకాలు బాదాడు. గత సీజన్లోనూ ముంబయిపై సెంచరీ కొట్టాడు. ఇక విమర్శలు చేసే వారు చాలా మంది ఉన్నారు. మాజీ క్రికెటర్లు యాక్టివ్గా ఉండేందుకు వారికి కొంత మసాలా కావాలి. అందుకే వారు విమర్శలు చేస్తుంటారు. కేఎల్ రాహుల్లాంటి ఆటగాడు ఎలాంటి ఒత్తిడికి గురికాడు' అని గంభీర్ వివరించాడు.'ఐపీఎల్, అంతర్జాతీయ క్రికెట్ భిన్నమైనవి. ఐపీఎల్‌లో వెయ్యి పరుగులు చేసినప్పటికీ.. అంతర్జాతీయ క్రికెట్లో సరిగ్గా రాణించకపోతే మీరు విమర్శలు ఎదుర్కోవాల్సి ఉంటుంది. అయితే.. అంతర్జాతీయ క్రికెట్లో భారత్ తరఫున ఆడేందుకు 15 మందికే అవకాశం లభిస్తుంది. అదే ఐపీఎల్లో 150 కంటే ఎక్కువ మంది ఆటగాళ్లకు అవకాశాలు ఉంటాయి' అని గంభీర్ పేర్కొన్నాడు. జట్టు మరోసారి ఐపీఎల్లో ఉత్తమ ప్రదర్శన చేస్తుందని గంభీర్ ఆశాభావం వ్యక్తం చేశాడు.బోర్డర్–గావస్కర్ ట్రోఫీ టెస్టు సిరీస్‌లో కేఎల్ రాహుల్ తీవ్ర విమర్శలు ఎదుర్కొన్న విషయం తెలిసిందే. రెండు టెస్టుల్లో విఫలం కావడంతోఅతడిస్థానంలో శుభ్మన్ గిల్ను తీసుకున్నారు. ఇక ఆసీస్‌తో తొలి వన్డేలో జట్టు విజయంలో కీలక పాత్ర పోషించినప్పటికీ.. రెండో వన్డేలో రాహుల్ మరోసారి తేలిపోయాడు.

# రెండో టెస్టులో తేలిపోయిన లంక..

## క్లీన్ స్వీప్ చేసిన కివీస్

న్యూఢిల్లీ: ఐసీసీ వరల్ టెస్టు ఛాంపియన్ సిప్ ఫైనల్లో రేసులో టీమిండియా, ఆస్ట్రేలియాలతో శ్రీలంక పోటీ పడింది. ఇండోర్ టెస్టు గెలిచి ఆస్ట్రేలియా నేరుగా ఫైనల్ కు అర్హత సాధించగా న్యూజిలాండ్‌తో జరిగిన తొలి టెస్టులో ఆధిక్యం చూపించి.. భారత క్రికెట్ ఫ్యాన్స్‌ని లంకేయులు కంగారు పెట్టారు. శ్రీలంక పోరాటం కారణంగా తొలి టెస్టులో ఆఖరి ఓవర్ ఆఖరి బంతి వరకూ ఉత్కంఠభరితంగా సాగింది. అయితే న్యూజిలాండ్ తో జరిగిన రెండో టెస్టులో మాత్రం లంక జట్టు అలాంటి పోరాట పటిమ చూపించలేకపోయింది. తొలి టెస్టులో రెండో వికెట్ల తేడాతో గెలిచి ఊపిరి పీల్చుకున్న న్యూజిలాండ్, రెండో టెస్టులో పూర్తి డామినేసన్ చూపించి..

ఇన్నింగ్స్ 58 పరుగుల తేడాతో భారీ విజయం సాధించింది.వెల్లింగ్టన్ టెస్టులో టస్ గెలిచిన శ్రీలంక ఫీల్డింగ్ ఎంచుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ టీమ్ 123 ఓవర్లు బ్యాటింగ్ చేసి 4 వికెట్ల నష్టానికి 580 పరుగుల భారీ స్కోర్ చేసి ఇన్నింగ్స్ డిక్లేర్ చేసింది. టామ్ లాథమ్ 21 పరుగులు చేసి అవుట్ కాగా డివాన్ కాన్వే 108 బంతుల్లో 78 పరుగులు చేశాడు. కేన్ విలియమ్సన్, హెన్రీ నికొలస్ కలిసి మూడో వికెట్ కి 370 పరుగుల భారీ భాగస్వామ్యం నెలకొల్పారు. 296 బంతుల్లో 23 ఫోర్లు, 2 సిక్సర్లతో 215 పరుగులు చేసిన



కేన్ విలియమ్సన్, టెస్టు కెరీర్ చరిత్రలో 25వ సెంచరీ అందుకున్నాడు.అహ్మదాబాద్ టెస్టులో విరాట్ కోహ్లీ 28వ సెంచరీ అందుకోగా శ్రీలంకతో తొలి టెస్టు రెండో ఇన్నింగ్స్ లో సెంచరీతో 27వ టెస్టు సెంచరీనీ కేన్ విలియమ్సన్ అందుకున్నాడు. విరాట్ కోహ్లీ టెస్టు సెంచరీని లంకేయులతో జరిగిన రెండో టెస్టులో డబుల్ సెంచరీతో కేన్ విలియమ్సన్.. విరాట్ రికార్డును సమయం చేశాడు. డార్ల్ మిచెల్ 17 పరుగుల చేసి అవుట్ కాగా హెన్రీ నికోలస్ 240 బంతుల్లో 15 ఫోర్లు, 4 సిక్సర్లతో 200 పరుగుల చేసి నాటౌట్ గా నిలిచాడు. తొలి ఇన్నింగ్స్ లో 164 పరుగులకే శ్రీలంక ఆలౌట్ అయింది. కెప్టెన్ దిముత్ కరుణరత్నే 188 బంతుల్లో 9 ఫోర్లతో 89 పరుగుల చేయగా దినేశ్ చండీమల్ 37, నిశాన్ మధుశ్క 19 పరుగులు చేశారు. మిగిలిన బ్యాటర్లు ఎవ్వరూ సింగిల్ డిజిట్ స్కోర్ కూడా చేయలేకపోయారు. శ్రీలంక ఇన్నింగ్స్ లో కుశాల్ మెండిస్, ధనంజయ్ డి సిల్వ, రజిత, అసిత ఫెర్నాండో డకౌడ్ అయ్యారు. ఫాలో ఆన్ ఆడిన లంక, 142 ఓవర్లలో 358 పరుగులకి ఆలౌట్ అయింది. ఒషాడో ఫెర్నాండో 5 పరుగులు చేయగా దిముత్ కరుణరత్నే 51 పరుగులు, కుశాల్ మెండిస్ 50, దినేశ్ చండీమల్ 62 పరుగులు చేశారు. డబుల్ సెంచరీ చేసిన హెన్రీ నికోలస్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అందుకోగా.. మాజీ కెప్టెన్ కేన్ విలియమ్సన్ ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డును అందుకున్నాడు.

# మూడో వన్డే నుంచి సూర్య ఔట్..

## క్లారిటీ ఇచ్చిన రోహిత్ శర్మ

న్యూఢిల్లీ: ఆస్ట్రేలియాతో స్వదేశంలో జరుగుతున్న మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో సూర్యకుమార్ యాదవ్ ఘోరంగా విఫలమయ్యాడు. ఇప్పటివరకు రెండు వన్డే మ్యాచ్‌లు జరగ్గా.. రెండింటిలోనూ అతడు గోల్డెన్ డక్‌గా వెనుదిరిగాడు. ఆస్ట్రేలియా స్టార్ బౌలర్ మిచెల్ స్టార్క్ అతడ్ని ఎల్బీడబ్ల్యూ రూపంలో పెవిలియన్‌కి పంపించాడు. ఈ నేపథ్యంలోనే వన్డేల్లో సూర్యని పక్కనపెట్టాలన్న అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. అభిమానులు సైతం సూర్యని తొలగించి, అతని స్థానంలో సంజూ శాంసన్‌ని జట్టులోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అయితే.. కెప్టెన్ రోహిత్ శర్మ మాత్రం అతనికి మద్దతుగా నిలిచాడు. ఒకట్రెండు మ్యాచ్లతో ఒక ఆటగాడి సామర్థ్యాన్ని అంచనా వేయలేమని, సూర్య తప్పకుండా వన్డేల్లో స్ట్రాంగ్ కంబ్యాక్ ఇస్తాడని ఆశాభావం వ్యక్తం చేశాడు.రోహిత్ శర్మ మాట్లాడుతూ.. ''జట్టులోకి శ్రేయస్ అయ్యర్ ఎప్పుడు తిరిగొస్తాడో తెలీదు. అప్పటివరకు అతని స్థానంలో సూర్య కొనసాగుతాడు. ఒకట్రెండు మ్యాచ్లతో ఓ ఆటగాడి సామర్థ్యాన్ని అంచనా వేయడం



కరెక్ట్ కాదు.సూర్య ఇప్పటికే తానేంటో నిరూపించుకున్నాడు. వైట్బాల్ క్రికెట్లో అతడో అద్భుతమైన ఆటగాడు. వన్డే ఫార్మాట్లో అతడు చేయాల్సింది ఇంకా చాలా ఉంది. తన లోపాలను సరిదిద్దుకుని, రాబోయే మ్యాచ్లో మెరుగ్గా రాణిస్తాడని ఆశిస్తున్నా. అతడు ఈ రెండు మ్యాచెస్లోనే కాదు, గత వన్డే సిరీస్లలోనూ పెద్ద రాణించలేదన్న విషయం తెలుసు. కానీ సూర్య లాంటి ఆటగాడికి జట్టు మెనెజ్మెంట్ ఎల్లప్పుడూ మద్దతుగా ఉంటుంది. మరో 7–8 మ్యాచ్లు ఆడితే, వన్డేల్లోనూ సూర్య సౌకర్యవంతంగా ఉంటాడు. అతడు అద్భుతమైన కమ్బ్యాక్ ఇవ్వాలని కోరుకుంటున్నాను'' అంటూ రోహిత్ చెప్పుకొచ్చాడు. ఇదిలావుండగా.. ఈ వన్డే సిరీస్లో ఇప్పటివరకు రెండు మ్యాచ్లు జరగ్గా, ఇరు జట్లు చెరో విజయం సాధించాయి. తొలి వన్డేలో భారత్ విజయం సాధించగా, రెండో వన్డేలో ఆస్ట్రేలియా అద్భుత విజయాన్ని నమోదు చేసింది. ఏకంగా 10 వికెట్ల తేడాతో భారత్ను ఓడించింది. దీంతో.. ఈ వన్డే సిరీస్ 1–1 తో సమం అయ్యింది. మూడో వన్డే మ్యాచ్ మార్చి 22వ తేదీన చెన్నై వేదికగా జరగనుంది. ఇందులో ఎవరు విజయం సాధిస్తారో, వారిదే ఈ సిరీస్. మరి, భారత్ మెరుగైన ప్రదర్శన కనబరుస్తుందో లేదో చూడాలి.

# ధోనీ గురించి ఆసక్తికర విషయాలు చెప్పిన ఉతప్ప



న్యూఢిల్లీ: మహేంద్ర సింగ్ ధోనీ.. ఫిట్నెస్ కోసం ఎంత కష్టపడతాడో తెలిసిందే. 41 ఏళ్ల వయసులో కూడా ఫిట్‌గా ఉండేందుకు అన్ని జాగ్రత్తలూ తీసుకుంటున్నాడు. ఈ ఐపీఎల్ సీజన్ కోసం ధోనీ చెపాక్ స్టేడియంలో ప్రాక్టీస్ చేస్తున్న వీడియోలు ఇప్పటికే సోషల్మీడియాలో వైరల్ అయ్యాయి. కాగా.. టీమ్ఇండియా మాజీ క్రికెటర్ రాబిన్ ఉతప్ప.. ధోనీ ఆహారపు అలవాట్లకు సంబంధించిన ఆసక్తికర విషయాలను బయటపెట్టాడు. బటర్ చికెన్‌ను ఆర్డర్ చేసి.. దానిని ఎలా తినేవాడో వివరించాడు.'రైనా, ఇర్ఫాన్ పఠాన్, ఆర్పీ సింగ్, పియూష్ చావ్లా, మునాఫ్ పటేల్, ధోనీ, నేను.. మేమంతా ఓ గ్రూప్. అప్పుడప్పుడూ అందరం కలిసి హోటల్‌కు వెళ్లి తినేవాళ్లం. దాల్ మఖనీ, బటర్ చికెన్, జీరా ఆలూ, గోబీ, రోటీలు ఆర్డర్ చేసే వాళ్లం. అయితే.. ధోనీ మాత్రం తినే విషయంలో చాలా కచ్చితంగా ఉంటాడు. బటర్ చికెన్ ఆర్డర్ చేసి.. చికెన్ తినకుండా కేవలం గ్రేవీ మాత్రమే తినేవాడు. ఒక వేళ చికెన్ తినాలనుకుంటే.. రోటీలను పక్కనపెట్టేవాడు. తినే విషయంలో తాను కాస్త విచిత్రంగా ఉండేవాడు' అని ఉతప్ప ఓ ఛానల్‌తో మాట్లాడుతూ ఈ విషయాలు వెల్లడించాడు.ఇక సహచర ఆటగాళ్లతో ధోనీ ఎంతో ఫ్రెండ్లీగా ఉంటాడని.. తనను మహీ అని పిలవాలని.. మహీ భాయ్ అనాల్సిన అవసరం లేదని చెప్పిన విషయాన్నీ ఉతప్ప గుర్తు చేసుకున్నాడు.

**ధోనీ ఆ విషయాల్లో ముక్కుసూటిగా ఉంటాడు..**

ఇక 14వ ఎడిషన్ ఐపీఎల్‌కు ముందు ధోనీతో తనకు జరిగిన ఓ ఘటనను ఉతప్ప గుర్తు చేసుకున్నాడు. తన సహచర ఆటగాళ్లతో కొన్ని విషయాలను ధోనీ ఎలాంటి మొహమాటం లేకుండా నేరుగానే చెబుతాడని తెలిపాడు. ''ధోనీ చాలా ఓపెన్‌గా ఉంటాడు. మీకు బాధ కలిగించినా.. నిజాలు తెలియజేయడంలో వెనుకాడడు. వేలంలో చెన్నై జట్టు నన్ను తీసుకున్నప్పుడు.. ధోనీ నన్ను పిలిచాడు. 'మీకు ఆడే అవకాశం లభిస్తుందో లేదో నాకు తెలియదు. ఎందుకంటే సీజన్ ఇంకా చాలా దూరంలో ఉంది. నేను దాని గురించి ఆలోచించడం లేదు. మీరు తుది జట్టులో ఉంటే.. నేను మీకు తెలియజేస్తాను'' అని ధోనీ నాతో అన్నాడు. ఐపీఎల్లో 13 సంవత్సరాలు విజయవంతంగా ఆడిన అనుభవం నాకు ఉంది. అయినప్పటికీ.. ధోనీ తాను ఏం చేయాలనుకుంటున్నాడో నా ముఖం మీదే చెప్పాడు. ధోనీని నేను ఇప్పటికీ అభినందిస్తున్నాను' అని ఊతప్ప వెల్లడించాడు.

# నన్ను పెళ్లి చేసుకుంటావా..?


## అభిమానికి రోహిత్ శర్మ సరదా ప్రపోజల్



న్యూఢిల్లీ: టీమ్ఇండియా కెప్టెన్ రోహిత్ శర్మ.. అభిమానులతో సరదాగా ఉంటాడు. వారిపై తన ప్రేమను చూపిస్తాడు. ఇలాంటి ఘటనే వైజాగ్‌లో చోటుచేసుకుంది. ఓ అభిమానికి హిట్‌మ్యాన్ సరదాగా ప్రేమ ప్రతిపాదన చేశాడు. పువ్వు ఇచ్చి మరీ పెళ్లి చేసుకుంటావా..? అని అడిగాడు. అసలేం జరిగిందంటే.. తొలి వన్డేకు వ్యక్తిగత కారణాలతో అందుబాటులో లేని రోహిత్ రెండో వన్డేకు జట్టుతో చేరాడు. జట్టు సభ్యులతో కలిసి వైజాగ్ విమానాశ్రయంలో దిగాడు. ఆటగాళ్లంతా బయటకు వస్తుండగా.. ఓ అభిమాని వారిని ఫాలో అవుతూ.. ఫోన్లో సెల్ఫీ వీడియో తీశాడు. ఇంతలో అతడి వద్దకు రోహిత్ వచ్చి.. తన వద్ద ఉన్న గులాబీని ఇచ్చాడు. 'తీసుకో.. ఇది నీ కోసమే.. నన్ను పెళ్లి చేసుకుంటావా..' అని సరదాగా అడిగాడు. రోహిత్ తనను పలకరించినందుకు సంతోషించిన ఆ అభిమాని.. ఆ ప్రపోజల్‌కు మాత్రం కాస్త షాక్ అయినట్లు కనిపించాడు. ఇందుకు సంబంధించిన ఓ వీడియో ఇప్పుడు నెట్టింట వైరల్‌గా మారింది.ఇక వైజాగ్ వన్డేలో టీమ్ఇండియా ఘోర ఓటమిని చవిచూసిన విషయం తెలిసిందే. అన్ని విభాగాల్లో విఫలమై.. 10 వికెట్ల తేడాతో ఆస్ట్రేలియాపై ఓడిపోయింది.

# కోర్ట్ బోను ఎక్కిన రవితేజ..?

ప్రస్తుతం సినిమా ఎవరైనా తీస్తున్నారు.. కానీ, దాన్ని ప్రజలలోకి తీసుకెళ్లడం మాత్రం కొందరే చేస్తున్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే.. ప్రమోషన్స్ ముఖ్యం బిగిలూ అన్నమాట. ఏదైనా చేయండి.. కానీ, సినిమా ఏమాత్రం ప్రేక్షకుల మనస్సులో నాటుకుపోవాలి. ఈ విషయం తెల్సినవారు సినిమాలను తీయదేం కాదు ప్రమోషన్స్‌తో కూడా అదరగొడుతున్నారు. ఎంత డిఫరెంట్ గా ప్రమోషన్స్ చేస్తే అంత పేరు వస్తుంది. అదే మాటను నమ్మినట్టు ఉన్నాడు.. మాస్ మహారాజా రవితేజ.. ఆయన కూడా డిఫరెంట్ గా తన సినిమాను ప్రమోట్ చేస్తున్నాడు. రవితేజ హీరోగా సుధీర్ వర్మ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం రావణాసుర. ఈ చిత్రంలో రవితేజ సరసన మేఘా ఆకాష్, అను ఇమ్మాన్యుయేల్, ఫరియా అబ్దుల్లా నటిస్తుండగా.. హీరో సుశాంత్ కీలక పాత్రలో నటిస్తున్నాడు. ఇప్పటికే ఈ చిత్రం నుంచి రిలీజైన సాంగ్స్, టీజర్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ఇకపోతే ఈ సినిమా ఏప్రిల్ 7 న ప్రేక్షకుల ముందుకు రానుంది. రిలీజ్ డేట్ దగ్గర పడుతుండటంతో ప్రమోషన్ల జోరును పెంచే



శారు మేకర్స్. రవితేజ, సుధీర్ వర్మ, హీరోయిన్లు.. వరుస ఇంటర్వ్యూలతో సినిమా విషయాలను పంచుకుంటున్నారు. ఇప్పటికే నాని, రవితేజ ఒక ఇంటర్వ్యూ ప్లాన్ చేసిన విషయం తెల్సిందే. తాజాగా సుమతో రావణాసుర టీమ్ ఒక ఇంటర్వ్యూ నిర్వహించారు. ఇక సుమ ఉంటే ఎలా ఉంటుందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. రావణాసుర ఒక కోర్టు డ్రామా అని టాక్. అందుకే ఇంటర్వ్యూ సెట్ లో కోర్టు బోనులు వేయించి అందులో తప్పుచేసినవారిగా ఒక పక్క రవితేజను.. ఇంకోపక్క సుధీర్ వర్మను నిలబెట్టి సుమ ప్రశ్నల వర్షం కురిపిస్తున్నట్లు తెలుస్తోంది.ఇందుకు సంబంధించిన ఫోటో నెట్టింట వైరల్‌గామారింది.ఈ సినిమాతో రవితేజ ఎలాంటిహిట్ అందుకుంటుందో చూడాలి.

మనం సినిమా


# 'బలగం' బ్యూటీ హ్యాట్రిక్ కొడుతుందా!?



బాలనటిగా పలు చిత్రాలలో నటించి, చక్కని గుర్తింపు తెచ్చుకుంది కావ్య కళ్యాణ్ రామ్. ఈ తేనె కళ్ళ సోయగం ఇప్పుడు హీరోయిన్ మారిపోయింది. గత యేడాది నవంబర్ లో విడుదలైన 'మసూద'లో కీలకపాత్ర పోషించి మెప్పించింది. అంతేకాదు ఈ హారర్ థ్రిల్లర్ మూవీ చక్కని విజయాన్ని అందుకోవడంతో తొలి సినిమాతోనే విజయాన్ని కావ్య తన కిట్ లో వేసుకున్నట్టు అయ్యింది. విశేషం ఏమంటే ఈ యేడాది మార్చి 3న విడుదలైన వేణు 'బలగం' మూవీలోనూ కావ్య కళ్యాణ్ రామ్ హీరోయిన్ గా నటించింది. 'దిల్' రాజు సమర్పణలో వచ్చిన ఈ సినిమా కూడా విజయం సాధించింది.

దాంతో హీరోయిన్‌గా కావ్య వరుసగా రెండు విజయాలను సాధించినట్టు అయ్యింది. ప్రస్తుతం అమ్మడు కీరవాణి రెండో కొడుకు శ్రీసింహ హీరోగా నటిస్తున్న 'ఉస్తాద్' మూవీలో నాయికగా చేస్తోంది. అతి త్వరలోనే ఈ సినిమా విడుదల కానుంది. 'మత్తు వదలరా' మూవీతో హీరోగా ఎంట్రీ ఇచ్చిన శ్రీసింహకు ఆ తర్వాత ఆశించిన స్థాయి దక్కలేదు. ఒకవేళ 'ఉస్తాద్' హిట్ అయితే అతనితో పాటు కావ్యకూ మంచి పేరొస్తుంది. అంతేకాదు హాట్రిక్ సక్సెస్ అందుకున్న నాయికగా గుర్తింపూ లభిస్తుంది. మరి 'ఉస్తాద్' కావ్య కెరీర్ కు ఏ మేరకు ఉపయోగపడతాడో చూడాలి.

# నటి కార్తికకు దుబాయ్ ప్రభుత్వం అరుదైన గౌరవం



సినియర్ నటి రాధ కుమార్తె కార్తిక నాయర్‌కు యుఏఈ ప్రభుత్వం నుంచి గోల్డెన్ వీసా అందుకుంది. దుబాయ్‌లోని ఉదయ్ సముద్ర గ్రూప్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్గా, కొన్ని సంవత్సరాలుగా వ్యాపార కార్యకలాపాలను అభివృద్ధి చేయడంలో విశేషమైన పాత్ర పోషిస్తుంది కార్తిక. ఈ క్రమంలో కొన్నేళ్లగా అక్కడే స్థిరపడి యంగ్ ఎంట్రప్రెన్యూవర్గా గుర్తింపు పొందిన కార్తికకు గోల్డెన్ వీసా అందజేశారు. దుబాయ్లోని టూఫోర్ 54 ప్రధాన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో యుఎఇకి చెందిన హమద్ అల్మన్సూరి కార్తికకు గోల్డెన్ వీసాను అందజేశారు. ఈ సందర్భంగా కార్తీక ఆనందం వ్యక్తం చేశారు. ''యువ మహిళా పారిశ్రామికవేత్తగా స్వాగతం పలికినందుకు యుఎఈ ప్రభుత్వానికి కృతజ్ఞతలు. ఈ గుర్తింపు పొందడం చాలా ఆనందంగా ఉంది'' అని కార్తీక నాయర్ అన్నారు. కార్తిక తల్లి రాధ గురించి పరిచయం అవసరం లేదు. 1980ల్లో ఆమె స్టార్ హీరోయిన్‌గా రాణించారు. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో స్టార్ హీరోల సరసన ఆమె నటించారు. నటిగా సినీ రంగానికి ఆమె చేసిన సేవలను గుర్తించి గతంలో రాధకు కూడా గోల్డెన్ వీసా ఇచ్చిన సంగతి తెలిసిందే! కేరళలోనూ ఉదయ్ సముద్ర గ్రూప్ హోటళ్లు, రిసార్టులు, కన్వెన్షన్ సెంటర్లు, విద్యా సంస్థలు ఉన్నాయి. తాజాగా తనకు లభించిన గుర్తింపుతో వ్యాపార అభివృద్ధికి మరింత సహకరిస్తానని కార్తిక తెలిపారు.

# నిఖిల్ రేంజ్ మామూలుగా లేదుగా!

యంగ్ హీరో నిఖిల్ సిద్ధార్థ 'కార్తికేయ 2'తో బ్లాక్‌బస్టర్ సక్సెస్ అందుకున్నాడు. ఈ మూవీ ప్రపంచవ్యాప్తంగా రూ. 121 కోట్లకు పైగా గ్రాస్ ను వసూలు చేసింది. అంతేకాదు నిఖిల్‌ను పాన్ ఇండియా స్టార్‌గా నిలబెట్టింది. 'కార్తికేయ–22 చిత్రం టీవీ ప్రీమియర్, ఓటీటీ స్ట్రీమింగ్‌లో కూడా ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. ప్రశంసలు, వసూళ్లు మాత్రమే కాకుండా అవార్డుల విభాగంలోనూ నిఖిల్ తన సత్తాను నిరూపించుకున్నాడు. తాజాగా' కార్తికేయ–22 చిత్రంతో,




ఐకానిక్ గోల్ అవార్డ్స్ 2023లో నిఖిల్ సిద్ధార్థ ఉత్తమ నటుడిగా (పాపులర్ ఛాయిస్) ఎంపికయ్యారు. 'కార్తికేయ – 2' చిత్రాన్ని పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, అభిషేక్ అగర్వాల్ ఆరట్స్ సంయుక్తంగా నిర్మించాయి. టిజి విశ్వ ప్రసాద్, వివేక్ కూచిబొట్ల, అభిషేక్ అగర్వాల్ ఈ చిత్రాన్ని ప్రొడ్యూస్ చేశారు. చందు మొండేటి ఈ చిత్రానికి దర్శకత్వం వహించాడు. ఈ చిత్రంతో చందు మొండేటి కృష్ణ తత్వాన్ని, మహిమను చెప్పడంతో పాటు, పురాణ ఇతిహాసాల్లో చెప్పిన ప్రతి అంశం శాస్త్రీయమైనదేనని బలంగా చాటాడు. ఇదిలా ఉంటే 'కార్తికేయ 22 తర్వాత వచ్చిన నిఖిల్ సిద్ధార్థ్ '18 పేజీస్' మూవీ సైతం చక్కని విజయాన్ని అందుకుంది. నిఖిల్ ప్రస్తుతం తన తదుపరి పాన్ ఇండియా చిత్రం 'స్పై'పై దృష్టి పెట్టాడు. ఈ సినిమా ఐదు భాషల్లో రానుంది.

# ఈ ఉగాదికి వస్తున్నాం..

టాలీవుడ్ సీనియర్ హీరోలు ఈ వయస్సులో కూడా చేతిలో రెండు మూడు సినిమాలకు తగ్గకుండా లైన్లో పెడుతూ కుర్ర హీరోలకు పోటీఇస్తున్నారు. చిరు, బాలయ్య, వెంకీ మామ.. వరుస సినిమాలతో ప్రేక్షకులను మెప్పిస్తున్నారు. అయితే అక్కినేని నాగార్జున మాత్రం ఇప్పటివరకు ఒక్క సినిమాను కూడా రిలీజ్ కాదు కదా కనీసం ప్రకటించకపోవడం అక్కినేని అభిమానులను కలవరపరుస్తోంది. గతేడాది ఘోస్ట్ సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన నాగ్.. ఇప్పటివరకు తన తదుపరి సినిమాను ప్రకటించలేదు. ఎవరు ఎంత మాట్లాడిన నాగ్ మాత్రం మౌనమే సమాధానమంటూ దాటేస్తూ వచ్చాడు. అయితే అందుకు కారణం.. నాగ్ రీమేక్ చేయాలనుకుంటున్న సినిమా రైట్స్ విషయంలో కొద్దిగా అవకతవకలు జరగడమే. అవును.. నాగ్.. ఒక మలయాళ సినిమాను రేంక్ చేయాలనుకుంటున్నాడు. అదే.. పోరింజు మరియమ్ జోస్. మలయాళ నటుడు జోజు జార్జ్ హీరోగా నటించిన ఈ చిత్రాన్ని నాగ్ తెలుగులో రీమేక్ చేస్తున్నాడు. ఈ చిత్రంతో రచయిత బెజవాడ ప్రసన్నకుమార్ దర్శకుడిగా



మారనున్నాడు. ఇకపోతే గత కొన్నిరోజులుగా ఈ సినిమా రైట్స్ కొనుగోలు విషయంలో జరిగిన జాప్యం వలనే నాగ్ సినిమా పట్టాలెక్కలేదట. ఇక ఈ మధ్యనే ఈ సమస్య తీరిపోవడంతో నాగ్.. తిరిగి సెట్ మీదకు వెళ్లడానికి సిద్ధమయ్యాడు. అందుతున్న సమాచారం ప్రకారం ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని ఈ సినిమా పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నారట. ఇదే కనుక నిజమైతే ఉగాది నాడు అక్కినేని అభిమానులు పండగ చేసుకోవడం ఖాయమని చెప్పొచ్చు. దీంతో నాగ్ అభిమానులు ఈ ఉగాదికి వస్తున్నాం.. రీమేక్ మొదలుపెడుతున్నాం అంతే అంటూ కామెంట్స్ పెడుతున్నారు. మరి ఈ రీమేక్ తో నాగ్ ఎలాంటి విజయాన్ని అందుకుంటాడో చూడాలి.

# మేనకగా సీనియర్ నటి మధుబాల..

సమంత ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం శాకుంతలం. గుణశేఖర్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. దిల్ రాజు సమర్పణలో నీలిమ గుణ నిర్మించిన ఈ సినిమా అనేక వాయిదాల అనంతరం ఏప్రిల్ 14న విడుదలకు సిద్ధం అవుతుంది. ఈ చిత్రంలో సమంత శకుంతలగా నటించగా, మలయాళ నటుడు దేవ్ మోహన్ దుష్యంతుడిగా నటించాడు.ఇప్పటికే ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. త్వరలోనే ఈ సినిమా విడుదల కానున్న నేపథ్యంలో కొన్ని క్యారెక్టర్లను పరిచయం చేస్తూ మేకర్స్ పోస్టర్లు వదిలారు. తాజాగా అప్సర మేనక పాత్రలో సీనియర్ హీరోయిన్ మధుబాల కనిపించనుంది. ఈ మేరకు ఆమె లుక్ని రివీల్ చేశారు మేకర్స్. మేనక కూతురే శకుంతల. అంటే ఈ చిత్రంలో మధుబాల సమంతకు తల్లిగా కనిపించనుంది. ఇప్పటికే ఆమె లుక్ నెటిజన్లను విశేషంగా ఆకట్టుకుంటుంది.



Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sri Vari Printers, D.No: 13-7-954/C1, Korlagunta, Tirupathi-517501, Chittor District (AP), And Published at H.No. 23-3-46, 1st Floor, Katamaraju vari Veedhi, Amaravathi Road, Naidupet, Guntur (District), AP-522002. CHIEF EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.APTEL/2016/73939. Phone No.040-27819999. E-mail Id: editor@manamnews.com.